www.andhrajyothy.com
పేజీలు: 14
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 66
సంచిక (Issue) : 194
గురువారం | 30-10-2025
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool |

నెల్లూరు జిల్లా కలువాయిలో నీట మునిగి గింజ మొలకెత్తడం మొదలెట్టిన వరి





కృష్ణాజిల్లా మోపిదేవివద్ద నేలకొరిగిన అరటి

రఫేల్‌లో రాష్ట్రపతి ముర్ము

2

యుద్ధవిమానంలో ప్రయాణించిన ద్రౌపది
15వేల అడుగుల ఎత్తు, గంటకు 700 కి.మీ. వేగం
మరపురాని అనుభూతి అన్న త్రివిధ దళాల అధిపతి
రెండు వేర్వేరు యుద్ధవిమానాల్లో ప్రయాణించిన తొలి రాష్ట్రపతిగా రికార్డు
రాష్ట్రపతి ముర్ముతో రఫేల్ తొలి మహిళా పైలట్ శివాంగి



శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం, తిథి: అష్టమి ఉ.10.07 తదుపరి నవమి, నక్షత్రం: శ్రవణం రా.6.33 తదుపరి ధనిష్ఠ, వర్జ్యం: రా.10.36-12.13, దుర్ముహూర్తం: ఉ.10.04-10.50, మ.2.38-3.24, అమృతఘడియలు: ఉ.7.41-9.21, రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 6.16, సూర్యాస్తమయం: 5.40

Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మొంథా తుఫాన్ పెను విధ్వంసమే సృష్టించింది. లక్షల ఎకరాల్లో పంట నీటిపాలైంది. రైతన్నకు కన్నీరే మిగిలింది. ప్రకాశం, బాపట్ల, పల్నాడు, ఉమ్మడి కృష్ణాతోపాటు రాయలసీమలోనూ భారీ స్థాయిలో పంట నష్టం జరిగింది. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం దాకా... తుఫాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు దంచి కొట్టాయి. వందలసంఖ్యలో చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఏజెన్సీతోపాటు పలుచోట్ల పూరిగుడిసెలు దెబ్బతిన్నాయి. నంద్యాల జిల్లా శ్రీశైలంలో 24 గంటల్లో అత్యధికంగా 27 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ప్రకాశం జిల్లా కేంద్రం ఒంగోలు... 25 సెంటీమీటర్ల వానతో జలమయమైంది. రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో 15 సెంటీమీటర్లకు మించి వర్షపాతం నమోదైంది. దీని ఫలితంగా వాగులూ వంకలూ పొంగిపొర్లాయి.

1.23 లక్షల హెక్టార్లలో పంట నష్టం
వెన్నుదశలోనే వొరిగిపోయిన వరి
చేతికి అందకుండాపోయిన పత్తి
కల్లాల్లోనే మొక్కజొన్నకు మొలకలు
చెట్లు, ఇళ్లు కూలి ఏడుగురు మృతి
అత్యధికంగా శ్రీశైలంలో 27 సెం.మీ. వర్షం
ఒంగోలు నగరాన్ని చుట్టుముట్టిన నీరు
రహదారులకే రూ.1,424 కోట్ల నష్టం

నీళ్ల కింద చేలు..



నెల్లూరు జిల్లా అల్లూరు ప్రాంతంలో చెరువును తలపిస్తున్న పొలాలు



ఏకమైన ఊరూ.. నీరూ..
కోనసీమ జిల్లాలో తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే



భారీ విధ్వంసం సృష్టించిన 'మొంథా' తుఫాను

తుఫాను గాయం | సర్కారు సాయం

గండ్లు.. కడగండ్లు..



బాపట్ల జిల్లా పర్చూరులో వరద నీటిలో చిక్కుకున్న 25 మందిని రక్షిస్తున్న దృశ్యం



ఒక్కరోజులో 26 సెంటీమీటర్ల వర్షం పడడంతో జలమయమైన ఒంగోలు నగరం

సమగ్ర కథనాలు 12,13,14

1,209 పునరావాస కేంద్రాల్లో 1.16 లక్షల మంది
తిరిగి వెళ్లేటప్పుడు కుటుంబానికి రూ.3 వేలు
ప్రాణాలకు తెగించి సిబ్బంది సహాయక చర్యలు
వేగంగా విద్యుత్ పునరుద్ధరణ
పడిన చెట్లు గంటల్లో తొలగింపు
సత్వర చర్యలతో బాధితులకు ఉపశమనం

ఇది ప్రకృతి సృష్టించిన బీభత్సం! అడ్డుకోవడం ఎవరికైనా అసాధ్యం! కానీ... ప్రభుత్వ ముందస్తు సన్నద్ధత, క్షేత్రస్థాయిలో యంత్రాంగం సత్వర స్పందన, సాయంతో భారీ ప్రాణనష్టం తప్పింది. బాధితులకు ఉపశమనం కలిగింది. 'మొంథా' హెచ్చరికలు వెలువడినప్పటి నుంచే సర్కారు దీనిపై దృష్టి సారించింది. తుఫాను తీరం దాటిన కొన్ని గంటలకే ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం బాధిత ప్రాంతాల్లో పర్యటించి... నష్టం తీవ్రతను పరిశీలించారు. పెనుగాలుల తీవ్రతకు పడిపోయిన చెట్లను విపత్తు స్పందన సిబ్బంది గంటల వ్యవధిలోనే తొలగించారు. వందల్లో విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో... కరెంటు మళ్లీ ఎప్పుడొస్తుందోనని జనం అనుకుంటుండగానే... ఒక్కరోజులోనే యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించగలిగారు. ప్రత్యేక శిబిరాలకు తరలించిన వారి కుటుంబాలు తిరిగి వెళ్లే సమయంలో రూ.3వేలు అందిస్తున్నారు. మృతుల కుటుంబాలకు పరిహారం ప్రకటించారు. ఇళ్లు దెబ్బతిన్నవారికీ సాయం అందించనున్నారు. పంట నష్టపోయిన రైతులందరికీ పరిహారం చెల్లించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

కుళ్లు.. మూసుకున్న కళ్లు!

మొంథాపైనా వైసీపీ బురద పంథా
బాబు, పవన్ ఏసీ గదులకు పరిమితమయ్యారట
25వ తేదీ నుంచే 19 జిల్లాలకు ఇన్‌చార్జిలుగా ఐఏఎస్‌లు
ముందు జాగ్రత్త చర్యల కోసం ఆయా జిల్లాలకు నిధులు
జిల్లాలకు స్తంభాలు, క్రేన్లు, కట్టర్లు, అదనపు సిబ్బంది
ఆర్టీజీఎస్‌లో చంద్రబాబు, పవన్, లోకేశ్ వరుస సమీక్షలు
జగన్ పార్టీకి ప్రభుత్వ చర్యలు కనిపించ లేదా!?



కృష్ణా జిల్లాలోని మచిలీపట్నంలో రోడ్డుపై పడ్డ భారీ వృక్షాన్ని తొలగిస్తున్న దృశ్యం

సత్వరమే పరిహారం!

వీలైనంత త్వరగా పంట నష్టం అంచనా: సీఎం చంద్రబాబు
ప్రభావిత జిల్లాల్లో ఏరియల్ సర్వే.. కోనసీమలో బాధితులకు పరామర్శ
నీట మునిగిన పొలాల వద్ద రైతులతో మాట్లాడి నష్టం వివరాల ఆరా
ఓడలరేవు, అరగట్లపాలెం పునరావాస శిబిరాల సందర్శన
గ్రామాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యం: డిప్యూటీ సీఎం పవన్



కోనసీమ జిల్లా బెండమూర్లంకలో పంటచేల వద్ద రైతులతో మాట్లాడుతున్న సీఎం



కొత్త జిల్లాలపై ఏర్పాటైన ఉపసంఘం భేటీలో మంత్రులు అనిత, నిమ్మల, నాదెండ్ల, నారాయణ, అనగాని, సత్యకుమార్

ఒకే డివిజన్‌లో అసెంబ్లీ స్థానం!

11

పెద్ద నియోజకవర్గాలకు రెవెన్యూ డివిజన్ హోదా!!
ఒకే డివిజన్ పరిధిలోకి ఉదయగిరి.. తిరుపతి జిల్లాలోకి నగరి..
మంత్రివర్గ ఉపసంఘం భేటీలో కీలక చర్చ.. డివిజన్లు, మండలాల మార్పుపై కసరత్తు.. మరింత అధ్యయనానికి రెవెన్యూ శాఖకు ఆదేశం

పీపీపీ ఆపలేం

అది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయం
చట్టవిరుద్ధమైతే తప్ప జోక్యం చేసుకోలేం
టెండర్ ప్రక్రియ ఆగేలా ఉత్తర్వులివ్వలేం
మెడికల్ కాలేజీలపై తేల్చిచెప్పిన హైకోర్టు
కౌంటర్ దాఖలుకు సర్కారుకు సమయం
థర్డ్ పార్టీకి హక్కులివ్వకుండా చూడాలన్న పిటిషనర్ అభ్యర్థనను తిరస్కరించిన ధర్మాసనం



అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 10 మెడికల్ కాలేజీలు, వాటికి అనుబంధంగా ఉండే ఆసుపత్రులపై పీపీపీ విధానంలో థర్డ్ పార్టీకి హక్కులు కల్పించకుండా అడ్డుకోవాలన్న పిటిషనర్ అభ్యర్థనను హైకోర్టు ధర్మాసనం తోసిపుచ్చింది. ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులూ జారీ చేయలేమని తేల్చిచెప్పింది. పబ్లిక్, ప్రైవేట్, పార్ట్‌నర్‌షిప్(పీపీపీ)తో మెడికల్ కాలేజీలు, ఆసుపత్రులు నిర్మించాలనేది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని స్పష్టం చేసింది. ఒకవేళ ఆ నిర్ణయం పూర్తిగా చట్టవిరుద్ధమైతే తప్ప కోర్టులు జోక్యం చేసుకోలేవని పేర్కొంది. కాలేజీలు, ఆసుపత్రులను పీపీపీ విధానంలో చేపట్టాలని ఎందుకు నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది?. దీని వల్ల లాభనష్టాలు ఏంటి?. అన్ని

మిగతా 11వ పేజీలో...



హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సుభేందుతో ప్రమాణం చేయిస్తున్న చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సుభేందు ప్రమాణం

11

ప్రమాణ స్వీకారం చేయించిన చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

జగన్.. కోర్టుకు రావలసిందే!



నవంబరు 14లోపు వ్యక్తిగత హాజరుకు గతంలోనే ఆదేశించామన్న కోర్టు
తప్పుడు ఫోన్ నంబర్ వ్యవహారంలో సీబీఐ పిటిషన్ కొట్టివేత
ఆ సందర్భంగా హాజరు అంశం ప్రస్తావన

9

కల్తీ నెయ్యి కేసులో వైవీ పీఏ అరెస్టు

నెల్లూరు ఏసీబీ కోర్టుకు తరలించిన సిట్
వైవీకి నోటీసులిచ్చి విచారించే చాన్స్



తిరుపతి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బుధవారం టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వ్యక్తిగత సహాయకుడు కడూరు చిన్న అప్పన్న(35)ను సిట్ అరెస్టు చేసింది. రుయాలో వైద్య పరీక్షల అనంతరం నెల్లూరు ఏసీబీ కోర్టుకు తరలించింది. ఇప్పటివరకూ ఈ కేసులో అరెస్టయిన వారిలో రాజకీయ

మిగతా 11వ పేజీలో...



అమ్మ మాట విని ఉంటే.. ఘోరం జరిగేది కాదు!

డివైడర్‌ను ఢీకొని పడిపోయాం.. అతివేగంగా వచ్చిన వి.కావేరి బస్సు బైక్‌ను దూసుకుంటూ పోయింది.. మంటలొచ్చి క్షణాల్లో ఘోరం
బెల్టు షాపులో మందు కొన్నామన్నది దుష్ప్రచారమే: ఎర్రిస్వామి

3

చావు ఏదైనా.. చిచ్చు పెట్టేద్దాం

9

ఆత్మహత్య ఘటనలో వైసీపీ శవ రాజకీయాలు.. గుంటూరు జిల్లా మహిళ మరణంపై రోత పత్రికలో విష ప్రచారం.. కందుకూరు మాదిరిగానే రెండు కులాల మధ్య చిచ్చుకు యత్నం
బంధువులు వేధిస్తే ఓ కులానికి అంటగట్టిన వైనం.. వైసీపీ ప్రచారాన్ని తిప్పికొట్టిన కుటుంబం

సునీతారెడ్డి అడిగిన అంశాలపై తదుపరి దర్యాప్తునకు సిద్ధం

9



వివేకా హత్యకేసులో సీబీఐ మెమో దాఖలు
కౌంటర్ల కోసం విచారణ నేటికి వాయిదా

త్వరలో ఇండియా అధికారిక కాలర్ ఐడీ

- కాలర్ అసలు పేరును మొబైల్ స్ర్కీన్‌పై చూపించే సీఎన్‌ఏపీ
- వచ్చే ఏడాది మార్చి 31 నాటికి దేశ వ్యాప్తంగా అమలులోకి



న్యూఢిల్లీ, అక్టోబరు 29: గుర్తు తెలియని నంబర్ల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండేందుకు చాలా మంది తమ మొబైల్ ఫోనుల్లో ట్రూకాలర్ వంటి థర్డ్ పార్టీ అప్లికేషన్లు వాడుతుంటారు. ఈ థర్డ్ పార్టీ యాప్‌ల అవసరం లేకుండా మొబైల్ ఫోన్ వినియోగదారులు ఆయా సేవలు పొందేందుకు వీలుగా.. కాలింగ్ నేమ్ ప్రజంటేషన్(సీఎన్‌ఏపీ) పేరిట భారతదేశ అధికారిక కాలర్ ఐడీ అందుబాటులోకి రాబోతుంది. మొబైల్‌కు ఇన్‌కమింగ్ కాల్ వచ్చినప్పుడు.. సదరు నంబరు ఎవరి పేరు మీద రిజిస్టర్ అయి ఉందో ఆ పేరు మొబైల్ స్ర్కీన్‌పై కనిపించనుంది. సీఎన్‌ఏపీ సేవలు తమకు వద్దు అనుకునే వారు తమ టెలికామ్ సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించి వాటిని నిలిపివేసుకోవచ్చు. ఈ సీఎన్‌ఏపీ అమలు కోసం డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీకమ్యూనికేషన్స్ (డీఓటీ) చేసిన ప్రతిపాదనకు ట్రాయ్ ఇప్పటికే ఆమోదం తెలిపింది. ట్రాయ్ ఆమోదానికి వెళ్లే ముందు.. దేశంలోని ఎంపిక చేసిన నగరాల్లో సీఎన్‌ఏపీని డీఓటీ పరీక్షించింది. పలు సాంకేతిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారంపై దృష్టిపెట్టింది. కాగా, 2026 మార్చి 31 నాటికి దేశ వ్యాప్తంగా సీఎన్‌ఏపీ సర్వీసును వినియోగదారులకు అందించాలని జియో, ఎయిర్‌టెల్, వోడాఫోన్ తదితర టెలికామ్ ఆపరేటర్లను డీఓటీ ఇప్పటికే ఆదేశించింది. వోడాఫోన్ ఐడియా, జియో సంస్థలు హరియాణాలో సీఎన్‌ఏపీ సేవలను ప్రయోగాత్మకంగా అందిస్తున్నాయి.

నేనొక్కడినే ఎందుకు తిట్లు తినాలి!

- రోడ్లపై క్యూఆర్ కోడ్‌ల ఏర్పాటు
- స్కాన్ చేస్తే కాంట్రాక్టర్ల వివరాలు
- నేరుగా వారినే ప్రశ్నించొచ్చు: గడ్కరీ



న్యూఢిల్లీ, అక్టోబరు 29: మౌలిక సదుపాయాల అభివృద్ధిలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచేందుకు దేశవ్యాప్తంగా ప్రధాన రహదారులపై క్యూఆర్ కోడ్ స్కానర్లను ఏర్పాటు చేయాలని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ ప్రతిపాదించారు. ప్రజలు ఆ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఆ రోడ్డుకు సంబంధించిన పూర్తి వివరాలు పొందగలరన్నారు. ఆ ప్రాజెక్టు కోసం పనిచేసిన కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారుల పేర్లు-ఫోన్ నంబర్లు, ఆ పనికి మంజూరు చేసిన బడ్జెట్, గడువు, నిర్వహణ వంటి కీలక విషయాలు తెలుసుకోవచ్చన్నారు. 'స్మార్ట్ రోడ్ల భవిష్యత్తు, భద్రత' అనే అంశంపై బుధవారం ఢిల్లీలో జరిగిన జరిగిన సమావేశంలో కేంద్ర మంత్రి మాట్లాడారు. రోడ్లు బాగా లేకుంటే తననే అందరూ నిందిస్తారని.. మొత్తం వ్యవస్థ చేసిన తప్పులకు తానొక్కడినే ఎందుకు తిట్లు తినాలని సరదాగా అన్నారు. అందుకే రోడ్లకు సంబంధించిన సమాచారాన్ని బహిరంగంగా ప్రకటించాలని నిర్ణయించుకున్నానని.. అప్పుడే అవినీతికి పాల్పడే వారికి నేరుగా ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. 'రోడ్లపై క్యూఆర్ కోడ్‌ల ఏర్పాటుతో దాన్ని మంజూరు చేసిన మంత్రి ఎవరు? నిర్మాణ కాంట్రాక్టర్లు, కార్యదర్శులు, ఇంజనీర్లు వారి ఫోన్ నంబర్లు, చిరునామా, ఫొటోలతో సహా ప్రజలు, మీడియాకు అందుబాటులో ఉంటాయి. తద్వారా సదరు రోడ్డు దెబ్బతిన్న, గుంతలు ఏర్పడిన నేరుగా వారికే ఫోన్ చేసి ప్రశ్నిస్తారు' అని గడ్కరీ వివరించారు.

లోకం తీరు



తమిళనాట ఉద్యోగాల కుంభకోణం!

- ఒక్కో పోస్టును రూ.25-35 లక్షలకు అమ్మేశారు
- 150 పోస్టుల విక్రయంలో రాజకీయ పెద్దల జోక్యం
- ఈడీ ఆరోపణలు..రాష్ట్ర డీజీపీకి 232 పేజీల నివేదిక

చెన్నై, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వంపై ఈడీ సంచలన ఆరోపణలు చేసింది. మునిసిపల్ పరిపాలన, నీటి సరఫరా శాఖలో ఉద్యోగాల కుంభకోణం జరిగిందని, ఒక్కొక్క పోస్టును రూ.25-35 లక్షల రూపాయల చొప్పున 150 ఉద్యోగాలను అమ్మేశారని తెలిపింది. ఈ వ్యవహారంలో రాజకీయ 'పెద్దల' జోక్యం స్పష్టంగా ఉందని పేర్కొంది. ఈ క్రమంలో 232 పేజీల నివేదికను రాష్ట్ర డీజీపీకి చేరవేసింది. లంచాలు తీసుకున్నవారి పేర్లు, ఎలా చేశారు?, నగదుకు సంబంధించిన వివరాలను నివేదికలో స్పష్టంగా పేర్కొంది. నియామక పరీక్షలు నిర్వహించిన అన్నా విశ్వవిద్యాలయం అధికారులపై కూడా దర్యాప్తు కోరింది. దీనిపై మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సూచించింది. తమిళనాడులోని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, నీటిసరఫరా(ఎంఏడబ్ల్యూఎస్) విభాగంలో 2024-25, 2025-26 సంవత్సరాలకు జరిగిన 2,538 పోస్టుల నియామక ప్రక్రియలో భారీ కుంభకోణం జరిగినట్లు ఈడీ గుర్తించింది. ఇదిలావుంటే, లంచం ఇచ్చిన వారికి అనుకూలంగా పరీక్షా ప్రక్రియను తారుమారు చేసి, ఆ తరువాత ఎంపిక చేసిన అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందజేసినట్లు ప్రతిపక్ష పార్టీలు అన్నాడీఎంకే, టీవీకేలు ఆరోపించాయి. గత ఆగస్టులో నిర్వహించిన అసిస్టెంట్ ఇంజనీర్లు, జూనియర్ ఇంజనీర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల వంటి పోస్టుల నియామకాల్లో అవినీతి జరిగినట్లు ఆయా పార్టీలు పలుమార్లు ఆరోపించడంతో పాటు ఈడీకి ఫిర్యాదు చేశాయి. లంచాలు మధ్యవర్తుల ద్వారా పంపారని, హవాలా ఏజెంట్ల ద్వారా కింగ్‌పిన్‌లకు వెళ్లాయని ఆయా పార్టీలు ఆధారాలు చూపించాయి. ఈ నేపథ్యాన్ని కూడా ప్రస్తావించిన ఈడీ ఇది వ్యవస్థీకృత మనీలాండరింగ్‌ను పోలి ఉందని పేర్కొంది. కాగా, ఉద్యోగ నియామకాల్లో అవినీతి జరిగినట్లు వస్తున్న ఆరోపణలను ఆ శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ ఖండించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగా తమపై బురద చల్లుతున్నాయని, ఇది రాజకీయ కుట్ర అని మండిపడ్డారు.

వర్సిటీల్లో పోస్టుల భర్తీకీ హెచ్ 1బీ ఉద్యోగులా?

- ఇకపై విదేశీ ఉద్యోగుల దిగుమతిని కట్టిపెట్టండి
- ఉన్నత విద్యా నియంత్రణ మండలికి ఫ్లోరిడా గవర్నర్ ఆదేశం

న్యూయార్క్, అక్టోబరు 29: హెచ్-1బీ వీసాను విశ్వవిద్యాలయాలు దుర్వినియోగం చేస్తున్నాయంటూ ఫ్లోరిడా గవర్నర్ రోన్ డీశాంటిస్ కన్నెర్రజేశారు! ఇకపై ఆ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలన్నీ ఉద్యోగాలను అమెరికన్లతోనే భర్తీ చేయాలని.. వర్క్ వీసాలపై విదేశీలయులను తీసుకొచ్చే ప్రక్రియకు చుక్కపెట్టాలని ఆదేశించారు. "అన్ని అర్హతలూ ఉన్న అమెరికన్లను ఉద్యోగాల్లో నియమించుకోవడానికి బదులుగా.. అమెరికావ్యాప్తంగా వర్సిటీలన్నీ హెచ్-1బీ వీసాలపై విదేశీ ఉద్యోగులను దిగుమతి చేసుకుంటున్నాయి. ఫ్లోరిడా విద్యా సంస్థల్లో హెచ్-1బీ వీసాల దుర్వినియోగాన్ని మేం సహించబోం" అని ఆయన మండిపడ్డారు. ఇకపై విదేశీయులను నియమించుకోవద్దని ఫ్లోరిడా బోర్డ్ ఆఫ్ గవర్నర్స్‌ను (ఫ్లోరిడాలోని అన్ని విశ్వవిద్యాలయాలనూ పర్యవేక్షించే ఉన్నత విద్యా నియంత్రణ మండలి ఇది) ఆదేశించినట్టు తెలిపారు. కంప్యూటర్ అప్లికేషన్ కో-ఆర్డినేటర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పబ్లిక్ పాలసీ ప్రొఫెసర్ల వంటి సాధారణ ఉద్యోగాల భర్తీకి సైతం చైనా వంటి దేశాల నుంచి ఉద్యోగులను దిగుమతి చేస్తున్నారని మండిపడ్డారు. "పబ్లిక్ పాలసీ గురించి చెప్పడానికి చైనా నుంచి ఎవరినైనా మనం ఎందుకు తెచ్చుకోవాలి?" అని నిలదీశారు.

జనవరిలో 'స్కైరూట్' రాకెట్ ప్రయోగం!

- తొలి ప్రైవేటు వాణిజ్య రాకెట్ ప్రయోగానికి రెడీ

న్యూఢిల్లీ, అక్టోబరు 29: భారత్‌లో త్వరలోనే తొలి ప్రైవేటు వాణిజ్య రాకెట్ అంతరిక్షంలోకి ఎగరనుంది. హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ 2026 జనవరి నాటికి తన తొలి ప్రైవేట్ వాణిజ్య రాకెట్ ప్రయోగానికి సిద్ధమవుతోంది. ఈ ప్రయోగం విజయవంతమైతే దేశ అంతరిక్ష రంగంలో కీలక మైలురాయిగా నిలవనుంది. ఇస్రోలో పనిచేసిన మాజీ శాస్త్రవేత్తలు స్కైరూట్ ఏరోస్పేస్ అనే స్టార్టప్‌ను స్థాపించారు. ఈ సంస్థ మరో మూడు నెలల్లో తన తొలి పూర్తిస్థాయి వాణిజ్య ఉపగ్రహ మిషన్ ప్రయోగాన్ని చేపట్టాలని భావిస్తోంది. 2022లో సబ్ ఆర్బిటల్ వాహనం విక్రమ్-ఎస్‌ను పరీక్షించడం ద్వారా ఈ ఘనత సాధించిన తొలి ప్రైవేటు సంస్థగా స్కైరూట్ రికార్డు సృష్టించింది. ఇప్పటి వరకు భారత్‌లో ఇస్రో మాత్రమే ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టడానికి రాకెట్ ప్రయోగాలను చేపట్టింది. చిన్న ఉపగ్రహాల ప్రయోగాలకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉండడంతో స్కైరూట్‌కు మంచి అవకాశాలు ఉంటాయని అంతరిక్ష రంగ నిపుణులు భావిస్తున్నారు.

ఇజ్రాయెల్‌తో వాయు.. బంధం!

- ఆరు ట్యాంకర్ విమానాల కోసం రూ.8వేల కోట్ల డీల్

న్యూఢిల్లీ, అక్టోబరు 29: వాయుసేనను మరింత శక్తివంతం చేస్తూ ఇజ్రాయెల్ నుంచి ఆరు ట్యాంకర్ విమానాలను కొనుగోలు చేయాలని రక్షణశాఖ నిర్ణయించినట్టు తెలిసింది. ఇజ్రాయెల్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇండస్ట్రీస్‌తో(ఐఏఐ) ఈ మేరకు త్వరలోనే రూ.8వేల కోట్ల విలువైన ఒప్పందం చేసుకోనున్నట్టు సమాచారం. ఫైటర్ జెట్లకు అవసరమైన ఇంధనాన్ని గగనతలంలోనే ట్యాంకర్ విమానాలు అందించగలవు. రఫేల్, సుఖోయ్-30 ఎంకేఐ వంటి ఫైటర్ జెట్లను ముఖ్యమైన ఆపరేషన్లకు వినియోగిస్తారు. చాలాసందర్భాల్లో అవి తమ అంతర్గత ఇంధన సామర్థ్యాన్ని దాటి కూడా ప్రయాణించాల్సి వస్తుంది. ఇలాంటి సమయంలో ట్యాంకర్ విమానాల అవసరం ఎంతో ఉంటుంది. ప్రస్తుతం వాయుసేన వద్ద రష్యాకు చెందిన 6 ట్యాంకర్ విమానాలు (ఇల్యూషిన్ 11-78 ఎమ్‌కేఐ) ఉన్నాయి. ఒకవేళ ఒప్పందం ఖరారైతే, సెకండ్ హ్యాండ్ బోయింగ్ 767 (కమర్షియల్) విమానాలను ట్యాంకర్ విమానాలుగా మార్చి మన వాయుసేనకు ఇజ్రాయెల్ సంస్థ అందిస్తుంది.

'భూ సర్వే, సర్టిఫికేషన్'పై హైకోర్టులో పిల్.. కొట్టివేత

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): స్వమిత్వ (సర్వే ఆఫ్ విలేజెస్ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రూవ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్) పథకం కింద గ్రామాల్లో భూముల సర్వే, సర్టిఫికేషన్ విధుల నుంచి పంచాయతీ కార్యదర్శులను తప్పించి, ఆ బాధ్యతను ఇంజనీరింగ్ అసిస్టెంట్ల(ఈఏ)కు అప్పగించేందుకు వీలుగా ఎస్‌వోపీని సవరించారంటూ దాఖలైన పిల్‌ను హైకోర్టు కొట్టివేసింది..గత నెల 24న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ జారీ చేసిన ఎస్‌వోపీని సవాల్ చేస్తూ పల్నాడు జిల్లా, చిలకలూరిపేట మండలం, పసుమర్రు గ్రామానికి చెందిన గుడె రవితేజ హైకోర్టులో వేసిన వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది జి.అరుణ్‌శౌరి వాదనలు వినిపించారు. సర్వే, సర్టిఫికేషన్‌కు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అర్హులు కాదన్నారు. అడిషనల్ అడ్వొకేట్ జనరల్ సాంబశివ ప్రతాప్ వాదనలు వినిపిస్తూ... పిటిషనర్ ఆరోపణలో వాస్తవం లేదన్నారు. దీనిపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం స్పందిస్తూ.. రికార్డులను పరిశీలిస్తే సర్వే విధులను నుంచి పంచాయతీ కార్యదర్శులన పక్కనపెట్టినట్లు కనపడడంలేదని తెలిపింది. ఈ నేపథ్యంలో పిల్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది.

భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటున్నాం



మోదీ చాలా బాగుంటారు.. కానీ మొండి ఘటం

- ఏపీఈసీ సదస్సులో ట్రంప్ వ్యాఖ్యలు
- భారత్‌కు చమురు తెస్తూ వెనక్కి మళ్లిన రష్యా ట్యాంకర్ నౌక

టోక్యో/సియోల్, అక్టోబరు 29: భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోబోతున్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు. దక్షిణ కొరియాలోని గియోంగ్జులో జరుగుతున్న ఆసియా-పసిఫిక్ ఆర్థిక భాగస్వామ్య(ఏపీఈసీ) సదస్సులో ఆయన ఈ విషయం చెప్పారు. వాణిజ్య ఒప్పందంపై భారత్-అమెరికా మధ్య చర్చలు ఓ కొలిక్కి వచ్చినట్టేననే వార్తల నేపథ్యంలో ట్రంప్ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. అంతేకాదు ట్రంప్ డిమాండ్ మేరకు రష్యా నుంచి చమురు దిగుమతులను భారత్ తగ్గించుకుంటుండటం గమనార్హం. ట్రంప్ ఆంక్షలు విధించిన రష్యా చమురు కంపెనీల నుంచి కొనుగోళ్లు నిలిపివేశామని ఇప్పటికే రిలయన్స్, ఐఓసీ వర్గాలు వెల్లడించాయి. తాజాగా రష్యా నుంచి భారీగా చమురుతో భారత్‌వైపు వస్తున్న ది ఫ్యూరియా అనే ట్యాంకర్ నౌక బాల్టిక్ సముద్ర ప్రాంతంలో వెనక్కి మళ్లింది. అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి రంగం సిద్ధమైందనే దానికి ఇది సంకేతమని అధికార వర్గాలు చెబుతున్నాయి.

భారీగా చమురు నింపుకొని వస్తున్నా..

ఈ ట్యాంకర్ నౌక అక్టోబరు 20న రష్యాలోని ప్రైమోర్‌స్క్ పోర్టు నుంచి సుమారు 7.3 లక్షల బ్యారెళ్ల చమురుతో బయలుదేరిందని, కానీ మంగళవారం యూటర్న్ తీసుకుందని సముద్ర రవాణాను పర్యవేక్షించే కెప్లర్ సంస్థ తెలిపింది. కొంతదూరం వెనక్కి వెళ్లాక సముద్రంలోనే నిలిచిపోయిందని వెల్లడించింది. భారత్‌లోని హెచ్‌పీసీఎల్-మిట్టల్ ఎనర్జీ సంస్థల ఉమ్మడి కంపెనీ హెచ్ఎంఈఎల్‌కు ఈ చమురు సరఫరా కావాల్సి ఉందని సమాచారం. అయితే రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్టు హెచ్ఎంఈఎల్ బుధవారం ప్రకటించింది.

మోదీలాంటి తండ్రి ఉంటే బాగుంటుంది

ప్రధాని మోదీపై ట్రంప్ మరోసారి ప్రశంసలు కురిపించారు. "మోదీ చాలా బాగుంటారు. ఆయన లాంటి తండ్రి ఉంటే బాగుంటుంది అనిపిస్తుంది. ఆయన ఒక కిల్లర్. మహా మొండి ఘటం" అని పేర్కొన్నారు. మోదీతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని చెప్పారు. అదే సమయంలో పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌ను గొప్ప వ్యక్తి, గొప్ప పోరాట యోధుడు అని ట్రంప్ అభివర్ణించారు. ఇక భారత్-పాక్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానని ట్రంప్ మరోసారి వ్యాఖ్యానించారు. తమను యుద్ధం చేసుకోనివ్వాలని మొదట ఇరు దేశాల అధినేతలు కోరారని, కానీ రెండు రోజుల తర్వాత ఫోన్ చేసి యుద్ధం నిలిపేస్తున్నట్టు చెప్పారని ట్రంప్ చెప్పారు. భారత్-పాక్ మధ్య పరస్పర దాడులు కొనసాగిన మే 7-10 తేదీల మధ్య ఏడు సరికొత్త యుద్ధ విమానాలు కూలిపోయాయని అన్నారు.


ప్రపంచానికి దీపస్తంభం భారత్

- నౌకారంగంలో వేగంగా అభివృద్ధి సాధిస్తున్నాం: మోదీ

ముంబై, అక్టోబరు 29: ప్రపంచంలో ఉద్రిక్తతలు, వాణిజ్య అంతరాయాలు, ఉత్పత్తి సంస్థల తరలింపు చోటుచేసుకుంటున్న సమయంలో.. ప్రపంచానికి దారి చూపించే దీపస్తంభంలా భారత్ నిలిచిందని మోదీ అన్నారు. వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి, శాంతి, అభివృద్ధికి భారత్ సంకేతంగా మారిందన్నారు. బుధవారం ముంబైలో మారిటైమ్ వీక్-2025లో భాగంగా నిర్వహించిన మారిటైమ్ లీడర్స్ కాంక్లేవ్‌లో మోదీ పాల్గొని మాట్లాడారు. శక్తివంతమైన ప్రజాస్వామ్యం, విశ్వసనీయతే భారత్‌ను ప్రత్యేకంగా నిలిపాయని పేర్కొన్నారు. నౌకా వాణిజ్య రంగంలో భారత్ ప్రవేశపెట్టిన నూతన విధానాలు వాణిజ్య మార్గాలను పునర్ నిర్వచించే విశాల దృక్పథంలో భాగంగా, భారత్-మధ్యప్రాచ్య-యూరప్ ఆర్థిక కారిడార్‌కు ఉదాహరణగా నిలుస్తాయని మోదీ అన్నారు. భారత నౌకారంగం గొప్ప వేగంతో శక్తివంతంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. ఇక దేశంలో అమల్లో ఉన్న శతాబ్దాల నాటి షిప్పింగ్ చట్టాలను మార్చివేసి.. 21 శతాబ్దానికి అవసరమైన ఆధునిక చట్టాలను తీసుకొచ్చామని మోదీ తెలిపారు. గతంలో రెండు మాత్రమే ఉన్న జలమార్గాల సంఖ్య 32కు పెరిగిందన్నారు. తమ దృష్టంతా బ్లూ ఎకానమీ, స్థిరమైన తీరప్రాంత అభివృద్ధిపైనే ఉంటుందని అన్నారు.

కెనడాలో భారత సంతతి పారిశ్రామికవేత్త హత్య

- గాయకుడి ఇంటిపై కాల్పులు
- లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ఘాతుకం


దర్శన్ సింగ్ సహాసి

న్యూఢిల్లీ, అక్టోబరు 29: లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ కెనడాలో ఘాతుకానికి పాల్పడింది. అక్కడ భారత సంతతి పారిశ్రామికవేత్త దర్శన్ సింగ్ సహసి(68)ని సోమవారం హత్య చేయడంతోపాటు పంజాబీ గాయకుడు చన్ని నట్టన్ ఇంటిపై కాల్పులు జరిపింది. తాము అడిగిన డబ్బు ఇవ్వకపోవడంతోనే దర్శన్ సింగ్‌ని హత్య చేసినట్లు బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యుడు గోల్డి ధిల్లాన్ ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నాడు. ఆయన పెద్ద ఎత్తున మాదక ద్రవ్యాల వ్యాపారం చేస్తున్నాడని ఆరోపించాడు. కెనడాలోని బ్రిటిష్ కొలంబియాలో ఎబాట్స్‌ఫోర్డ్ వద్ద ఉన్న దర్శన్ సింగ్ ఇంటి వద్దే ఆయన్ను కాల్చి చంపారు. రోడ్డు మీద పార్కు చేసి ఉన్న తన కారులో ఎక్కిన దర్శన్‌సింగ్‌పై అప్పటికే అక్కడికి కారులో వచ్చి వేచిఉన్న ఆగంతకుడు కాల్పులు జరిపి పరారయ్యాడు. దర్శన్‌సింగ్ కేనమ్ ఇంటర్నేషనల్ అనే పెద్ద టెక్స్‌టైల్ రీసైక్లింగ్ కంపెనీ యజమాని. 1991లో కెనడా వెళ్లిన ఆయన తొలుత చిన్న చిన్న ఉద్యోగాలు చేశారు. తర్వాత ఒక టెక్స్‌టైల్ రీసైక్లింగ్ కంపెనీని కొనుగోలు చేసి దాన్ని గ్లోబల్ కంపెనీగా తీర్చిదిద్దారు. దాతగాను పేరొందిన ఆయన హత్యపై కెనడాలోని పంజాబీ ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం అయ్యింది. కాగా, గాయకుడు సర్దార్ ఖేరాకు దగ్గరవుతున్నందుకే నట్టన్ ఇంటిపై కాల్పులు జరిపినట్లు ధిల్లాన్ సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నాడు.

భారత్‌లో స్వేచ్ఛగా ఉన్నా.. బంగ్లాదేశ్‌కు వెళ్లే ఉద్దేశం లేదు

- ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా

న్యూఢిల్లీ, అక్టోబరు 29: భారతదేశంలో తాను స్వేచ్ఛగా జీవిస్తున్నానని, ఇండియాను వదిలి వెళ్లే ఉద్దేశం తనకు లేదని బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్న షేక్ హసీనా అన్నారు. గతేడాది ఆగస్టులో బంగ్లాదేశ్‌లో హింస నేపథ్యంలో పారిపోయి ఇండియాకు వచ్చిన హసీనా బుధవారం మొట్టమొదటిసారి మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. బంగ్లాదేశ్‌లో ఫిబ్రవరిలో జరగబోయే ఎన్నికల్లో తమ పార్టీ అవామీలీగ్‌ను పోటీ చేయనివ్వకపోతే కోట్లాది మంది ప్రజలు ఎన్నికలను బహిష్కరిస్తారని ఆమె మహమ్మద్ యూనస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎన్నికల్లో తమ పార్టీ తప్ప ఏ పార్టీ గెలిచి అధికారంలోకి వచ్చినా తాను బంగ్లాదేశ్‌కు వెళ్లబోనని చెప్పారు. హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీ గుర్తింపును బంగ్లాదేశ్ ఎన్నికల సంఘం మే నెలలో రద్దు చేసింది. ఆ తర్వాత యూనస్ ప్రభుత్వం అవామీ లీగ్ కార్యకలాపాలపై నిషేధం విధించింది. ఇదిలా ఉండగా, బంగ్లాదేశ్‌లో హింస సందర్భంగా పోలీసుల కాల్పుల్లో, ఇతర ఘటనల్లో చనిపోయిన 1400 మంది కుటుంబాలకు క్షమాపణలు చెప్పడానికి హసీనా నిరాకరించారు. అయితే, సంతాపం వ్యక్తం చేశారు.

గాజా మళ్లీ రక్తసిక్తం

- ఇజ్రాయెల్ దాడుల్లో 104 మంది మృతి

టెల్‌అవీవ్/గాజా, అక్టోబరు 29: అమెరికా మధ్యవర్తిత్వంలో అక్టోబరు 10న కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ గాజాపై ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో 46 మంది చిన్నారులు సహా 104 మంది మృతిచెందారు. 253 మంది గాయపడ్డారు. దక్షిణ గాజాలో తమ బలగాలపై హమాస్ కాల్పులు జరపడానికి ప్రతీకారంగా హమాస్‌కు చెందిన 30 లక్ష్యాలపై శక్తిమంతమైన దాడులు చేశామని ఇజ్రాయెల్ తెలిపింది. దాడులు పూర్తి కాగానే తిరిగి కాల్పుల విరమణ ఒప్పందం పాటిస్తున్నామని ప్రకటించింది. అమెరికాకు సమాచారం ఇచ్చాకే ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు గాజాపై దాడులకు ఆదేశాలిచ్చారని సమాచారం. సైన్యంపై దాడిచేస్తే ప్రతిదాడులు జరపవచ్చంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇజ్రాయెల్ దాడులను సమర్థించారు. అయితే గాజాలో శాంతిని ఎవరూ అస్థిరపరచలేరని చెప్పారు. మరోవైపు కాల్పుల విరమణ ఒప్పందం ప్రకారం హమాస్ ఇంకా 13 మంది బందీల మృతదేహాలను అప్పగించాల్సి ఉంది.

తెలంగాణ మంత్రివర్గంలోకి అజారుద్దీన్

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అజారుద్దీన్‌ను మంత్రి పదవి వరించింది. రాజ్‌భవన్‌లో శుక్రవారం ఉదయం 11 గంటలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అజారుద్దీన్‌తో రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు పాల్గొంటారు. అజారుద్దీన్‌కు మైనార్టీ సంక్షేమంతోపాటుగా మరో శాఖను అప్పగించనున్నట్టు చెబుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అజారుద్దీన్ జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. అయితే అజారుద్దీన్‌ను ఎమ్మెల్సీ చేసి, మంత్రివర్గంలోకి తీసుకోవాలని నిర్ణయించారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా టీజేఎస్ చీఫ్ కోదండరాం, అజారుద్దీన్ పేర్లను మంత్రివర్గంలో ఆమోదించి, గవర్నర్‌కు పంపారు. ఈ నియామకాలకు సంబంధించి సుప్రీంకోర్టు విచారణ నేపథ్యంలో ఆ ఫైలు గవర్నర్ వద్దే పెండింగ్‌లో ఉండిపోయింది. దీనితో అజారుద్దీన్‌కు మంత్రివర్గంలో స్థానం ఆలస్యమవుతూ వచ్చింది.

పీఎం, సీఎం..రెండు పదవులూ ఖాళీ లేవు

- బిహార్ ఎన్నికల ప్రచార సభల్లో లాలూ, సోనియాపై అమిత్ షా విమర్శ


బిహార్ ఎన్నికల ప్రచారంలో అమిత్ షా

పట్నా, అక్టోబరు 29: కేంద్ర హోం మంత్రి అమిత్ షా బుధవారం బిహార్‌లో సుడిగాలి పర్యటన చేశారు. దర్భంగా, సమస్తీపూర్, బెగుసరాయ్ నగరాల్లో ఎన్నికల ప్రచార సభల్లో ప్రసంగిస్తూ ఇండియా కూటమిపై విమర్శలు సంధించారు. 'బిహార్‌లో బీజేపీ ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని మైథిలీ ఠాకూర్ వంటి అనేక మంది యువతకు టికెట్లు ఇచ్చింది. కానీ ఆర్జేడీ, కాంగ్రెస్ పార్టీలు మాత్రం ఇవ్వలేదు. ఎందుకంటే లాలూజీ ఆయన కుమారుడు తేజస్విని ముఖ్యమంత్రిని చేయాలనుకుంటున్నారు. సోనియాజీ ఆమె తనయుడు రాహుల్ ప్రధాని కావాలనుకుంటున్నారు. అయితే ఆ రెండు పదవులూ ఖాళీ లేవని వారు తెలుసుకోవాల'ని అమిత్ షా వ్యాఖ్యానించారు. లాలూ ప్రసాద్ వివిధ కుంభకోణాల కేసుల్లో కూరుకుపోగా, కాంగ్రెస్‌పై రూ.12 లక్షల కోట్ల అవినీతి కేసులు ఉన్నాయని విమర్శించారు. ప్రధాని మోదీ, బిహార్ సీఎం నితీశ్‌పై ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేదన్నారు. చొరబాటుదారుల పేర్లు ఓటర్ల జాబితాలో ఉండాలని రాహుల్ గాంధీ, లాలూ ప్రసాద్‌లు కోరుకుంటుండగా... బిహార్‌లో మళ్లీ ఆటవిక రాజ్యం తేవాలన్నది తేజస్వి, రాహుల్ ఉద్దేశమని విమర్శించారు. కాంగ్రెస్-ఆర్జేడీ అధికారంలోకి వస్తే జైళ్లలో ఉన్న నిషేధిత రాడికల్ సంస్థ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) సభ్యులను వదిలేస్తారని ఆరోపించారు. కాగా, పాట్నా జిల్లాలో ఎన్నికల ప్రచార సభలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ప్రసంగించారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి (నవంబరు 14) నాడు బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యే విషయాన్ని గుర్తు చేస్తూ.. ఎన్డీయేకు మూడింట రెండొంతుల మెజారిటీ ఇవ్వడం ఆయనకు సరైన నివాళి అని వ్యాఖ్యానించారు. నెహ్రూ తమ పార్టీకి చెందిన నాయకుడు కాకపోయినా దేశ తొలి ప్రధానిగా ఆయనను గౌరవిస్తానన్నారు.

ఓట్ల కోసం మోదీ భరతనాట్యం కూడా చేస్తారు!



ఓట్ల కోసం మోదీ ఏదైనా చేయగలరని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. 'ఛత్ పూజ కోసం చెరువులో దిగిన మోదీ.. యమునా నదిలో స్నానం చేశానంటూ కొత్త నాటకానికి తెరతీశారు. ఓట్ల కోసం ఆయన ఎన్ని నాటకాలైనా ఆడతారు. మోదీ గారూ.. మీరు నృత్యం చేస్తే మీకే ఓటేస్తామని చెప్పండి.. అంతే.. ఆయన భరత నాట్యం కూడా చేస్తారు' అని వ్యాఖ్యానించారు. నితీశ్ కుమార్ సర్కారును బీజేపీనే రిమోట్‌తో నడుపుతోందని రాహుల్ విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇండియా కూటమి సీఎం అభ్యర్థి తేజస్వీ యాదవ్‌తో కలసి రాహుల్ బుధవారం ముజఫర్‌పూర్, దర్భంగాల్లో పర్యటించారు.

రఫేల్‌లో రాష్ట్రపతి

యుద్ధవిమానంలో ప్రయాణించిన ద్రౌపది ముర్ము



న్యూఢిల్లీ, అక్టోబరు 29: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చరిత్ర సృష్టించారు. భారత వాయుసేనకు చెందిన రెండు వేర్వేరు యుద్ధ విమానాల్లో ప్రయాణించిన తొలి రాష్ట్రపతిగా నిలిచారు. బుధవారం ఆమె రఫేల్ యుద్ధ విమానంలో ప్రయాణించారు. జి-సూట్, సన్‌గ్లాస్‌లు ధరించిన ముర్ము.. హరియాణాలోని అంబాలా వైమానిక స్థావరం నుంచి ఉదయం 11.27 గంటలకు రఫేల్ యుద్ధ విమానంలో టేకాఫ్ అయ్యారు. దాదాపు 30 నిమిషాల పాటు 200 కిలోమీటర్లకు పైగా దూరం ప్రయాణించారు. విమానం 15 వేల అడుగుల ఎత్తులో, గంటకు 700 కి.మీ. వేగంతో ప్రయాణించింది. ఈ విమానాన్ని గ్రూప్ కెప్టెన్ అమిత్ గెహనీ నడిపారు. ముర్ము ప్రయాణించిన విమానానికి తోడుగా మరో రఫేల్ జెట్ వెళ్లింది. దాన్ని వైమానిక దళాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ స్వయంగా నడపడం విశేషం. రఫేల్ యుద్ధ విమానంలో ప్రయాణించి, అంబాలా వైమానిక స్థావరంలో కిందకు దిగిన అనంతరం రాష్ట్రపతి ముర్ము తన అనుభవాలను సందర్శకుల పుస్తకంలో రాశారు. "రఫేల్ యుద్ధ విమానంలో ప్రయాణించడం నాకు ఎన్నటికీ మరచిపోలేని అనుభూతి" అని ముర్ము పేర్కొన్నారు. అంతకుముందు రఫేల్ జెట్ తొలి మహిళా పైలట్, స్క్వాడ్రన్ లీడర్ శివాంగీ సింగ్ రాష్ట్రపతి ముర్ముతో కలిసి ఫొటోలకు పోజిచ్చారు. ఆపరేషన్ సిందూర్ వేళ శివాంగీని పాక్ సైన్యం బంధించినట్లుగా ఆ దేశ అనుకూల సోషల్ మీడియా ఖాతాల్లో కథనాలు వచ్చాయి. కాగా, ముర్ము 2023 ఏప్రిల్‌లో సుఖోయ్30 ఎంకేఐ యుద్ధ విమానంలో ప్రయాణించారు.

డ్రగ్స్‌పై బ్రెజిల్ యుద్ధం!

- మాదకద్రవ్య ముఠాపై పోలీసు ఆపరేషన్
- 132 మంది ముఠా సభ్యులు హతం

రియో ది జనీరో, అక్టోబరు 29: బ్రెజిల్‌లోని రియో ది జనీరో నగరంలో మంగళవారం జరిగిన ఓ పోలీసు ఆపరేషన్ ఆ ప్రాంతాన్ని యుద్ధభూమిగా మార్చింది. అత్యంత శక్తిమంతమైన రెడ్ కమాండ్ అనే మాదకద్రవ్య ముఠాను అణచివేసే లక్ష్యంతో పోలీసులు, భద్రతా బలగాలు నిర్వహించిన ఈ భారీ ఆపరేషన్‌లో 132 మృతిచెందారు. ఈ ఘటనలో నలుగురు పోలీసు అధికారులు కూడా ప్రాణాలు కోల్పోయినట్లు హోం శాఖ ప్రకటించింది. రియోలోని మురికివాడలైన అలెమావో, పెన్హా ప్రాంతాల్లో పాగా వేసిన రెండ్ కమాండ్ ముఠాను ఏరివేసేందుకు దాదాపు ఏడాది నుంచి అధికారులు ప్రణాళిక రచిస్తున్నారు. ఇందులో భాగంగానే మంగళవారం 2,500 మందికి పైగా పోలీసులు, భద్రతా బలగాలతో ఆపరేషన్ చేపట్టారు. హెలికాప్టర్లు, సాయుధ వాహనాలతో ముఠాలున్న ప్రాంతాలను చుట్టుముట్టి దాడుల నిర్వహించారు. ప్రతీకార చర్యల్లో భాగంగా ముఠా సభ్యులు డ్రోన్ దాడులకు తెగబడ్డారు. ఈ దాడుల్లో నలుగురు పోలీసు అధికారులు కూడా ప్రాణాలు కోల్పోయారని ప్రభుత్వం వెల్లడించింది. దీనిపై గవర్నర్ క్లాడియో కాస్ట్రో స్పందించారు. ఇది సాధారణ నేరం కాదని, నార్కో-టెర్రరిజమని ఆయన అభివర్ణించారు. ఈ ఆపరేషన్ కారణంగా రియో నగరంలో ఉద్రిక్తత నెలకొంది. దాడికి నిరసనగా ముఠా సభ్యులు నగరంలోని పలు రహదారులను దిగ్బంధించారు. దాదాపు 70 బస్సులను రోడ్లకు అడ్డంగా పెట్టి నిప్పంటించారు. దీంతో నగరంలో రవాణా వ్యవస్థ స్తంభించింది. కాల్పుల మోతతో రెండు ప్రాంతాల్లోని 46 పాఠశాలలకు సెలవులు ప్రకటించారు.



'బస్సు మంటల' కేసులు.. తుఫాను ఖాతాలో..!

- సీజ్ చేసిన ట్రావెల్ బస్సులను వదిలేయండి
- రవాణా అధికారులపై ప్రైవేట్ ఆపరేటర్ల ఒత్తిళ్లు
- ఎంతోకొంత జరిమానాతో సరిపెట్టాలని పైరవీలు
- తుఫానులో ఎవరు పట్టించుకుంటారని వ్యాఖ్యలు
- కర్నూలు బస్సు ప్రమాదంతో పలు బస్సులు సీజ్
- వాటిని విడిపించుకోవడానికి యజమానుల పాట్లు
- అధికారుల ఆదేశాలు.. ఆపరేటర్ల ఒత్తిళ్లతో డీటీసీలు సతమతం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రయాణికుల భద్రత గురించి పట్టించుకోరు. బస్సుల్లో సీట్ల స్థానంలోనూ, అత్యవసర ద్వారాలకు అడ్డంగా బెర్తులు ఏర్పాటు చేసి ఆదాయార్జనే లక్ష్యంగా వ్యవహరిస్తారు. రవాణా శాఖకు సమాచారం ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా బస్సులు నడుపుతారు. ప్రైవేట్ బస్సు ఆపరేటర్లు ఇంతచేస్తున్నా చూసీ చూడనట్లు వదిలేసే రవాణా శాఖ అధికారులు ఏదైనా పెద్ద ప్రమాదం జరిగినప్పుడు మాత్రం హడావుడి మొదలుపెడతారు. ఇటీవల కర్నూలు జిల్లాలో ఘోర బస్సు ప్రమాదం తర్వాత రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు చేపట్టిన ఆర్టీఏ అధికారులు.. వందలాది బస్సులపై కేసులు పెట్టి, సీజ్ చేస్తున్నారు. దీంతో బెంబేలెత్తిన ప్రైవేటు ఆపరేటర్లు బేరసారాలకు దిగుతున్నారు. 'తూతూమంత్రంగా ఫైన్లు వేసి తుఫాను చాటున మా బస్సుల్ని వదిలేయండి' అంటూ డీటీసీలు, ఆర్టీవోలపై ఒత్తిడి తెస్తున్నారు. పదో, పరకో జరిమానా వేసి వదిలేస్తే మళ్లీ బస్సులు రోడ్డెక్కిస్తామని చెబుతున్నారు. కాదని మొండిగా వ్యవహరిస్తే డ్రైవర్లకు ఉపాధి పోతుందని, తమకు ఈఎంఐలు చెల్లించడం ఇబ్బంది అవుతుందని కష్టాలు ఏకరువు పెడుతున్నారు. అప్పటికీ కుదరకపోతే అధికారంలో ఉన్న పెద్దలతో ఫోన్లు చేయిస్తున్నారు.

అనుమతి లేకుండానే మార్పులు

తెలుగు రాష్ట్రాల్లో సుమారు 3,500 ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు తిరుగుతున్నాయి. వీటిలో ఏపీ, తెలంగాణల్లో రిజిస్ట్రేషన్లు అయినవి చాలా తక్కువ. ఆలిండియా పర్మిట్ ఉన్న వాటిలో నాగాలండ్, అరుణాచల్‌ప్రదేశ్, డయ్యూ డామన్‌లలో రిజిస్టర్ చేయించినవే ఎక్కువగా ఉన్నాయి. ఆ బస్సుల యజమానులు వాటిని తిరిగి ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లాంటి పన్ను తక్కువగా ఉన్న రాష్ట్రాల్లో రీ-రిజిస్ట్రేషన్ చేయించారు. మొదటి రిజిస్ట్రేషన్ సమయంలో సీట్లతో ఉన్న బస్సులను ఎలాంటి అనుమతి తీసుకోకుండా బెర్తులుగా మార్పుచేసి నడుపుతున్నారని ఇటీవల చేపట్టిన తనిఖీల్లో బయటపడింది. ఆ బస్సులు రిజిస్ట్రేషన్ అయిన రాష్ట్రాల రవాణా అధికారులను ఇక్కడి ఆర్టీఏ అధికారులు సంప్రదించగా ఎలాంటి మార్పులకు అనుమతులు ఇవ్వలేదని తేలింది.

ఈ ప్రమాణాలు తప్పనిసరి

సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ (సీఐఆర్‌టీ), ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఆర్ఏఐ) వంటి సంస్థలు ఆమోదం తెలిపిన డిజైన్లతోనే బస్ బాడీ రూపొందించాలి. అత్యవసర ద్వారాలు ఎక్కడ ఉండాలి.. ప్రయాణికులు నడిచేందుకు ఎంత స్థలం వదలాలి... అగ్ని ప్రమాదాల సమయంలో ఎలాంటి జాగ్రత్తలు చేపట్టాలి.. అనే విషయాల్లో ఈ సంస్థలు సూచించిన ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలి. కొత్త బస్సులు కొనుగోలు చేసిన ఆర్టీసీలో ఇటువంటి రక్షణ ఏర్పాట్లు లేవంటూ రెండేళ్ల క్రితం రవాణా శాఖ రిజిస్ట్రేషన్లు ఆపేసింది. దీంతో ఆర్టీసీ అధికారులు తిరిగి వాటిని అమర్చి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కానీ ప్రైవేటు ట్రావెల్స్ మాత్రం అవేవీ పట్టించుకోలేదు. కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదం తర్వాత ఆర్టీఏ జరుపుతున్న విస్తృత తనిఖీల్లో వందలాది ప్రైవేటు ట్రావెల్స్‌లో ఉల్లంఘనలు, అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. గత నాలుగు రోజులుగా వరుస తనిఖీలు చేస్తున్న రవాణా శాఖ అధికారులు 450 బస్సులకు పైగా కేసులు రాశారు. తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడిన 185 బస్సుల వరకూ సీజ్ చేశారు. దీంతో వాటి యజమానులు జిల్లాల్లోని రవాణా శాఖ అధికారులకు ఫోన్లు చేస్తున్నారు. 'బస్సు మంటల్లో కాలిపోవడంతో మీపై ఒత్తిడి ఉంటుంది.. ఇప్పుడు తుఫాను హడావుడిలో ఇవన్నీ ఎవరు పట్టించుకుంటారు.. సీజ్ చేసిన బస్సులకు ఎంతో కొంత జరిమానా విధించి వదిలేయండి' అంటూ ఒత్తిళ్లు తీసుకొస్తున్నారు. రవాణా శాఖ కమిషనర్ మనీశ్ కుమార్ సిన్హా గట్టిగా వ్యవహరిస్తుండటంతో ఇద్దరి మధ్య నలిగిపోతున్నామంటూ ఎంవీఐల నుంచి డీటీసీల వరకూ వాపోతున్నారు.

వి.కావేరి ట్రావెల్స్ యజమాని పరారీ..!

- గాలిస్తున్న పోలీసులు.. ఇప్పటికే డ్రైవర్ అరెస్టు
- పోలీసులకు అందిన ఎఫ్ఎస్ఎల్ రిపోర్టు
- రవాణా, అగ్నిమాపక శాఖలకు పోలీసుల లేఖలు
- కర్నూలు బస్సు దుర్ఘటన కేసులో ముమ్మరంగా దర్యాప్తు

కర్నూలు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ఇటీవల జరిగిన వి.కావేరి ట్రావెల్ బస్సు ప్రమాదం కేసులో దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. బస్సు డ్రైవర్ మిరియాల లక్ష్మయ్యను మంగళవారం అరెస్టుచేసి న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా రిమాండ్ విధించారు. బస్సు యజమాని వి.వినోదకుమార్ పరారీలో ఉన్నాడని పోలీసులు పేర్కొన్నారు. ఆయన ఆచూకీ కోసం గాలిస్తున్నామన్నారు. బస్సు ప్రమాదం జరిగిన తీరుపై సాంకేతికంగా రోడ్డు రవాణా శాఖ, అగ్నిమాపక అధికారులు ఇచ్చే నివేదికలు ఎంతో కీలకమని పోలీసులు భావిస్తున్నారు. ఆ శాఖల ఉన్నతాధికారులకు పోలీస్ అధికారులు లేఖ రాశారు. వారి నుంచి రిపోర్టులు రాగానే చార్జిషీట్ దాఖలు చేసేందుకు సిద్ధం అవుతున్నారు. ఇప్పటికే విజయవాడకు చెందిన ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్) నివేదిక దర్యాప్తు అధికారులకు అందింది. పరారీలో ఉన్న బస్సు యజమానిని త్వరలోనే అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తామని పోలీసులు తెలిపారు. కాగా, కర్నూలు జిల్లా చిన్న టేకూరులో ఈనెల 24 అర్ధరాత్రి దాటాక జరిగిన వి.కావేరి ట్రావెల్ బస్సు ప్రమాదంలో 19 మంది ప్రమాణికులు అగ్నికి ఆహుతైన విషయం తెలిసిందే. ఈ ఘోర ఘటనపై కల్లూరు మండలం ఉల్లిందకొండ పోలీస్ స్టేషన్‌లో బస్సు డ్రైవర్, యజమానిపై కేసు నమోదైంది. ఈ కేసును పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య, కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబునాయుడు, ఉల్లిందకొండ ఎస్ఐ ధనుంజయ దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మ మాట విని ఉంటే.. ఘోరం జరిగేది కాదు!

- డివైడర్‌ను ఢీకొని పడిపోయాం
- అతివేగంగా వచ్చిన వి.కావేరి బస్సు బైక్‌ను దూసుకుంటూ పోయింది
- మంటలు చెలరేగి క్షణాల్లో దగ్ధం
- కర్నూలు ఘోర ప్రమాదం తీరును 'ఆంధ్రజ్యోతి'కి వివరించిన ఎర్రిస్వామి



ఎర్రిస్వామి

కర్నూలు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): "ఓరేయ్.. ఇంత రాత్రిలో ఎందుకెళ్తారురా.. ఉదయమే వెళ్లండి. అంటూ అమ్మ ఎంతచెప్పినా వినలేదు. రాత్రి ఇద్దరం మద్యం తాగి ఇంట్లో పడుకున్నాం. కానీ, 'ఎంత మత్తులో ఉన్నా నాకు బైక్ నడపడం అలవాటే.. డోన్‌లో దింపేసి వస్తా'నని మిత్రుడు శివశంకర్ బలవంతం చేస్తే పల్సర్ బైక్‌పై బయలుదేరాం. కానీ, అరగంటలోనే డివైడర్‌ను ఢీకొని రోడ్డుపై పడిపోయాం. శివశంకర్ అక్కడికక్కడే చనిపోయాడు. అత్యంత వేగంగా వచ్చిన వి.కావేరి ట్రావెల్ బస్సు రోడ్డుపై పడిన బైక్‌ను ఢీకొని దూసుకుంటూ ముందుకు వెళ్లింది. నా కళ్ల ముందే మంటలు చెలరేగి క్షణాల్లో బస్సంతా కాలిపోయింది. నాకేమీ అర్థం కాలేదు. భయపడిపోయా." అని బైక్ ప్రమాదంలో గాయాలతో బయటపడిన సి. ఎర్రిస్వామి అలియాస్ నాని వివరించారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. కర్నూలులోని చిన్నటేకూరులో జరిగిన ఘోర ప్రమాదానికి ముందు ఏం జరిగిందో వివరించారు.

పెళ్లికి వెళ్లాలని వచ్చి..

"మా నాన్న చంద్రశేఖర్ తుగ్గలి మండలం రాంపల్లిలో, అమ్మ వరలక్ష్మి కర్నూలు శివారులోని పెద్దటేకూరులో ఉంటున్నారు. నేను హైదరాబాద్ జీహెచ్ఎంసీలో చెత్త సేకరించే ఓ కాంట్రాక్టర్ వద్ద డ్రైవర్‌గా పని చేస్తున్నా. నాతో పాటు ఓ మిత్రుడు కల్యాణ్ కూడా అక్కడే పని చేస్తున్నాడు. మిత్రుడు కల్యాణ్ పెళ్లికి వెళ్లాలని గురువారం(23వ తేదీ) మధ్యాహ్నం గచ్చిబౌలి నుంచి కారులో బయలుదేరి సాయంత్రం 5 గంటలకు పెద్దటేకూరులో మా ఇంటికి వెళ్లా. అమ్మ ఇంట్లో లేదు. దీంతో మూడేళ్ల కిందటి మిత్రుడు, తాపీ పనిచేసే శివశంకర్‌కు ఫోన్ చేసి పిలిచా. వెంటనే ఇంటివి వచ్చాడు. ఈ సందర్భంగా మద్యం తాగుదామంటే శివశంకర్ పల్సర్ బైక్‌పై రాత్రి 7 గంటల సమయంలో పెద్దటేకూరులోని శ్రీ రేణుక ఎల్లమ్మ వైన్‌షాప్‌కు వెళ్లి రెండు క్వార్టర్లు మద్యం కొని ఇద్దరం అక్కడే తాగాం. 8:25 గంటల సమయంలో మరోసారి రెండు క్వార్టర్లు కొని తాగాం. డబ్బులు చెరో సగం చెల్లించాం. బెల్ట్ షాపులో మద్యం కొనలేదు. మద్యం షాపులోనే కొన్నాం. మద్యం తాగాక రాత్రి 9:15 గంటల సమయంలో ఇంటికి వెళ్లి పడుకున్నాం. రాత్రి 10:30 గంటల సమయంలో అమ్మకు ఫోన్ చేసి.. రాంపల్లిలో ఫ్రెండ్ పెళ్లికి వెళ్తున్నాను. పెళ్లి చూసుకుని రేపు రాత్రికి వస్తానని చెప్పాను. 'ఓరేయ్ ఇంత రాత్రిలో ఎందుకు వెళ్తారురా.. పొద్దునే వెళ్లోచ్చుగా.. నా మాట వినరా.. రాత్రివేళ ఎందుకు వెళ్తావు..' అని మా అమ్మ చెప్పింది. అయినా అమ్మ మాట వినలేదు.

అరగంటలో డివైడర్‌ను ఢీకొన్నాం

అర్ధరాత్రి 2:15 గంటల సమయంలో నా ఫ్రెండ్ శివశంకర్ నిద్రలేపాడు. డోన్‌లో వదిలేసి వస్తానని చెబితే.. వద్దువద్దు కర్నూలు బస్టాండ్‌లో వదిలేయ్.. అక్కడి నుంచి బస్సుకు వెళ్తానని ఎంతచెప్పినా వినలేదు. రాత్రి ఎక్కువగా మద్యం తాగడంతో మైకంలోనే ఉన్నాడు. ఈ టైంలో వద్దు.. బైక్‌కు డూంలైట్ కూడా లేదు అంటే వినలేదు. 'నాకు బైక్ నడపడం అలవాటే.. డోన్‌లో దింపేస్తాను రా!' అని బలవంతం చేస్తే అతని పల్సర్ బైక్‌పై బయలుదేరాం. బైక్‌కు హెడ్‌లైట్ కూడా లేదు. ఇండికేటర్ వెలుగులోనే బయలుదేరాం. అప్పుడు వర్షం పడడం లేదు. పది నిమిషాల్లో చిన్నటేకూరు సమీపంలో ఓ బంక్‌లో పెట్రోల్ కోసం వెళ్లాం. బంకులో పని చేసే సిబ్బంది నిద్రలో ఉన్నారు. శివశంకర్ గట్టిగా అరుస్తూ కేకలు వేశాడు. ఆ అరుపులకు లేచి అటు వైపు రమ్మంటే వెళ్లి రూ.300 పెట్రోల్ పోయించుకున్నాం. అప్పుడు సమయం 2:25 గంటలు అయి ఉంటుంది. నేషనల్ హైవేపైకి వచ్చాం.. వర్షం మొదలైంది. ఆ వర్షంలోనే ఐదారు కిలోమీటర్లు వెళ్లామో లేదో.. 70 కిలోమీటర్లకు పైగా ఓవర్ వేగంతో బైక్ నడుపుతున్న శివశంకర్ డివైడర్‌కు ఢీకొట్టగానే నేను డివైడర్ మధ్యలో గడ్డిలో పడిపోయాను. బైక్, శివశంకర్ రోడ్డు మధ్యలో పడిపోయాడు. నేను లేచివెళ్లి పలకరిస్తే ఉలుకుపలుకు లేకుండా పడి ఉన్నాడు. తల నుంచి రక్తం కారుతోంది. బలవంతంగా లాక్కుంటూ వెళ్లి రోడ్డు పక్కకు తీసుకొచ్చాను.

కళ్ల ముందే బస్సు..

ఫ్రెండ్ శివశంకర్ శవాన్ని రోడ్డుపక్కకు చేర్చాను. అదేవిధంగా రోడ్డు మధ్యలో పడిపోయిన బైక్‌ను పక్కకు తీసే ప్రయత్నం కూడా చేశాను. వాహనాలు వేగంగా వస్తుండడంతో సాధ్యం కాలేదు. బ్లూ రంగు బస్సు ఒకటి ముందుగా రోడ్డుపైన పడిన బైక్‌ను ఢీకొని వెళ్లింది. ఆ బస్సు వెళ్లిన కొన్ని క్షణాలకే పసుపు రంగులో ఉన్న బస్సు(వి.కావేరి) అతివేగంగా బెంగళూరు వైపు వెళ్తూ రోడ్డు మధ్యలో పడి వున్న మా పల్సర్ బైక్‌ను ఢీకొని దూసుకుంటూ వెళ్లడం నా కళ్లారా చూశా. బస్సు ముందు చక్రాల కింద బైక్ ఇరుక్కుని అలాగే కొంత దూరం వెళ్లింది. ఇంతలో బస్సు ముందు భాగంలో మంటలు వచ్చాయి. డ్రైవర్ బస్సు ఆపేసి ఆ మంటలను ఆర్పుతున్నట్లు గమనించాను. ఇంతలోనే మంటలు బస్సంతా వ్యాపించి బస్సు తగలబడిపోయింది. ఆ క్షణంలో నాకేమీ అర్థం కాలేదు. భయమేసింది. అప్పుడు అర్ధరాత్రి 3 గంటలు అయి ఉండవచ్చు. పోలీసులు, ఫైర్ ఇంజన్, అంబులెన్స్‌లు వచ్చాయి. నాకు భయమేసి పక్కకు వెళ్లాను. అప్పటికే ట్రాఫిక్ జామ్ అయింది. ఇదంతా నాపైకి వస్తుందేమో అని భయమేసి.. ఓ ఐచర్ డ్రైవర్‌ను లిఫ్ట్ అడిగి డోన్‌కు, అక్కడి నుంచి బస్సులో మా ఊరు రాంపల్లికి వెళ్లాను. నా మిత్రుడు శివశంకర్ సెల్‌ఫోన్ కూడా నాతోనే తీసుకెళ్లాను. యాక్సిడెంట్ జరిగిందని శివశంకర్ ఇంట్లో వాళ్లకు చెప్పలేదు.

పోలీసులు ఇంటికొచ్చారు!

తన సొంత ఊరు రాంపల్లికి వచ్చి, తన కుటుంబ సభ్యులను కలిసినా.. బస్సు ప్రమాద విషయాన్ని చెప్పలేదని ఎర్రిసామి చెప్పారు. "నాకు ఏమి తెలియనట్లు మిత్రుడు పెళ్లికి వెళ్లి వచ్చాక.. ఇంట్లో పడుకున్నా. రాత్రి 10 గంటల సమయంలో పోలీసులు వచ్చి నాన్నను విచారిస్తే.. మా అబ్బాయి ఇంట్లో పడుకున్నాడని చెప్పాడు. నన్ను కర్నూలు పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. జరిగిన విషయం పోలీసులకు చెప్పాను. నా వల్ల ప్రమాదం జరగలేదు. నా టైం బ్యాడ్. రాత్రి అమ్మ మాట వినివుంటే ఈ ఘోరం జరిగేది కాదు." అని ఎర్రిస్వామి కన్నీటి పర్యంతమయ్యారు.

పాఠశాలల విధానంపై పునఃపరిశీలన

- నవంబరులో రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్

అమరావతి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల నూతన విధానం, మంజూరైన టీచర్ పోస్టులు, కొత్త టీచర్లకు ఐడీల సృష్టి అంశాలను పునఃపరిశీలించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఇందుకోసం నవంబరు నెలలో రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ నిర్వహణ కోసం శాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు ఉత్తర్వులు జారీచేశారు. నవంబరు 3 నుంచి 18వరకు ఈ వర్క్‌షాప్ జరుగుతుంది.

ఈఏపీసెట్ రిజిస్ట్రేషన్‌కు నేటి వరకు అవకాశం

ఇంజనీరింగ్ సీట్ల భర్తీలో భాగంగా ఈఏపీసెట్ స్పాట్, కేటగిరి బీ కౌన్సెలింగ్‌లో రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల అప్‌లోడ్ గడువును గురువారం వరకు పొడిగించినట్టు ఉన్నత విద్యామండలి తెలిపింది. అలాగే లాసెట్‌లో అడ్మిషన్లు పొందిన అభ్యర్థులకు కూడా కాలేజీల్లో రిపోర్టు చేసేందుకు నేటి వరకు అవకాశం ఇచ్చింది. తుఫాను నేపథ్యంలో ఈ మేరకు గడువు పొడిగించినట్టు తెలిపింది.

టెట్ ఫీజు తగ్గించండి

ఉపాధ్యాయ అర్హత పరీక్ష రాసే అభ్యర్థులకు పరీక్ష ఫీజును తగ్గించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో కోరారు.

తస్మాత్ జాగ్రత్త!!

ఆర్‌టీఓ చలాన్ పేరుతో మాల్వేర్.. వాట్సాప్‌లో ఓపెన్ చేస్తే మొబైల్ హ్యాంగ్

విశాఖపట్నం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలో వాట్సాప్ గ్రూపుల ద్వారా 'ఆర్‌టీఓ చలాన్' పేరుతో ఒక మెసేజ్ వైరల్ అవుతోంది. "మీ వాహనంపై ఈ-చలాన్ జనరేట్ అయింది. వెంటనే చెక్ చేసుకోండి. లేదంటే మీపై కోర్టులో ఎఫ్ఐఆర్ నమోదు అవుతుంది. దీంతో పాటు వచ్చిన 'ఆర్‌టీఓ ఏపీకే'(ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజీ) ఇన్‌స్టాల్ చేసుకొని చలానా చెక్ చేసుకొండి... ఫ్రమ్, ఆర్‌టీఓ ఆఫీస్" అంటూ మెసేజ్ వస్తోంది. దాంతోపాటే 'ఈ-చలాన్ ఆర్‌టీఓ... ఏపీకే' అని వస్తోంది. చలానా ఎక్కడ పడింది?, ఎంత వేశారు?... తెలుసుకోవాలన్న ఆత్రంతో పొరపాటున ఆ అప్లికేషన్ ఓపెన్ చేస్తే ప్రమాదమే. అది అనేక పర్మిషన్లు అడుగుతుంది. అవన్నీ ఓకే చేసుకుంటూ పోతే...'వలంటీర్స్ గ్రూపు' అని ఒకటి ఆటోమేటిక్‌గా మొబైల్‌లో జనరేట్ అవుతోంది. అందులో కూడా ఇదే అప్లికేషన్ వస్తోంది. అది ఆ మొబైల్ నుంచి ఇతర వ్యక్తులకు పంపించకుండానే ఫార్వర్డ్ అవుతోంది.

నష్టం ఏమిటంటే...

మొబైల్ ఖరీదైనది, మాల్వేర్‌ను అడ్డుకునే శక్తి కలది అయితే ఫర్వాలేదు. లేదంటే వాట్సాప్ హ్యాంగ్ అయిపోతుంది. పనిచేయదు. మరికొందరికి ఫోన్‌లో బ్యాటరీ చాలా త్వరగా డ్రైయిన్ అయిపోతుంది. ఫుల్ చార్జింగ్ చేసినా అరగంటలోనే 20 శాతానికి వచ్చేస్తుంది. వెంటనే సర్వీసింగ్ సెంటర్‌కు వెళ్లి మాల్వేర్‌ను తొలగించి, సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయించుకోవలసి వస్తుం ది. ఈ క్రమంలో ఫోన్‌లో డేటా పోతుంది. సరైన పాస్‌వర్డ్‌లు లేకపోతే అకౌంట్లో డబ్బులు కూడా మాయమైపోయే ప్రమాదం ఉంది. కాబట్టి మొబైల్‌లో 'ఆర్‌టీఓ ఈ-చలానా' పేరుతో వచ్చే అప్లికేషన్ ఓపెన్ చేయకండి. దీనిపై సైబర్ పోలీసులు కూడా దృష్టి పెట్టి ప్రచారం చేయాల్సి ఉంది.



వాట్సాప్‌లో వస్తున్న మెసేజ్

బీపీసీఎల్, ఇండోసోల్ ప్రాజెక్టులకు నోడల్ అధికారిగా సాయిప్రసాద్

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా రామాయపట్నం ఇండస్ట్రియల్ క్లస్టర్‌లో భారీ పెట్టుబడులతో ఏర్పాటు చేయనున్న బీపీసీఎల్ రిఫైనరీ-పెట్రో కెమికల్ కాంప్లెక్స్, ఇండోసోల్ ఇంటిగ్రేటెడ్ సోలార్ సెల్ మాన్యుఫాక్చరింగ్ కాంప్లెక్స్ ప్రాజెక్టులకు నోడల్ అధికారిగా రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. నెల్లూరు జిల్లాలోని భారీ ప్రాజెక్టుల పనుల పురోగతిని క్రమం తప్పకుండా పర్యవేక్షించడం, త్వరగా గ్రౌండింగ్ చేయడమే లక్ష్యంగా సాయిప్రసాద్‌ను నోడల్ అధికారిగా నియమించినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఏపీ మైక్రో ఇరిగేషన్ సొసైటీ రిజిస్ట్రేషన్‌కు అనుమతి

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా 'ఏపీ మైక్రో ఇరిగేషన్ సొసైటీ'ని సహకార సంఘాల చట్టం కింద రిజిస్ట్రేషన్ చేయడానికి ప్రభుత్వం అనుమతించింది. ఇందుకోసం వ్యవసాయ, సహకార శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా జనరల్ బాడీ, ఉద్యానశాఖ డైరెక్టర్ చైర్మన్‌గా ఎగ్జిక్యూటివ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యాన రైతులకు సూక్ష్మసేద్య పథకాన్ని సజావుగా అమలు చేయడం కోసం వివిధ ఆర్థిక సంస్థల నుంచి నిధులను సమీకరించేందుకు ఏపీ మైక్రో ఇరిగేషన్ సొసైటీ ఏర్పడుతోంది.

విమానముంటేనే ఏపీకి వస్తారా..!

- ప్రజలపై జగన్ నిబద్ధతను అర్థం చేసుకోవడానికి ఇది చాలు
- తుఫాను బాధితులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుంది: లంకా దినకర్

న్యూఢిల్లీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): 'జగన్ తుఫాను సహాయక చర్యల్లో పాల్గొనడం అటుంచితే... బెంగళూరు నుంచి విమాన సర్వీసులు ప్రారంభమయ్యాక ఏపీకి వస్తానని చెప్పడం చూస్తే చాలు... ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధత ఎంతో అర్థమవుతుంది' అని 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ ఎద్దేవా చేశారు. బుధవారం ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో హుద్‌హుద్ వచ్చినప్పుడు నాడు సీఎంగా ఉన్న చంద్రబాబు విమాన సర్వీసు కోసం ఎదురుచూడకుండా బస్సులో ప్రజల వద్దకు వెళ్లి సేవ చేశారని గుర్తు చేశారు. మొంథా తుఫాను వల్ల రాష్ట్రానికి కలిగిన నష్టాన్ని ప్రభుత్వం అంచనా వేసి, బాధితులను ఆదుకుంటుందని స్పష్టం చేశారు. ఆర్టీజీఎస్ నుంచి సీఎం చంద్రబాబు తుఫాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లను, అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడం వల్ల ముందస్తు జాగ్రత్త చర్యల అమలు సాధ్యమయిందని దినకర్ వివరించారు.

పోలీసు కస్టడీకి ఉగ్రవాద సానుభూతిపరులు

ధర్మవరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నిషేధిత పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్న షాజిద్ హుసేన్, తౌసిఫ్ అస్లాంను కోర్టు అనుమతితో పోలీసులు బుధవారం మూడు రోజుల కస్టడీకి తీసుకున్నారు. వారిని ఈ నెల 18న అరెస్టు చేసి కడప జైలుకు తరలించారు. విచారణ నిమిత్తం తమ కస్టడీకి ఇవ్వాలని ధర్మవరం కోర్టులో వన్‌టౌన్ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. మూడు రోజుల కస్టడీకి (ఈ నెల 29, 30, 31 తేదీలు) కోర్టు అనుమతి ఇచ్చింది. దీంతో వారిని బుధవారం కస్టడీకి తీసుకుని, కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు విచారిస్తున్నట్టు సమాచారం. తమకు వాట్సాప్ లింకులు రావడంతో ఫార్వర్డ్ చేసి, చాటింగ్ చేశామని, వారు ఎవరో తమకు తెలియదని నిందితులు ఇద్దరూ పోలీసులకు చెప్పినట్టు తెలిసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

గాజాలో మళ్లీ...

గాజామీద ప్రళయభీకరంగా విరుచుకుపడాలని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ తన సైన్యాన్ని ఆదేశించడంతో, రాత్రివేళల్లో జరిగిన ఆ విచక్షణారహిత దాడుల్లో పసిపిల్లలతో సహా అనేకమంది మరణించారని వార్తలు వచ్చాయి. దక్షిణగాజాలో తమ బలగాలమీద హమాస్ కాల్పులు జరిపిందనీ, ప్రతీకారంగా ఈ వైమానిక దాడులకు ఆదేశాలు ఇచ్చామని నెతన్యాహూ చెప్పుకున్నారు. తాము కాల్పుల విరమణ ఒప్పందానికి కట్టుబడే ఉన్నామని, మాట తప్పిన నెతన్యాహూ మళ్ళీ మంటలు రేపుతున్నాడనీ, ఇదే వైఖరి కొనసాగితే మృతదేహాల అప్పగింత మరింత ఆలస్యం అవుతుందని హమాస్ హెచ్చరిస్తోంది. అది ఇంకా డజనుకుపైగా మృతదేహాలు ఇజ్రాయెల్‌కు అప్పగించాల్సి ఉన్నందున, వాటిని అడ్డుపెట్టుకొని ఇజ్రాయెల్ దూకుడుకు కళ్ళెం వేయగలనని అనుకుంటోంది. ఇజ్రాయెల్ మళ్ళీ భీకరయుద్ధానికి దిగడంతో ట్రంప్ కష్టపడి కుదర్చిన ఆ శాంతిఒప్పందం కూలిపోతుందేమోనని మిగతా ప్రపంచం తెగ బాధపడుతోంది. రెండేళ్ళపాటు బందీలను అడ్డుపెట్టుకొని పోరాడిన హమాస్‌కు, తాను రక్షణకవచంలాగా వాడుకున్నవారిని అప్పగించగానే ఇజ్రాయెల్ ఎంత నిర్దయగా విరుచుకుపడుతుందో తెలియదనుకోలేం. బందీల విడుదల, హమాస్ నిర్మూలన లక్ష్యంగా యుద్ధాన్ని ఆరంభించిన నెతన్యాహూ ఆ రెండిటినీ సాధించలేక కొట్టుమిట్టాడుతున్న స్థితిలో ట్రంప్ కుదర్చిన శాంతి ఒప్పందం అందుకు దారులు పరిచింది. బందీల అప్పగింత జరిగిపోయింది కనుక, ఆ రెండో లక్ష్యం సాధించుకోవడం నెతన్యాహూకు ఇక సులభమే. హమాస్ చేతిలో సజీవంగా ఉన్నవారంతా తన చేతుల్లోకి వచ్చీరాగానే, మృతదేహాల లెక్కల్లో తేడాపాడాలున్నాయంటూ నెతన్యాహూ అప్పట్లోనే విరుచుకుపడ్డారు. హమాస్ సోమవారం అప్పగించిన ఒక మృతదేహం విషయంలో ఆయనకు ఏకంగా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడం కనిపించింది. వెనువెంటనే మంత్రిపుంగవులతోనూ, భద్రతాధికారులతోనూ ఆంతరంగిక సమావేశాన్ని ఏర్పాటుచేసి, ప్రతీకారంగా ఒక్కరోజులో వందమంది పాలస్తీనియన్లను మృతదేహాలుగా మార్చేశారు. ఇజ్రాయెల్ సైనికుల మీద తాము ఏ దాడులూ చేయలేదన్న హమాస్ ప్రకటనను విశ్వసించడం ఆయనకు ఇష్టంలేకపోయింది.

ఒప్పందానికి అనుగుణంగా డెబ్బైరెండుగంటల్లో బందీలను సవ్యంగా అప్పగించిన హమాస్, మృతదేహాలను కూడా ఇచ్చేస్తుందన్న టెన్షన్ నెతన్యాహూకు ఉన్నదేమో! ఒకపక్క హమాస్ స్థావరాలు, నాయకులు లక్ష్యంగా తాను భీకరదాడులు జరుపుతూంటే, మిగిలిన దేహాలు ఇవ్వడం హమాస్‌కు కష్టమనీ, అది తెగించనూ వచ్చని నెతన్యాహూకు తెలియకపోదు. శాంతి ఒప్పందం అమల్లో ఉండగా, ఇజ్రాయెల్ ప్రధాని సైనికచర్యకు ఆదేశించడమంటే దానిని ఉల్లంఘించడమేనని అమెరికా అధ్యక్షుడికీ తెలుసు. అయినా, ఆయన మళ్ళీ ఇజ్రాయెల్ ప్రతీకార దాడులు సరైనవేనంటూ సమర్థించుకొచ్చారు, హమాస్‌ను తప్పుబట్టారు. ట్రంప్‌కు చెప్పకుండా నెతన్యాహూ ఇంత ధైర్యంగా దాడులు చేయరన్నది నిజం. ట్రంప్ బలవంతంగా కుదర్చిన ఆ శాంతి ఒప్పందంలో దాడులు తప్పుకానీ, ప్రతీకారదాడులు చేయవచ్చునని ఉన్నదేమో మరి.

ఇజ్రాయెల్‌ను నియంత్రించనిపక్షంలో కాల్పుల విరమణ నిలవదు, మృతదేహాల అప్పగింత ముందుకు సాగదు. ఉద్రిక్తతలు పెరిగిపోతూ, శాంతి ఆశలు మళ్ళీ పతనమైపోవడం బందీల బంధువులకు తీరని వ్యథ. సుదీర్ఘనిరీక్షణ తరువాత ఇప్పుడే వారిలో ఆశలు చిగురిస్తున్నాయి. అల్‌షిఫా ఆస్పత్రి పరిసరాల్లో వైమానిక దాడులు జరపడం, పసిపిల్లలను సైతం పొట్టనబెట్టుకోవడం క్షమించరాని నేరం. హమాస్‌ను విశ్వసించమని ఎవరూ అనడం లేదు. దేహాల అప్పగింతలో అది ఉద్దేశపూర్వకమైన జాప్యం చేస్తుండవచ్చు. హామీకి అనుగుణంగా వ్యవహారం నడవకపోవచ్చును. కానీ, ఆ సంస్థ లక్ష్యంగా సాగిన రెండేళ్ళ యుద్ధం లక్షమంది అమాయకుల ప్రాణాలు తీసిందే తప్ప ప్రకటిత లక్ష్యాలు సాధించలేకపోయింది. ఆహారసరఫరాలను అడ్డుకుంటూ, సాయాన్ని నిలిపివేస్తూ గాజావాసులమీద ఇజ్రాయెల్ ఇంకా ఎంతకాలం కక్షసాధించినా, ఊచకోతలు కోసినా హమాస్‌కు పోయేదేమీ లేదు. గాజాను వల్లకాడు చేయడం వినా, ఒక్కబందీని కూడా విడిపించుకోలేకపోయిన ఇజ్రాయెల్‌కు ఈ ఒప్పందం ఒక మంచి అవకాశం. రెడ్‌క్రాస్ వంటి సంస్థలు మధ్యలో ఉన్నందున అది సహనంతో, సంయమనంతో వ్యవహరించడం అవసరం. పాలస్తీనియన్లకు న్యాయం చేయని, ఇజ్రాయెల్ పక్షాన రాసిన ఈ ఒప్పందాన్ని నిలబెట్టడం ట్రంప్ చేతుల్లో ఉంది. కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉన్నదని అంటూనే ఇజ్రాయెల్, అమెరికా కలసి ఆడుతున్న ఈ నాటకాన్ని మిగతా ప్రపంచం కొనసాగనివ్వకూడదు.

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి, విభజన గాయాలు చెలరేగుతున్న అస్థిర కాలంలో మొదటి హోం శాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పటేల్, సంస్థానాలను విలీనం చేసి దేశాన్ని ఏకం చేయటంలో ప్రముఖ పాత్ర పోషించారు. తన దౌత్య చాతుర్యంతో, ధైర్యంతో, స్పష్టమైన నిర్ణయాలతో అనేక సమస్యలను పరిష్కరించారు. జాతి సమైక్య సారథిగా, నవభారత వారధిగా దేశ చరిత్రలో పటేల్ స్థానం సుస్థిరం.

దేశాన్ని ఏకం చేసిన దక్షత

ఉక్కు మనిషిగా పేరుగాంచిన గొప్ప దేశభక్తుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, రాజనీతిజ్ఞుడు సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్. దేశ సమైక్యత, సమగ్రత పట్ల ఆయన దూరదృష్టి, సాహసం, స్వాతంత్ర్యం సిద్ధించిన తొలినాళ్లలో పలు విపత్కర సమస్యలను ఎదుర్కొని దేశాన్ని ముందుకు నడిపించిన విధానాన్ని ప్రజలందరూ ఇప్పటికీ గుర్తుచేసుకుంటున్నారు.

గుజరాత్‌లోని నాడియాడ్‌లో 1875 అక్టోబర్ 31న జన్మించిన వల్లభ్‌భాయ్, బారిష్టరు చదువు పూర్తి చేసుకొని అహ్మదాబాద్‌లో లాయరుగా పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. మహాత్మాగాంధీ పిలుపు మేరకు స్వాతంత్ర్య ఉద్యమంలో అడుగుపెట్టి, గాంధీతో పాటు ఎన్నో పోరాటాల్లో భాగస్వాములయ్యారు. లాయర్‌గా తన ప్రాక్టీస్‌ను వదిలిపెట్టి ఉద్యమాలు సాగించారు. పాశ్చాత్య వస్త్రధారణ వదిలేసి, నిరాడంబరత అలవర్చుకుని, స్వదేశీ భావనకు అలవాటుపడ్డారు. మహాత్మాగాంధీ ఆలోచనలను, భావాలను సరైన దృష్టికోణం నుంచి అర్థం చేసుకున్న రాజకీయ నాయకులలో సర్దార్ పటేల్ ఒకరు. గాంధీజీ 'స్వరాజ్యం నుంచి సురాజ్యం' గురించి చెబితే, పటేల్ స్వరాజ్యాన్ని సురాజ్యంగా మార్పు చేసే సుపరిపాలనకు, సంస్కరణలకు దారితీసిన ఆద్యుడు. గుజరాత్‌లోని ఖేడా, బార్డోలీ ప్రాంతాల్లో గాంధీ ప్రేరణతో పటేల్ నడిపిన సత్యాగ్రహం, అపూర్వమైన రైతాంగ ఉద్యమం ఆయనకు చరిత్రలో చిరస్థానాన్ని కల్పించాయి.

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి, విభజన గాయాలు చెలరేగుతున్న అస్థిర కాలంలో మొదటి హోం శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పటేల్ మొదట సంస్థానాలను విలీనం చేసి దేశాన్ని ఏకం చేయటంలో ప్రముఖ పాత్ర పోషించారు. తన దౌత్య చాతుర్యంతో, ధైర్యంతో, స్పష్టమైన నిర్ణయాలతో అనేక సమస్యలను పరిష్కరించారు. బ్రిటిష్ పాలకులు దేశానికి స్వాతంత్ర్యం ఇచ్చినప్పటికీ సంస్థానాల విషయంలో మెలిక పెట్టి వెళ్లడం సమస్యగా మారింది. అప్పటికి దేశంలో ఉన్న 565 సంస్థానాలకు స్వయం నిర్ణయాధికారాన్ని కట్టబెట్టారు ఆంగ్లేయులు. అందులో 562 సంస్థానాలను సామ దాన భేద దండోపాయాలతో పటేల్ భారత్‌లో చేర్చగా... కశ్మీర్, జునాగఢ్, హైదరాబాద్ సంస్థానాలు మాత్రం స్వతంత్ర రాజ్యాలుగా ఉంటామని భీష్మించాయి.

గుజరాత్‌లోని జాంనగర్ పూర్వ రాజైన జాంసాహిబ్‌కు చెందినది. అధికార బదిలీకి ఇంకా రెండు నెలల గడువు ఉండగా ఈలోపే జాంసాహిబ్ కతియావర్ ప్రాంత రాష్ట్రాలన్నిటినీ కలిపి పాకిస్థాన్ సహాయంతో ఒక స్వతంత్ర రాజ్యంగా ఏర్పాటు చేయాలనుకున్నాడు. ఈ ఉద్దేశ్యంతో ఢిల్లీలోని తోటి సంస్థానాధీశులను కలవబోతున్నాడని పటేల్‌కు తెలిసింది. ఆ వెంటనే జాంసాహిబ్ సోదరుడైన కల్నల్ హిమ్మత్‌సింగ్ ద్వారా వారిని తన ఇంటికి విందుకు తీసుకురావాలని పటేల్ కోరాడు. భోజన సందర్భంలో పటేల్ తన ఆత్మీయతతో, ప్రేమతో జాంసాహిబ్ హృదయాన్ని గెలుచుకున్నారు. జాంసాహిబ్ స్వతంత్ర రాజ్యం ఏర్పాటు చేయాలన్న ప్రణాళికను విరమించుకున్నాడు.




మరో సంఘటన షేక్ అబ్దుల్లాకు సంబంధించినది. కశ్మీర్‌ను పాలిస్తున్న రాజా హరిసింగ్ భారత యూనియన్‌లో కలవాలనుకోగా, కశ్మీర్‌లో 'నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ' నాయకుడు షేక్ అబ్దుల్లా మాత్రం కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి ఆశించి, దానికై ఎడతెగని ప్రయత్నాలు ఆరంభించాడు. దేశానికి మకుటమైన కశ్మీర్– రక్షణ దృష్ట్యా, సంస్కృతి దృష్ట్యా, ప్రకృతి సౌందర్యం దృష్ట్యా ఎంతో కీలకమైన ప్రదేశం. రాజ్యాంగ పరిషత్‌లో కశ్మీర్‌కు సంబంధించిన 'ఆర్టికల్ 370'పై చర్చిస్తున్న సమయంలో అసహనంతో ఉన్న షేక్ అబ్దుల్లా తన స్థానం నుంచి లేచి "నేను తిరిగి కశ్మీర్‌కు వెళుతున్నాను" అని సభలో ప్రకటించాడు. దీంతో ప్రధాని నెహ్రూ లేని కారణంగా రాజ్యాంగ పరిషత్‌లో ఉన్న పటేల్, "ఈ రోజు సభ నుంచి వెళ్లి రైలులో కూర్చోవచ్చు. కానీ ఆ రైలు మాత్రం ఢిల్లీని దాటి వెళ్లబోదు" అనే సందేశాన్ని తెలియజేశారు. పరిణామాలను గ్రహించిన షేక్ అబ్దుల్లా తన ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు.

హైదరాబాద్ సంస్థానం ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ పాలనలో ఉంది. సొంత కరెన్సీ, సొంత రైల్వే, సొంత సైన్యం ఉన్న హైదరాబాద్‌ను స్వతంత్ర రాజ్యంగా ఉంచాలని నిజాం ప్రయత్నించారు. భారత్‌లో విలీనానికి గడువు కావాలని, అప్పటివరకు స్వతంత్రంగా ఉంటామని ప్రతిపాదించారు. అందుకు పటేల్ అంగీకరించలేదు. ఎందుకంటే, భారత్‌తో గడువు కోరిన నిజాం, మరోవైపు పాకిస్థాన్‌కు రూ.20 కోట్లు ఇచ్చినట్లుగా ఆధారాలు దొరికాయి. అంతేగాక, హైదరాబాద్ సంస్థానం తరఫున కరాచీలో ప్రజా సంబంధాల అధికారిని కూడా నిజాం నియమించారు. దీంతో నిజాం వైఖరిపై పటేల్‌కు సందేహం కలిగింది. పటేల్ ఆదేశాలతో మేజర్ జనరల్ జె.ఎన్.చౌధరి నేతృత్వంలో 'ఆపరేషన్ పోలో' 1948 సెప్టెంబర్ 13న మొదలై అదే నెల 18 సాయంత్రానికి పూర్తయింది. సైనిక చర్య ద్వారా హైదరాబాద్ సంస్థానాన్ని రెండు వైపుల నుంచి ముట్టడించి పటేల్ స్వాధీనం చేసుకున్నారు. సెప్టెంబర్ 17న భారత్ యూనియన్‌లో విలీనం చేసి హైదరాబాద్ రాష్ట్రంలో మువ్వన్నెల భారత పతకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా పటేల్‌ను ఉద్దేశించి రష్యా ప్రధాని నికోలయి బుల్గనిన్ "మీరు రాజులను అంతం చేయకుండానే, రాజుల పాలనను అంతం చేశారు" అంటూ చేసిన వ్యాఖ్యలు పటేల్ పరిపాలనా దక్షతకు అద్దం పడుతుంది.

పటేల్ ఒక వైపు సంస్థానాల విలీనంతో పాటు మరోవైపు భారత పరిపాలన వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు కూడా కృషి చేశారు. స్వాతంత్ర్యానంతరం పాలనలో సారూప్యతను, దేశ సమైక్యతను సాధించాలనే సంకల్పంతో అఖిల భారత సర్వీసులను (ఐఏఎస్, ఐపీఎస్) ఏర్పాటు చేశారు. అందుకే ఆయనను అఖిల భారత సివిల్ సర్వీసుల పితామహుడుగా ("Father of All India Services") అభివర్ణిస్తారు. పోలీస్ వ్యవస్థను బలోపేతం చేయడంలో పటేల్ కృషి మరువలేనిది. మొదటి సాంస్కృతికశాఖా మంత్రిగా కూడా బాధ్యతలు అందించిన పటేల్ గుజరాత్‌లోని సోమనాథ్ దేవాలయ పునర్నిర్మాణానికి పూనుకున్నారు. అంతర్గత భద్రత వ్యవస్థ, సరిహద్దు పరిరక్షణ, రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ మొదలైన అంశాలపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.

నేడు దేశ సమగ్రత, సమైక్యత అత్యంత ప్రధానమైన అంశం. భాష పేరుతో, మతం పేరుతో, కులం పేరుతో రెచ్చగొట్టి దేశాన్ని ముక్కలు ముక్కలు చెయ్యాలని చూస్తున్న విదేశీ స్వార్థ శక్తులకు స్వదేశంలో కూడా వంత పాడేవాళ్లు తోడయ్యారు. దేశంలోను 'దక్షిణమూ ఉత్తరమూ వేర్వేరు' అనే భావనను రేకెత్తించేందుకు కొందరు పన్నుతున్న కుయుక్తులను అణచివేసి మనమందరం '145 కోట్ల భారతీయులం' అన్న భావన తీసుకురావడమే ప్రధాన లక్ష్యం. ఆనాడు పటేల్ ఈ దృఢ సంకల్పంతోనే రజాకార్లను, ప్రత్యేకవాదులను అణచివేశాడు. నేడు పటేల్ స్ఫూర్తితో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదులకు గట్టి గుణపాఠం నేర్పింది.

జాతి సమైక్య సారథిగా, నవభారత వారధిగా మన దేశ చరిత్రలో పటేల్ స్థానం సుస్థిరం. పటేల్ అంత్యక్రియలకు హాజరైన నాటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ "సర్దార్ శరీరాన్ని ఈ అగ్ని దహించివేయొచ్చు. కానీ, ఆయన కీర్తిని దహించే అగ్ని ఈ ప్రపంచంలో లేదు" అన్నారు. కాలాలు మారినా ఇనుమడిస్తున్న ఆయన కీర్తే అందుకు ఋజువు.



• బండారు దత్తాత్రేయ
మాజీ గవర్నర్

(రేపు సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతి)

గూగుల్ డేటా సెంటర్: అపోహలు - వాస్తవాలు

విశాఖపట్నంలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో డేటా సెంటర్‌ను నిర్మించబోతోందనే వార్తలు వెలువడగానే అనేక ఇతర రాష్ట్రాలతో పాటు రాష్ట్రంలోని ప్రతిపక్షం కూడా ప్రభుత్వంపైన ప్రతికూలంగా స్పందించింది. తద్వారా అసలు 'డేటా సెంటర్' అంటే ఏమిటి? దీని ప్రాధాన్యం ఏమిటి? సమాజానికి దీని అవసరం ఉందా? అనే ప్రశ్నలు సహజంగానే తలెత్తుతాయి.

మనం యూట్యూబ్‌లో సినిమానో, ఫేస్‌బుక్‌లో రీల్‌నో స్ట్రీమ్ చేసినప్పుడూ; గూగుల్ పేనో ఫోన్ పేనో చెల్లింపుల కోసం వాడినప్పుడూ, గూగుల్‌నో, చాట్ జీపీటీనో ప్రశ్న అడిగినప్పుడూ, వాట్సాప్‌లో మెసేజ్‌లు పంపినప్పుడూ... ఈ డేటా అంతా ఎక్కడో ఒకచోట ఉండాలి. ఇది కేవలం 'క్లౌడ్'లో తేలుతూ ఉండదు. ఇది ప్రత్యేకమైన, అత్యంత సురక్షితమైన భవనంలో నెలకొల్పబడిన డేటా సెంటర్‌లో ఉంటుంది. డేటా సెంటర్‌లు కేవలం నిల్వ సౌకర్యాలు మాత్రమే కాదు, అవి మొత్తం డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు పునాదిగా ఉంటాయి.

నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత దేశం ఇంతటి ప్రాధాన్యం గల డేటా సెంటర్ల వ్యవస్థాపనలో టాప్ 10 దేశాల్లో కూడా లేదు. ప్రపంచ వ్యాప్తంగా డేటా సెంటర్ పోటీలో ఇతర దేశాలకు అందనంత ఎత్తులో అమెరికా ఉన్నది. అక్కడ మార్చి 2025 నాటికి 5,426 డేటా సెంటర్లు ఉన్నాయి. అమెరికా తరువాత చైనాలో వేలాది డేటా సెంటర్లు ఉన్నాయి. వాటిలో హైపర్ స్కేల్ డేటా సెంటర్లు 100కు పైగా ఉన్నాయి. అలాగే జర్మనీలో 529, బ్రిటన్‌లో 523, ఫ్రాన్స్‌లో 322, ఆస్ట్రేలియాలో 314, నెదర్లాండ్స్‌లో 298, రష్యాలో 251, ఇటలీలో 173, మెక్సికోలో 168 డేటా సెంటర్లు ఉన్నాయి.

డేటా సెంటర్ల నిర్వహణలో విద్యుత్ వినియోగం కీలకం కాబట్టి, వాటిని అవి వినియోగించే విద్యుత్ పరిమాణంతో కొలుస్తారు. 2023లో అమెరికాలోని డేటా సెంటర్‌లు 176 టెరావాట్-గంటల (TWh) విద్యుత్‌ను ఉపయోగించాయి (1 టెరావాట్ గంటలు అంటే 10 లక్షల మెగావాట్ గంటలకు సమానం). ఇది అమెరికా మొత్తం విద్యుత్ వినియోగంలో దాదాపు 4.4శాతం. ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ పెరుగుదలతో డేటా సెంటర్ల విద్యుత్ వినియోగం 2030 నాటికి 12శాతానికి పెరగవచ్చు. నీటి వినియోగం కూడా ఎక్కువే. అయితే లిక్విడ్ కూలెంట్ సాంకేతికతతో అది నిర్వహించగలిగే స్థాయిలోనే ఉంటుంది. ఈ లెక్కలను చూసినప్పుడు డేటా సెంటర్ల నిర్మాణంలో అమెరికాకు చేరువగా ఇప్పట్లో ఏ దేశమూ చేరుకోలేదని అర్థమవుతుంది.

ఈ డేటా సెంటర్ల వ్యవస్థాపనలో భారతదేశం ఎక్కడుంది? భారతదేశం 138 డేటా సెంటర్లతో ప్రపంచంలో 13వ స్థానంలో ఉంది! అదనంగా, 2025 చివరికల్లా 1015 మెగావాట్ల సామర్థ్యంతో 45 కొత్త డేటా సెంటర్‌ల నిర్మాణం జరుగుతోంది. భారతదేశంలో డేటా వినియోగం వేగంగా పెరుగుతున్నది. ప్రపంచ డేటాలో 20శాతం భారతదేశం నుంచే వస్తోంది. జూన్ 2023లో ప్రచురితమైన ఎరిక్సన్ మొబిలిటీ నివేదిక ప్రకారం... 2028 నాటికి భారతదేశంలో ప్రతి వినియోగదారుడు నెలకు 62 జీబీ డేటాను వాడతాడని అంచనా. ఇది అమెరికా, పశ్చిమ యూరప్, దక్షిణ కొరియా, చైనా వంటి అభివృద్ధి చెందిన మార్కెట్‌లను కూడా అధిగమిస్తుంది. అయినప్పటికీ దేశం ఇప్పటికీ ప్రపంచంలో కేవలం 3 శాతంతో అతితక్కువ డేటా సెంటర్ సాంద్రతగల దేశాల్లో ఒకటిగా ఉంది. భారతదేశంలో క్రియాశీల ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య 2025 ముగిసే నాటికి 90కోట్లకు చేరుకుంటుంది. దీనితో పోల్చినప్పుడు 2022లో అమెరికాలో రూ.30కోట్ల ఇంటర్నెట్ వినియోగదారులు మాత్రమే ఉన్నారు.

భారతదేశంలోని డేటా సెంటర్లలో ఎక్కువ శాతం ముంబైలో ఉన్నాయి. చెన్నై రెండవ స్థానంలో ఉంది. దేశంలోని ఇతర డేటా సెంటర్ హబ్‌లు బెంగళూరు, హైదరాబాద్, నోయిడా (ఢిల్లీ-NCR), పూణే, కోల్‌కతా వంటి నగరాలలో ఉన్నాయి.

అక్టోబర్ 14న విశాఖపట్నంలో ఒక భారీ హైపర్ డేటా సెంటర్‌ను నెలకొల్పనున్నామని గూగుల్ ప్రకటించింది. ఈ డేటా సెంటర్ 1-గిగావాట్ (1000 మెగావాట్లకు సమానమైన) సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. అంటే ఇది యావత్ ప్రపంచంలోనే అత్యంత సామర్థ్యం గల డేటాసెంటర్ అవుతుంది. ఇప్పటివరకు అమెరికాలోని నెవేడాలో 660 మెగావాట్ల సామర్థ్యంతో ఒక డేటా సెంటర్ అత్యంత సామర్థ్యం గలదిగా ఉండేది. విశాఖపట్నం డేటా సెంటర్ 12 దేశాలలో విస్తరించి ఉన్న 'గూగుల్ గ్లోబల్ నెట్‌వర్క్ ఆఫ్ ఏఐ' సెంటర్లలో భాగం అవుతుంది.

రాబోయే అయిదేళ్లలో (2026-2030) సుమారు రూ. లక్షా 30వేల కోట్లతో దేశంలో మొట్టమొదటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) హబ్‌ను విశాఖపట్నంలో గూగుల్ ఏర్పాటు చేస్తుంది. ఏఐ అభివృద్ధికి కేంద్రంగా పనిచేయడంతో పాటు, విశాఖపట్నం ఒక ప్రధాన కనెక్టివిటీ హబ్‌గా మారనుంది. ఎందుకంటే గూగుల్ దాని సబ్ సీ (సముద్రం అడుగున) కేబుల్ మౌలిక సదుపాయాలను అక్కడకు తీసుకువచ్చి, వాటిని దాని ప్రపంచవ్యాప్త నెట్‌వర్క్‌తో అనుసంధానించనుంది. అంటే గూగుల్ ఏఐ టెక్నాలజీని తీసుకురావడమే కాకుండా, దాని సబ్ సీ కేబుల్, నెట్‌వర్క్ కనెక్టివిటీ హబ్ ద్వారా డిజిటల్ మౌలిక సదుపాయాలను కూడా నిర్మిస్తుంది. దీనితో ఆసియా-పసిఫిక్ ప్రాంతాలకు ప్రత్యక్ష సంబంధం ఏర్పడటమే కాకుండా, దానితో వచ్చే హై స్పీడ్ ఇంటర్‌నెట్ ఇతర కంపెనీల డేటా సెంటర్లు విశాఖపట్నానికి రావటానికి అవకాశం ఏర్పడుతుంది.



గూగుల్ డేటా సెంటర్‌తో దాదాపు 2 లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. అంతేకాదు గూగుల్ డేటా సెంటర్ నిర్మాణంతో ఏర్పడే ఇకో సిస్టమ్ కారణంగా మెటా, అమెజాన్, మైక్రోసాఫ్ట్ వంటి అనేక సంస్థలు తమ డేటా సెంటర్లను, ఏఐ అభివృద్ధి సెంటర్లను ఇక్కడకు తీసుకువచ్చే అవకాశం ఉంటుంది. 2029 నాటికి డేటా సెంటర్ సామర్థ్యాన్ని 6 గిగావాట్లకు చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం కేంద్రంగా మరో సైబరాబాద్ ఆవిర్భవిస్తుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గూగుల్‌తో మాత్రమే ఒప్పందం చేసుకున్నప్పటికీ గూగుల్ అదానీ ఎంటర్‌ప్రైజెస్ డేటా సెంటర్ జాయింట్ వెంచర్ సంస్థ అదానీ కోనెక్స్, భారతీ ఎయిర్‌టెల్‌లను వ్యూహాత్మక భాగస్వాములుగా చేసుకుంది. దానితో రూ.85,000 కోట్ల ప్రాజెక్టుల అంచనా రూ. లక్షా 25వేల కోట్లకు పెరిగింది. విశాఖపట్నంలో ప్రత్యేకంగా నిర్మించిన డేటా సెంటర్‌ను సంయుక్తంగా స్థాపించడం, అలాగే గూగుల్‌కు చెందిన కొత్త అంతర్జాతీయ సబ్ సీ కేబుళ్లను హోస్ట్ చేయడానికి అత్యాధునిక కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ (CLS)ను ఏర్పాటు చేయడం ఎయిర్‌టెల్ ఆధ్వర్యంలో జరుగుతుంది. దీనితో ఈ డేటా సెంటర్ విస్తృతమైన గ్లోబల్ టెరెస్ట్రియల్, సబ్ సీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో చేరనుంది.

డేటా సెంటర్లు తీవ్ర స్థాయిలో విద్యుత్తును, నీటిని వినియోగిస్తాయి. గూగుల్ డేటా కేంద్రం అత్యంత ఆధునిక లిక్విడ్ కూలింగ్ సాంకేతికతతో నిర్మితమవుతుంది. దీనితో విద్యుత్ ఆవశ్యకతలో 20శాతం తగ్గుతుంది. ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిలో దేశంలోనే అగ్రస్థాయిలో ఉంది. రాష్ట్రంలో ఇప్పటికే 8,000 మెగావాట్ల సోలార్, 4,083 మెగావాట్ల పవన, ఇతర పద్ధతులతో 500 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి జరుగుతోంది. అంతేకాదు, గూగుల్ తన డేటా సెంటర్ అవసరాల కోసం 1000 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్తు ప్లాంట్‌ను నెలకొల్పడానికి సిద్ధపడింది. విశాఖపట్నంలో ఏర్పాటు చేయబోయే డేటా సెంటర్లకు కావలసిన నీరు పోలవరం ఎడమ కాలువ నుంచి సరఫరా అవుతుంది. నీటి లభ్యతలో ముంబాయి, చెన్నై, బెంగళూరుల కంటే విశాఖపట్నం మెరుగైన నగరం అని వేరే చెప్పనక్కరలేదు.

గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖపట్నానికి తీసుకురావటంలో చంద్రబాబు తన పలుకుబడిని పూర్తి స్థాయిలో ఉపయోగించి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించినట్లు తెలుస్తోంది. దీని కోసం కేంద్ర ప్రభుత్వంతో కొన్ని చట్టాలను కూడా సవరింపజేయవలసి వచ్చిందని ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ అన్నారు. బీజేపీ పాలనలోని మహారాష్ట్ర ఈ గూగుల్ డేటా సెంటర్ కోసం తీవ్రస్థాయిలో ప్రయత్నించింది. తమిళుడైన సుందర్ పిచాయ్‌ను ప్రభావితం చేసి, 'ఈ గూగుల్ సెంటర్‌ను తమిళనాడుకు తీసుకురాలేద'ని అక్కడి ప్రతిపక్షం ప్రభుత్వంపైన విమర్శలు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ తీవ్ర లోటు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రమని, దానికి ఈ ప్రాజెక్టును చేపట్టే అర్హతలేదని కర్ణాటక ఐటీ మంత్రి తీవ్రమైన విమర్శలు గుప్పించారు.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్షం కూడా గూగుల్ డేటా సెంటర్ విషయంలో ప్రభుత్వంపై విరుచుకుపడింది. పది రోజులపాటు వైసీపీ నాయకులు, మేధావులు తమ మీడియా సంస్థల ద్వారా 'గూగుల్ డేటా సెంటర్ ఒక గోడౌన్' అని, దానితో వచ్చే ఉద్యోగాలు నామమాత్రమేనని, కాలుష్యం పెరిగిపోతుందని రకరకాలుగా బురదజల్లారు. ఈ దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మకపోవడంతో జగన్ ఆకస్మికంగా మడమతిప్పి, నాలుక మడతేశారు. 'తాను గూగుల్ డేటా సెంటర్‌ను స్వాగతిస్తున్నానని; ప్రస్తుతం నడిచేది, రాబోయేది ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ యుగమేనని; గూగుల్ డేటా సెంటర్‌తో విశాఖపట్నంలో డేటా సెంటర్లకు అనుకూల ఇకో సిస్టమ్ ఆవిర్భవిస్తుందని, దానితో ఎటువంటి కాలుష్యం ఉండదని' అక్టోబర్ 24వ తేదీన తన అనుకూల మీడియా ద్వారా ప్రకటించారు. ఈ ప్రకటనతో ప్రజలు తెల్లబోగా, అప్పటిదాకా నానాయాగీ చేసిన మేధావులు సిగ్గుతో కుంచించుకుపోయారు.

గూగుల్ డేటా సెంటర్‌తో దాదాపు 2 లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. అంతేకాదు గూగుల్ డేటా సెంటర్ నిర్మాణంతో ఏర్పడే ఇకో సిస్టమ్ కారణంగా మెటా, అమెజాన్, మైక్రోసాఫ్ట్ వంటి అనేక సంస్థలు తమ డేటా సెంటర్లను, ఏఐ అభివృద్ధి సెంటర్లను రాష్ట్రానికి తీసుకువచ్చే అవకాశం ఉంటుంది. ఇటీవల రుషికొండలో నాస్డాక్-లిస్టెడ్ సిఫీ టెక్నాలజీస్‌కు చెందిన డేటా సెంటర్ విభాగం అయిన 'సిఫీ ఇన్‌ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్' విశాఖపట్నంలో నిర్మించనున్న మొదటి 50 మెగావాట్ల ఏఐ - పవర్డ్ ఎడ్జ్ డేటా సెంటర్, ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ (CLS)లకు రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్ట్ తక్కువ-లేటెన్సీ కంప్యూట్ మౌలిక సదుపాయాలను, సబ్ సీ నెట్‌వర్క్‌ల ద్వారా ప్రత్యక్ష అంతర్జాతీయ బ్యాండ్‌విడ్త్ కనెక్టివిటీని అందిస్తుంది. 2029 నాటికి డేటా సెంటర్ సామర్థ్యాన్ని 6 గిగావాట్లకు చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం కేంద్రంగా మరో సైబరాబాద్ ఆవిర్భవిస్తుందని చెప్పవచ్చు.

■ నెల్లూరు నరసింహారావు
సీనియర్ జర్నలిస్ట్

పీడిత ప్రజల న్యాయవాది డి.బి.ఎమ్

వేలాది కార్మికులకు, గ్రామీణ పేదలకు, గిరిజనులకు, ఇతర పీడిత ప్రజలకు అత్యంత ప్రియతముడు, గొప్ప కమ్యూనిస్టు విప్లవకారుడు, ప్రజా పోరాట యోధుడు, దొంకాడ భువన్ మోహన్ పట్నాయక్ (డి.బి.ఎమ్). ఈయన శ్రీకాకుళం జిల్లాలోని భాగింపేటలో 1925 అక్టోబర్ 31న జన్మించారు. ఆంధ్రప్రదేశ్‌లో జన్మించినా 27 ఏళ్ల వయసులో న్యాయవాదిగా ఒడిషాలోని కోరాపుట్ జిల్లా, గుణుపూర్ పట్టణంలో స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. 2009 ఫిబ్రవరి 11న అమరులయ్యేంత వరకూ అక్కడే జీవనం సాగించారు.



కమ్యూనిస్టు విప్లవ సిద్ధాంతాల పట్ల కడదాకా దృఢమైన విశ్వాసంతో నిలిచిన గొప్ప కమ్యూనిస్టు విప్లవకారుడు డి.బి.ఎమ్. భారత కమ్యూనిస్ట్ ఉద్యమంలో ఆయన రివిజనిజాన్ని బలంగా వ్యతిరేకించి, ఎల్లప్పుడూ విప్లవ పంథా వైపునే నిలబడ్డారు. సీపీఎం నుంచి కమ్యూనిస్టు విప్లవకారులు విడిపోయినప్పుడు ఆయన ఏఐసీసీఆర్‌లో చేరి, చారు మజుందార్ అనుసరించిన అతివాద దుస్సాహసిక పంథా వైపుగా వెళ్లారు. కానీ, తర్వాత ఆ అతివాద విధానాలను వ్యతిరేకించి, క్రమంగా సరైన పంథా వైపుగా ప్రయాణించారు. చారు మజుందార్ అతివాద విధానాలను తప్పని చెప్పిన చైనా కమ్యూనిస్ట్ పార్టీ సూచనల ప్రాతిపదికపై ఆత్మవిమర్శ ద్వారా వాటిని సమీక్షించుకుని, సరైన పంథాను అనుసరించాల్సి ఉందనీ నాటి సీపీఐ-ఎంఎల్ శ్రేణులకు 'సిక్స్ మెన్ లెటర్'గా పేరొందిన లేఖ రాసిన ఆరుగురిలో డి.బి.ఎమ్ ఒకరు. తరువాత కాలంలో ఆయన కమ్యూనిస్టు విప్లవ నేతలు దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి రూపొందించిన విప్లవ ప్రజా పంథాను, వ్యవసాయ విప్లవ పంథాను నిశితంగా అధ్యయనం చేశారు. దేశంలో ప్రజల ప్రజాతంత్ర విప్లవోద్యమ విజయానికి అదే సరైన పంథా అని ప్రకటించారు. డీవీ, టీఎన్‌లు స్థాపించిన యూసీసీఆర్ఐ-ఎంఎల్‌లో చేరి, చివరి శ్వాస వరకూ ఆ పార్టీలోనే కొనసాగారు.

పాలకుల తీవ్ర, అమానుష దాడులకు, నిర్బంధాలకు; తీవ్ర నైరాశ్యానికి, నిస్పృహకు గురికావడమో, లొంగిపోవడమో పరిష్కారం కాదని డి.బి.ఎమ్ తెలిపారు. సమీక్ష చేసుకుని, సరైన విప్లవ ప్రజాపంథాను గుర్తించి, ప్రజలను దోపిడీ, అణచివేతల నుంచి విముక్తి చేసే విప్లవోద్యమంలో ముందుకు సాగడమే సరైన విధానమని ఆయన తన జీవితం, కృషి ద్వారా సందేశం ఇచ్చారు. నేటి పరిస్థితుల్లోనూ ఇది మరింత ప్రాసంగికత కలిగివుంది.

డి.బి.ఎమ్ ఒక ఆదర్శ ప్రజా పోరాట యోధుడు. వివిధ ప్రజా ఉద్యమాలకు ఆయన నాయకత్వం అందించి, ప్రజల హక్కుల పరిరక్షణకు కృషి చేశారు. నాటి కోరాపుట్ జిల్లాలో ఆదివాసీ ప్రజల భూ పోరాటాలకు, జేకే పేపర్ మిల్స్, లిఫ్ట్ ఇరిగేషన్ తదితర పరిశ్రమల్లో సమరశీల కార్మిక పోరాటాలకు నాయకత్వం అందించారు. అంతేకాక, శ్రీకాకుళం విప్లవ గిరిజన పోరాటాలకు అనేక విధాలుగా సహాయ సహకారాలు అందించటమే కాక, అటువంటి వాటిని కోరాపుట్ జిల్లాలో కూడా నిర్మించటానికి కృషి చేశారు. డి.బి.ఎమ్ పట్నాయక్ అత్యంత ప్రజ్ఞాశాలి అయిన ప్రజా న్యాయవాది. ఆదివాసీ ప్రజల దుర్భర జీవితాలను పరిశీలించి, చలించి, ఆదివాసీల లాయర్‌గానే తన న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. తన ఆరు దశాబ్దాల సుదీర్ఘ న్యాయవాద వృత్తిని ధన సంపాదనకు కాకుండా దోపిడీకి, అణచివేతకు గురవుతున్న కార్మికులు, గ్రామీణ పేదలు, గిరిజనుల వంటి పేద ప్రజల హక్కులను, ప్రయోజనాలను పరిరక్షించడానికే ధారపోశారు.

తన విప్లవ భావాలు, ప్రజా పోరాటాల వల్ల తీవ్ర నిర్బంధాన్ని ఆయన పాలకుల నుంచి ఎదుర్కొనవలసి వచ్చింది. అక్రమ కేసులు, జైలు జీవితం, లాఠీచార్జీలు, చివరకు పోలీసు కాల్పులను కూడా ఆయన విప్లవ ధీరోదాత్తతతో ఎదుర్కొన్నారు, రహస్య జీవితం గడిపారు. వీటన్నింటి వల్ల ఆయన కుటుంబం దుర్భరమైన పేదరికాన్ని, చెప్పనలవి కాని కష్టనష్టాలను అనుభవించింది.

పాలకుల 'అమెరికా అగ్రరాజ్య, సామ్రాజ్యవాద, బడా పెట్టుబడిదారీ, భూస్వామ్య అనుకూల' విధానాల వల్ల దేశంలోని మెజారిటీ ప్రజలు నేటికీ భూమి సమస్య పరిష్కారం కాక, సరైన పారిశ్రామిక అభివృద్ధి లేక, పేదరికం, నిరుద్యోగం, దోపిడీ, అణచివేతలను ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో డి.బి.ఎమ్ అనుసరించిన సరైన పంథాలో ప్రజల విప్లవోద్యమాలను నిర్మించటానికి కృషి చేయటం, విప్లవోద్యమాన్ని సరైన పంథాలో పునర్నిర్మాణం చేయాలన్న ఆయన ఆకాంక్షలను నెరవేర్చడానికి కృషి చేయడమే ఆ మహనీయునికి నిజమైన నివాళి!

○ సిహెచ్.ఎస్.ఎన్.మూర్తి
ఎఫ్ఐటియు ప్రధాన కార్యదర్శి

(రేపు గుణుపూర్‌లో యూసీసీఆర్ఐ-ఎంఎల్ ఆధ్వర్యంలో డి.బి.ఎమ్ శతజయంతి సభ)


వికీపీడియా ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తెలుగు వికీపీడియా పురోగతికి, తెలుగు భాషలో నాణ్యమైన, విశ్వసనీయమైన జ్ఞానాన్ని ప్రపంచానికి ఉచితంగా అందించే లక్ష్యంతో, తెలుగు వికీమీడియన్స్ యూజర్ గ్రూప్ (TWUG), ఐఐఐటీ-హైదరాబాద్‌లోని ఓపెన్ నాలెడ్జ్ ఇనిషియేటివ్స్ (OKI) బృందం సంయుక్త ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక కార్యక్రమం జరుగనున్నది. ఇందులో భాగంగా మూడు నెలల ఉచిత ఆన్‌లైన్ ఇంటర్న్‌షిప్, స్వచ్ఛంద కార్యకర్తల కార్యక్రమం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాం. 2025 నవంబర్ 14 నుంచి 2026 ఫిబ్రవరి 14 వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. ప్రతిరోజూ రాత్రి 7:00 నుంచి శిక్షణ తరగతులు జరుగుతాయి. ఇందులో పాల్గొనడానికి 18 నుంచి 30 సంవత్సరాల యువత అర్హులు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు గూగుల్ ఫారం ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించాలి. దరఖాస్తుతో పాటు తమ సీవీ (బయో-డేటా), ఒక ప్రేరణాత్మక వ్యాసం లేదా నమూనా రచనను జత చేయాలి. నిపుణుల ప్యానెల్ ద్వారా స్క్రీనింగ్ లేదా ఇంటర్వ్యూ నిర్వహించి తుది ఎంపిక చేస్తారు. కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినవారికి (కనీసం 100 కొత్త వ్యాసాలు లేదా 200 ఇప్పటికే ఉన్న వ్యాసాలను మెరుగుపరచడం) ఓకేఐ, టీడబ్ల్యూయూజీ సంయుక్తంగా అధికారిక ప్రశంసాపత్రం అందజేస్తాయి. ఉద్యోగం చేస్తూ, ఇతర వృత్తులలో ఉంటూ లేదా పార్ట్‌టైమ్‌లో తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయాలనే ఆసక్తి ఉన్నవారు, వయస్సుతో సంబంధం లేకుండా స్వచ్ఛంద కార్యకర్తలుగా చేరవచ్చు. వీరికి మూడు వారాల పాటు ఉచిత శిక్షణ ఇస్తారు.

దరఖాస్తు ఫారం: https://forms.gle/3FfJ44o2gXMfEJzb8లో లభిస్తుంది. దరఖాస్తులు పంపడానికి నవంబర్ 10 ఆఖరు తేదీ. మరిన్ని వివరాలకు వాట్సాప్: 9014120442; Email: contact@tewikipedia.org

– తెలుగు వికీమీడియన్స్ యూజర్ గ్రూప్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్-76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు-70, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500033.
మెయిల్: editpage@andhrajyothy.com




వన్‌టౌన్‌లో నీటమునిగిన రహదారులు

మొంథా బీభత్సం

జిల్లాలో భారీ వర్షాలు, ఈదురుగాలులు

బుధవారం మధ్యాహ్నం వరకు తగ్గని ఉధృతి

తీరం దాటే సమయంలో మొంథా తుఫాను బీభత్సం సృష్టించింది. బెజవాడ సహా జిల్లా మొత్తాన్ని భారీవర్షాలు ముంచేశాయి. ఈదురుగాలులకు పంటలు సర్వనాశనమయ్యాయి. చెట్లు కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి సరఫరాకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. తెలంగాణాను కూడా వర్షాలు ముంచేయడంతో మునేరు, కట్టలేరు, పాలేరు, వైరా ఏరులకు వరద నీరు చేరుతోంది. వాగులు ఉధృతమయ్యాయి. నగరం జలమయం కాగా, పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. అధికారులు యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టినప్పటికీ ఇబ్బందులు మాత్రం తప్పలేదు.

- తీరం దాటే సమయంలో అతలాకుతలం
- జిల్లాలో 235 గ్రామాలపై ప్రభావం
- 16,997.2 హెక్టార్లలో పంటలకు నష్టం
- 16,876 మంది రైతులకు కన్నీరే..
- భయపెడుతున్న వాగులు, ఏరులు
- నగరంలో తుఫాను తెచ్చిన తంటాలు
- తెరుచుకోని దుకాణాలు.. నిర్మానుష్యంగా రోడ్లు
- పలు ప్రాంతాలు జలమయం.. ఇళ్లలోకి నీరు
- డిపోలకే పరిమితమైన సగం బస్సులు
- రైళ్లూ అంతంతమాత్రమే.. విమానాలు పునరుద్ధరణ
- పలుచోట్ల విరిగిపడిన కొండచరియలు
- యుద్ధప్రాతిపాదిక సహాయ చర్యలు
- కృష్ణాజిల్లాలో భారీగా పంటనష్టం
- చిగురుటాకుల్లా వణికిన సముద్ర తీర ప్రాంతాలు


నేలకొరిగిన చెట్ల తొలగింపు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మొంథా తుఫాను జిల్లావ్యాప్తంగా 235 గ్రామాలపై ప్రభావం చూపించింది. 16,997.2 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లింది. ప్రాథమిక అంచనా మేరకు మొత్తం 16,876 మంది రైతులు నష్టపోవాల్సి వచ్చింది. 5,622 హెక్టార్ల వరికి నష్టం ఏర్పడింది. అత్యధికంగా విజయవాడ రూరల్ మండలంలో 1,248 హెక్టార్లలో వరి నాశనమైంది. తిరువూరు మండలంలో 1,215 హెక్టార్లలో, గంపలగూడెం మండలంలో 850 హెక్టార్లు, రెడ్డిగూడెంలో 340 హెక్టార్లు, కంచికచర్లలో 248 హెక్టార్లు, మిగిలిన మండలాల్లో మోస్తరుగా వరికి నష్టం వాటిల్లింది. ఆ తర్వాత 10,068.02 హెక్టార్లలోని పత్తికి నష్టం ఏర్పడిందని వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. చందర్లపాడు మండలంలో అత్యధికంగా 2,650 హెక్టార్లు, ఏ.కొండూరు మండలంలో 1,620 హెక్టార్లు,

మిగతా 6లో..

జిల్లాలో దెబ్బతిన్న సాగు భూముల వివరాలు (ఎకరాల్లో)

పంట	మొత్తం విస్తీర్ణం	తుఫానుకు దెబ్బతిన్న విస్తీర్ణం
వరి	1,21,817	14,055
పత్తి	81,860	25,170
మొక్కజొన్న	10,830	1,747
ఇతర పంటలు	20,355	1,520


ఉండవల్లి వద్ద ధ్వంసమైన అరటితోట


నందిగామ మండలం చందాపురం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు (ఇన్‌సెట్‌లో) నగరంలో వర్షం పరిస్థితిని పరిశీలిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ లక్ష్మీశ, కమిషనర్ ధ్యానచంద్ర

వరి రైతుకు కోలుకోలేని దెబ్బ

కీలకమైన సమయంలో తుఫాను వరిపంటను నాశనం చేసింది. పొట్టపోసుకునే దశలో ఉండగానే, నేలవాలేలా చేసింది. ధాన్యం గట్టిబడటానికి ఈ పదిరోజులే కీలకం. ముసురుకున్న వాతావరణంతో గింజ గట్టిపడలేదు. బలమైన గాలుల కారణంగా పంట నేలకొరిగింది. దీంతో రైతులకు భారీగానే నష్టం వాటిల్లింది. ఎకరాకు 45-50 బస్తాలు పండించేవారికి కూడా 25 బస్తాలు కూడా దిగుబడి వచ్చే పరిస్థితి లేదు.

ముందస్తు చర్యలతో ముప్పు తప్పింది
- కలెక్టర్ లక్ష్మీశ అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు
- తుఫాను సహాయ చర్యలపై మంత్రి సత్యకుమార్ యాదవ్

6



ప్రమాదం లేదు.. రండి!
- నీటమునిగిన ప్రాంతాల్లో కాప్ ప్రణాళిక
- మైకుల్లో ప్రకటన

8

విజయవాడ రైల్వే డివిజన్ అప్రమత్తం
- కచ్చితమైన సమన్వయంతో ప్రణాళికలు
- ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

8

బోసిపోయిన నగరం
- తెరవని వ్యాపార సముదాయాలు
- నిర్మానుష్యంగా ప్రధాన రహదారులు

నేడు కోడూరుకు డిప్యూటీ సీఎం



మచిలీపట్నం టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : కోడూరు మండలంలో గురువారం ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటించనున్నట్లు జనసేన నాయకులు బండ్రెడ్డి రామకృష్ణ, బండి రామకృష్ణ తెలిపారు. బుధవారం రాత్రి వారు మీడియాతో మాట్లాడారు. కోడూరు మండలంలోని పునరావాస కేంద్రాలతో పాటు సముద్రపు ఆటుపోట్లకు గురవుతూ నష్టపోతున్న పంట పొలాలను పరిశీలిస్తారని చెప్పారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో పాటు జనసేన, టీడీపీ నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు.

లెక్క తేల్చారు

అద్విక కేసులో తేలిన లాభనష్టాలు

25 మంది నిందితులు.. రూ. 144 కోట్ల నష్టం

- లెక్కలు తేలని మొత్తం రూ.39.50 కోట్లు
- బాధితులు 92 మందిగా నిర్ధారణ
- వారికి న్యాయం చేసే ప్రణాళికలు
- స్థిరచరాస్తులు జప్తు చేసే యోచన
- ప్రభుత్వ అనుమతి తీసుకున్నాకే..

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : అద్విక ప్రైవేట్ లిమిటెడ్ ముసుగులో తాడేపల్లి శ్రీవెంకట ఆదిత్య, ఆయన సతీమణి సుజాత చేసిన మోసంపై మాచవరం పోలీసులు క్రైం నంబరు 248/2025తో బీఎన్ఎస్ 318 (4), 316 (2), 316 (5) (2) 61తో పాటు ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టంలోని సెక్షన్ 5 కింద కేసు నమోదు చేశారు. ఈ మోసంలో మొత్తం 25 మందిని నిందితులుగా పేర్కొన్నారు. వారిలో ఆదిత్య, భార్య సుజాత, వారికి సహకరించిన

మిగతా 6లో..



ప్రభుత్వ అనుమతితో జప్తు

అద్వికలో పెట్టుబడుల ద్వారా సేకరించిన డబ్బుతో ఆదిత్య సమకూర్చుకున్న చరస్థిరాస్తులను పోలీసులు సీజ్ చేశారు. వాటి విలువ రూ.100 కోట్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. త్వరలో ప్రభుత్వ అనుమతి తీసుకుని ఈ మొత్తం ఆస్తులను జప్తు చేస్తామని పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు వెల్లడించారు. అనుమతిగా రాగానే న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేస్తామని తెలిపారు. వాటితో పాటు వివిధ బ్యాంక్ ఖాతాల్లో ఉన్న నగదు, ఏజెంట్లు తిరిగి చెల్లించే లాభాలను బాధితులకు పంచుతామని స్పష్టం చేశారు.

ఏజెంట్లు 32 మంది. పెట్టుబడి రూ.54 కోట్లు. తీసుకున్న మొత్తం రూ.105 కోట్లు. పొందిన లాభం రూ.49 కోట్లు. అధిక వడ్డీలు చెల్లిస్తానని ప్రజల నుంచి డబ్బు సేకరించిన అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ఏజెంట్లు తీసుకున్న లాభాలివి. అద్విక కేసు దర్యాప్తును ముగించిన సిట్ మొత్తం లెక్కలను సవివరంగా తెలియజేసింది. బాధితులు, ఆస్తుల వివరాలతో పాటు నష్టాన్ని కూడా లెక్కించింది.

స్మార్ట్ స్ట్రీట్ ఏర్పాటు చేయండి

ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించండి

- కార్పొరేషన్‌లో వైసీపీ కౌన్సిల్ తీర్మానం రద్దు
- రాష్ట్ర ప్రభుత్వం తాజా ఆదేశాలు

విజయవాడ సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : నగరంలో స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కార్పొరేషన్‌కు బుధవారం రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ఆదేశాలిచ్చింది. స్మార్ట్ స్ట్రీట్ ఏర్పాటునకు కార్పొరేషన్ సాధారణ నిధులు కేటాయించేందుకు వీఎంసీలోని వైసీపీ పాలకులు విముఖత చూపుతూ చేసిన కౌన్సిల్ తీర్మానాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. జీవో 753 ప్రకారం మార్కెట్ ఏర్పాటు చేయాలని వీఎంసీకి బుధవారం ఆదేశాలిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. నగరంలో ప్రస్తుతం 24 వేల మంది వీధి వ్యాపారులు ఉన్నారు. వీరిలో 20 వేల మందికి వీఎంసీ గుర్తింపుకార్డులు ఇచ్చింది. ప్రస్తుతం జరుగుతున్న వీధి వ్యాపారాల కారణంగా ట్రాఫిక్, పారిశుధ్య సమస్య ఉత్పన్నమవుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు వీధి వ్యాపారులకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించేందుకు వీఎంసీ కసరత్తు చేస్తోంది. దీనికోసం 1,015 స్థలాలు కావాలని వీఎంసీ నిర్ధారణకు వచ్చింది. అయితే, అందుకు అనుగుణంగానే నగరాలు, పట్టణాల్లో స్మార్ట్ స్ట్రీట్లను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం 753 జీవోను జారీచేసింది. నెల్లూరులో ఇదే తరహాలో ఇటీవలే స్మార్ట్ స్ట్రీట్ ఏర్పాటు జరిగింది. విజయవాడలోనూ స్మార్ట్ స్ట్రీట్ ఏర్పాటుకు విద్యాధరపురంలోని ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డులో స్థలాన్ని వీఎంసీ గుర్తించింది. దీనికోసం రూ.1.16 కోట్ల వీఎంసీ సాధారణ నిధులు కేటాయించేందుకు సిద్ధమైంది. అయితే, నిధులు కేటాయించేందుకు వీఎంసీ పాలకులు విముఖత చూపుతూ ఈ నెల 8న కౌన్సిల్ తీర్మానం చేశారు. ఈ తీర్మానాన్ని రద్దు చేయాలని అధికారులు ప్రభుత్వాన్ని కోరారు. స్పందించిన ప్రభుత్వం తీర్మానాన్ని రద్దు చేస్తూ ఆదేశాలిచ్చింది.

నేటి నుంచి పాఠశాలలు

కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాలు

కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : పునరావాస కేంద్రాలు ఉన్న పాఠశాలలు మినహా జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలు ఫిట్‌నెస్ ధ్రువీకరణ అనంతరం గురువారం నుంచి యథావిధిగా తెరుచుకోవచ్చని కలెక్టర్ లక్ష్మీశ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్అండ్‌బీ ఇంజనీర్లతో ఈ ధ్రువీకరణ జరిగేలా ఎంఈవోలు, తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తరగతి గదులు, పైకప్పులు, ప్రహరీలు, విద్యుత్ కనెక్షన్లు, తాగునీరు, పారిశుధ్య సౌకర్యాలన్నీ సురక్షితంగా ఉన్నాయా, లేదా ధ్రువీకరించుకున్నాకే సిబ్బందిని, విద్యార్థులను పాఠశాల భవనాల్లోకి అనుమతించాలని సూచించారు. పునరావాస కేంద్రాలు ఉన్న పాఠశాలలు మాత్రం అధికారుల ఆదేశాల మేరకు పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చేంత వరకు సెలవులు కొనసాగించాలని ఆయన ఆదేశించారు.

విద్యుత్ శాఖకు రూ.1.08 కోట్ల నష్టం

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : మొంథా తుఫాను కారణంగా విద్యుత్ శాఖకు రూ.1.08 కోట్ల నష్టం వాటిల్లింది. ముఖ్యంగా నూజివీడు, విజయవాడ రూరల్ పరిధిలో అధిక నష్టం జరిగింది. సీపీడీసీఎల్ సర్కిల్ పరిధిలో ఈదురుగాలులకు 33 కేవీ స్తంభాలు 14, 11 కేవీ స్తంభాలు 128 నేలకొరిగాయి. 11 కేవీ విద్యుత్ తీగలు 30 కిలోమీటర్లు, 33 కేవీ విద్యుత్ తీగలు ఐదు కిలోమీటర్ల మేరకు తెగిపోయాయి. ఇళ్లకు విద్యుత్‌ను సరఫరా చేసే 440 ఓల్ట్ ట్రాన్స్‌ఫార్మర్లు 75 కాలిపోయాయి. వాటిని అత్యవసరంగా మార్పు చేశారు. నష్టం జరిగిన అన్ని ప్రాంతాల్లో పరిస్థితులను విద్యుత్ సిబ్బంది పునరుద్ధరించారు. ఇందుకోసం రూ.1.08 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశారు.

వాగులు, వంకలకు వరద

తెలంగాణాలో వర్షాలు.. భారీగా చేరుతున్న నీరు

తెలంగాణా నుంచి భారీగా వరద నీరు చేరుతుండటంతో జిల్లాలోని వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. మునేరు మహోధృతం కాగా, వైరాయేరు, కట్టలేరు ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. రోడ్లపైకి వరద చేరుతుండటంతో తెలంగాణా నుంచి రాకపోకలు దాదాపు బంద్ అయ్యాయి.

- మునేరు ఉధృతం.. 45 వేల క్యూసెక్కులకు వరద
- ఒక్కరోజులో 8 రెట్లు పెరిగిన ప్రవాహం
- లక్ష క్యూసెక్కులు దాటుతుందన్న నిపుణులు
- చిల్లకల్లు-వైరా మార్గంలో లింగాల కాజ్‌వే మూసివేత
- ప్రమాదకరంగా కట్టలేరు, వైరాయేరు
- పల్లెంపల్లి గ్రామం వద్ద కాజ్‌వే క్లోజ్
- పాలేరుకు 4 లక్షల క్యూసెక్కుల నీరు రాక
- జగ్గయ్యపేట-బలుసుపాడులో రాకపోకలు బంద్
- ఏపీ-తెలంగాణా మధ్య నిలిచిన రాకపోకలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/కంచికచర్ల/జగ్గయ్యపేట రూరల్) : మునేరు మహోధృతమై ప్రవహిస్తోంది. బుధవారం రాత్రి 8 గంటలకు రికార్డు స్థాయిలో 45 వేల క్యూసెక్కుల వరద మునేరుకు చేరింది. సాయంత్రం

మిగతా 6లో..

పాలేరుకు 4 లక్షల క్యూసెక్కుల వరద

జగ్గయ్యపేట రూరల్ మండలంలోని పాలేరుకు భారీ వరద చేరింది. మొత్తం 4 లక్షల క్యూసెక్కుల వరద ప్రవహిస్తోంది. ఖమ్మం జిల్లా కూసుమంచి దగ్గర పాలేరు రిజర్వాయర్ ఉంది. ఇది ఫుల్ అవడంతో దిగువకు విడుదల చేశారు. జగ్గయ్యపేటలో ఇది రావిరాల గ్రామం దగ్గర కృష్ణానదిలో కలుస్తుంది. భారీస్థాయిలో వరద వస్తున్నా ఇబ్బందికర పరిస్థితులు అయితే లేవు. పులిచింతల నుంచి వరద వస్తే తప్ప ఇబ్బంది లేదు. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే రావిరాల, బూదవాడ, అన్నవరం గ్రామాలపై ప్రభావం ఉంటుంది. పాలేరు వరదను దృష్టిలో ఉంచుకుని జగ్గయ్యపేట-బలుసుపాడు రోడ్డులో రాకపోకలను నిలిపివేశారు. ప్రమాద హెచ్చరిక బ్యానర్లు ఏర్పాటు చేసి బారికేడ్లు పెట్టారు.


పెనుగంచిప్రోలు వద్ద మునేరు ఉధృతి (ఇన్‌సెట్‌లో) బుధవారం అర్ధరాత్రి లింగాల కాజ్‌వే వద్ద పోలీసుల గస్తీ

ప్రమాదకరంగా వైరా, కట్లేరు

వైరాయేరు, కట్లేరు ప్రమాదస్థాయి దాటి ప్రహిస్తున్నాయి. నందిగామ మండలం దాములూరు కూడలి, వీరులపాడు మండలం పల్లెంపల్లి మధ్య కాజ్‌వేపై నాలుగైదు అడుగుల ఎత్తున వైరాయేరు ప్రవహిస్తోంది. ఈ మార్గంలో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. వైరాయేరు వరద కూడా ఇంకా పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. నందిగామ దగ్గర నల్లవాగు, కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో యేనుగుగడ్డ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. నల్లవాగు ఉధృతి వల్ల నందిగామ నుంచి చందాపురం మీదుగా చందర్లపాడు వెళ్లేందుకు వీల్లేని పరిస్థితి ఏర్పడింది. యేనుగుగడ్డ వాగు ఉధృతికి రెండు మండలాల్లోని పలు గ్రామాల్లో వేలాది ఎకరాల పంటలు నీటమునిగాయి.


వీరులపాడులో ఒరిగిన కంది చెట్లు



ముంచెత్తిన.. మొంథా!

- నీటిలో నానుతోన్న పత్తిచేలు
- నేలవాలిన వరి, మిర్చి, కంది పంటలు
- అన్నదాతకు తీరని ఆవేదన
- జలమయమైన పల్లపు ప్రాంతాలు
- కాకర్ల వాగుపై వంతెనకు నెర్రలు
- పలు చోట్ల కూలిన భారీ వృక్షాలు

మొంథా తుఫాను దెబ్బకు జిల్లాలో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పత్తి పంట, మిర్చి తోటలు నీటిలో నానుతున్నాయి. గింజ పోసుకుంటున్న పంటలు చేతి కందే తరుణంలో తుఫాను వల్ల నిలువునా పంటలు దెబ్బతినటంతో రైతుల వెన్ను విరిగింది. కకావికలమైన పంటలను చూసి అన్నదాత కన్నీటి పర్యంతమయ్యాడు. మూడు రోజులుగా ఎడతెగని వర్షాలు.. బలమైన ఈదు రుగాలులకు చేలన్నీ పడిపోయాయి.

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల/ఇబ్రహీంపట్నం)

● ఈ ఏడాది జిల్లాలో 81,875 ఎకరాల్లో పత్తి సాగైంది. తుఫాను గాలులకు చెట్లు నెలకొరిగాయి. పడిన చెట్లను కదిలించే పరిస్థితి లేదు. చేలల్లో తీయాల్సిన పత్తి తడిసి పోయి నేలపై పడి రంగు (నాణ్యత) కోల్పోతుంది. ఇప్ప



టికే ఫంగస్ వ్యాప్తితో గుడ్డి, కాయ పత్తితో సతమతమవు తున్న రైతులను మొంథా నిలువునా ముంచింది. పత్తి రైతులు కోలుకునే పరిస్థితి కనిపించటం లేదు. పెట్టుబ డులు రావటం చాలా కష్టం.

● మిర్చి తోటలు నీటిలో నానుతున్నాయి. పూత, పిందె, కాయ దశలో ఉన్న తోటలు బాగా దెబ్బతిని గాలు లకు నేలకొరిగాయి. ఒకటి, రెండు రోజుల్లో నీరు పూర్తిగా బయటకు వెళితే చెట్లు బతుకుతాయి. లేకుంటే వేళ్ల కుళ్లి పోయి చెట్లు నిలువునా ఎండిపోతాయి. ఇప్పటికే ఎకరానికి రూ. లక్షకు పైగా పెట్టుబడి పెట్టిన రైతులు దెబ్బతింటున్న మిర్చి తోటలను చూసి భోరున విలపిస్తున్నారు.

● తుఫాను దెబ్బకు మొక్కజొన్న పంట పనికిరా కుండా పోయింది. రోజుల తరబడి తడవటంతో గింజల నుంచి మొలకలు వస్తున్నాయి. ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి నాశనమైంది. పెట్టుబడి దక్కకపోగా, తీవ్రంగా నష్టపోవాల్సి రావటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. మొక్క జొన్న ఇక పనికిరాదని రైతులు చెపుతున్నారు. నందిగామ డివిజన్‌లోనే పదివేల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న వేశారు. పక్షం రోజుల క్రితం కొద్ది విస్తీర్ణంలో పంట యంత్రాలతో కోయించారు. వర్షం పడుతుండటంతో మిగతా పంట కోయలేదు.

● వీరులపాడు మండలంలో కంది పంట రెండువేల ఎకరాల్లో సాగుచేశారు. ఈదురు గాలులకు చెట్లు ఒరిగిపోయాయి. కందికి కన పడని నష్టం వాటిల్లిందని రైతులు చెబుతు న్నారు.

● జిల్లాలో ఎత్తిపోతల పథకాలు, చెరు వులు, వాగులు, కాల్వల కింద సాగుచేసిన సుమారు 1.20 లక్షల ఎకరాల్లో మాగాణి వరి వివిధ దశల్లో ఉంది. కొన్ని ప్రాంతాల్లో వరి కొద్ది రోజుల్లో కోతకు రానుండగా, కొన్ని ప్రాంతాల్లో మాత్రం పొట్ట దశలో ఉంది. బల మైన ఈదురు గాలులకు వరి వెన్ను విరగటంతో పూర్తిగా నేలపై పడిపోయింది. కోతకు వచ్చిన వరి పంట చేతికి అందటం కష్టం. నీటిలో నానుతుండటం వల్ల పంట పూర్తిగా దెబ్బతింటుంది. పొట్ట దశలో ఉన్న వరిపైరు కింద పడటం వల్ల ఆశించిన దిగుబడి రాదని రైతులు


వత్సవాయి మండలం మంగొల్లులో పడిపోయిన వరి

వాపోతున్నారు. కళ్ల ముందే పంట దెబ్బతినటంతో రైతులు అల్లాడిపోతున్నారు.

మొంథా తుపాను ప్రభావంతో తిరువూరు నియోజక వర్గ పరిధిలోని తిరువూరు, ఎ.కొండూరు, విస్సన్నపేట, గంపలగూడెం మండలాల్లో, మైలవరం నియోజకవర్గ పరి ధిలోని మైలవరం, రెడ్డిగూడెం, జి.కొండూరు, ఇబ్రహీం పట్నం మండలాల్లో, విజయవాడ రూరల్ మండలం రాయనపాడు, పైడూరుపాడు, కొత్తూరు తాడేపల్లి, జక్కం పూడి తదితర ప్రాంతాల్లో వరి నేలవాలింది. కొన్ని మండ లాల్లో పంట కోత దశలో ఉండగా.. కొన్నిచోట్ల పాలు పోసుకునే దశలో ఉంది. మంగళవారం రాత్రి భారీ ఈదురు గాలులకు పంట నేలవాలిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకటి రెండ్రోజులు వర్షాలు పడితే పంటలకు మరింత నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులంటున్నారు. ఎ.కొండూరు మండలం వల్లం పట్ల, పోలిశెట్టిపాడు, కోడూరు గ్రామాల్లో 440 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్టు అధికారులు ప్రాథమిక అంచ నాకు వచ్చారు.

● మైలవరం మండలం పోరాటనగర్ స్కూల్ సమీ పంలో కాకర్ల వాగుపై వంతెన శిథిలావస్థకు చేరి నెర్రలివ్వ డంతో భారీ వాహనాలను నిలిపివేశారు. కోడూరు-కంభం పాడు గ్రామాల మధ్య ఊట వాగు ఉధృతంగా ప్రవహిం చడంతో రాకపోకలు నిలిచిపోయాయి. రెవెన్యూ సిబ్బంది భద్రతా చర్యలు చేపట్టారు. రామచంద్రాపురం బీసీ కాల నీలో పల్లపు ప్రాంతంలో ఉన్న ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది.

● రెడ్డిగూడెం మండలంలో నాగసానిపాటి చెరువుకు వెళ్లే వాగు ఉధృతికి రెడ్డిగూడెం-ఓబులాపురం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రెవెన్యూ, పోలీస్ గస్తీ ఏర్పాటు చేశారు.

● జి.కొండూరు మండలం కవులూరులో పశువుల ఆసుపత్రి వద్ద 130 ఏళ్ల నాటి రావి చెట్టు కుప్పకూలింది. చెట్టు కింద ఉంచిన ద్విచక్ర వాహనం ధ్వంసమైంది. వెంక టాపురం ఎర్ర చెరువుకు గండి పడింది. జి.కొండూరులోని పులివాగుకు వరద వచ్చింది.

● ఇబ్రహీంపట్నం మండలంలో వర్షాలకు పల్లపు ప్రాంతాలు జలమయ్యాయి. ఏనుగుగడ్డ వాగుకు వరద పోటెత్తింది. కొండపల్లి మున్సిపాలిటీలో డ్రెయిన్లు పొంగి నీరు రోడ్లపై ప్రవహించింది. కొండపల్లి గాయత్రి వేవి గుడి వద్ద ఇళ్ల మధ్యలోకి వచ్చిన భారీ కొండ చిలు వను ప్రజలు హతమార్చారు.


వెంకటాపురంలో ఎర్రచెరువుకు గండి


ఉధృతంగా ప్రవహిస్తున్న పులివాగు


రెడ్డిగూడెం-ఓబులాపురం గ్రామాల మధ్య రహదారిపై పొంగి పొర్లుతున్న వాగు

కంచికచర్ల మండలంలో నీటిలో నానుతున్న పత్తి చేను

నష్టం అంచనాకు డ్రోన్లు

విజయవాడ సిటీ/కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను నష్టం అంచనాలకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని జిల్లా యంత్రాంగం వినియోగిస్తోంది. నష్టం వివరాలను సేకరించేందుకు తొలిసారిగా డ్రోన్‌లను రంగంలోకి దింపుతోంది. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు డ్రోన్‌లను పంపుతున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ వెల్లడిం చారు. డ్రోన్ కార్పొరేషన్ ద్వారా అందుబాటులోకి వచ్చిన డ్రోన్ల పనితీరును కలెక్టరేట్‌లో ఆయన బుధవారం పరిశీలించారు. సత్వరమే పారదర్శకంగా నష్టం అంచనాలు రూపొం దించి, ప్రభుత్వానికి నివేదిక ఇచ్చేందుకు సాంకేతిక చర్యలు తీసుకుంటున్నామన్నారు. మొంథా తుపాను బీభత్సానికి పంటలు, రోడ్లు, భవనాలు, వంతెనలు, నివాస ప్రాంతాలు దెబ్బ తిన్నాయి. బలమైన గాలులకు ఆస్తి నష్టం జరిగింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు కురిసిన వర్షానికి ఈదురు గాలులు తోడవడంతో ఊహిం చని నష్టం వాటిల్లింది. బాధితుల వివరాలు, నష్టం అంచనాల లెక్కను పక్కాగా వెల్లడించేందుకు డ్రోన్‌లను క్షేత్రస్థాయిలోకి పంపిస్తున్నట్టు కలెక్టర్ వెల్లడించారు. నష్టాన్ని వేగవంతంగా, కచ్చి తంగా, అత్యంత పారదర్శకంగా అంచనా వేసేందుకు డ్రోన్ సాంకేతికతను వినియోగిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలోని 20 మండలాల్లో నష్టాల అంచనాలకు మండలానికి ఒక డ్రోన్ టీమ్ పనిచేస్తుందని వివరించారు. డిజిటల్ మ్యాపులు, ఫొటోలు, 3డీ నమూనాల రూపంలోనూ పంట నష్టం నివేదికలను డ్రోన్‌లు అందిస్తాయన్నారు. డ్రోన్ సాంకేతికత ద్వారా సేకరించిన డేటా ఆధారంగా పునరుద్ధరణ, పునర్నిర్మాణ పనులు సత్వరం చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వానికి ప్రజలు సహకరించాలని కోరారు.




హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుభేందు సమంతో దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

దుర్గమ్మసేవలో హైకోర్టు న్యాయమూర్తి దంపతులు

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను బుధవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నూతన న్యాయ మూర్తి జస్టిస్ సుభేందు సమంతో సతీసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకస్వాములు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. దర్శనా నంతరం వేద పండితులు అమ్మవారి ఆశీస్సులు, చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ ఈఈల సీనియారిటీ జాబితా

అమరావతి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్‌హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల సీని యారిటీ జాబితాను ప్రకటిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగంలో ఎగ్జి క్యూటివ్ ఇంజనీర్ల సీనియారిటీ జాబితాను తయారుచేసి ఇప్పటికే ఆయా ఇంజనీర్ల నుంచి అభ్యంతరాలను స్వీకరించి తుది జాబి తాను ఇంజనీర్-ఇన్-చీఫ్ రూపొందించారు. ఈ సీనియారిటీ జాబి తాను ఆమోదించేందుకు ప్రభుత్వ అనుమతిని కోరగా ఆ మేరకు మున్సిపల్‌శాఖ 48 మందితో కూడిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల సీని యారిటీ జాబితాకు ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీచేసింది.

వాగులు, వంకలకు వరద

(5వ పేజీ తరువాయి)

5.30 గంటలకు వరద 28 వేల క్యూసెక్కులు ఉండగా, రాత్రి 8 గంటలకు 45 వేల క్యూసెక్కులకు చేరింది. చిల్లకల్లు నుంచి వైరా వెళ్లే అంతర్రాష్ట్ర రహదారిలో వత్సవాయి మండలం లింగాల వద్ద కాజ్‌వేపైకి వరద చేరింది. దీంతో ఏపీ, తెలంగాణా మధ్య రాకపో కలు నిలిచిపోయాయి. అయితే, కృష్ణానదిలో ప్రమాదకర స్థాయిలో నీరు లేనందున వరద లక్ష క్యూసెక్కుల వరకు వచ్చినా ఇబ్బంది లేదు. ఆపైన దాటితే మాత్రం కంచికచర్ల, వత్సవాయి, చందర్ల పాడు, పెనుగంచిప్రోలు, నందిగామ మండలాల పరిధిలో పంటలు తీవ్రంగా దెబ్బతినటమే కాకుండా ప్రత్యక్షంగా, పరోక్షంగా 50 గ్రామాల ప్రజలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. వరద అంతకంతకూ పెరుగుతుండటంతో మునేటి పరిధిలోని వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ, కంచికచర్ల, చందర్ల పాడు మండలాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాల్సిందిగా ఆర్ డీవో కె.బాలకృష్ణ. రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వరద ఉధృతంగా వస్తున్నందున తీర గ్రామాల్లో తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.

ముందస్తు చర్యలతో ముప్పు తప్పింది

- కలెక్టర్ లక్ష్మీశ అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు
- తుఫాను సహాయక చర్యలపై మంత్రి సత్యకుమార్ యాదవ్

కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తుఫానును ఎదుర్కొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు యంత్రాంగాన్ని అద్భుతంగా సమా యత్తం చేశారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, సత్యకు మార్ యాదవ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి తుఫాను సహాయక చర్యలను కలెక్టర్ లక్ష్మీశతో కలిసి ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి యంత్రాంగానికి దిశానిర్దేశం చేసి, అన్ని విధాలుగా సంసిద్ధుల్ని చేశారని, తుఫానును సమర్థవంతంగా ఎదుర్కొని, ఆస్తి ప్రాణ నష్టాలను నివారించగలిగామని చెప్పారు. కలెక్టర్ లక్ష్మీశ అన్ని జాగ్రత్తలు తీసుకొ న్నారని, లోతట్టు, తుఫాను ముప్పు వున్న ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తర లించారని చెప్పారు. బుడమేరు, ప్రకాశం బ్యారేజీ లలో ఇన్‌ఫ్లో తక్కువగానే వుందని చెప్పారు.


కలెక్టర్ లక్ష్మీశతో కలిసి నగరంలో పర్యటిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

వ్యాధులు ప్రబలకుండా అన్ని చర్యలు చేపట్టామ న్నారు. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, డీఆర్‌ఓ ఎం.లక్ష్మీ నరసింహం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రహదారులపై నీళ్లు నిలవకుండా పకడ్బందీ చర్యలు

విజయవాడలో బ్రిడ్జి ప్రాంతంలోని వాననీటి పంప్‌హౌస్‌ను, ఎనిమిది మోటార్ల పనితీరును మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం పరిశీ లించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడా నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు మోటార్లతో తోడేసినట్టు వెల్లడించారు. ప్రయాణికులు, ప్రజ లకు ఇబ్బందిలేకుండా కలెక్టర్ లక్ష్మీశ, నగరపాలక సంస్థ కమిసనర్ ధ్యానచంద్ర మార్గదర్శనంలోని ప్రత్యేక బృందాలు కీలకపాత్ర పోషించాయన్నారు. నీరు నిలిచిపోతే అంటువ్యాధులు, విషజ్వరాలు ప్రబలే అవకాశముందని, అందువల్ల ఎక్కడా వర్ష పునీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకున్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.


రహదారిపై నీటిని తోడేస్తున్న సిబ్బంది

మొంథా బీభత్సం!

(5వ పేజీ తరువాయి)

గంపలగూడెం మండలంలో 1,430 హెక్టార్లు, నందిగామ మండలంలో 1,183 హెక్టార్లలో పత్తి దెబ్బతింది. 699 హెక్టార్లలో మొక్కజొన్న దెబ్బ తినగా, 608 హెక్టార్లలో కంది,మినుము, పెసర, జొన్న తదితర పంటలకు నష్టం వాటిల్లింది.

విజయవాడలో బీభత్సం

తుఫాను కారణంగా విజయవాడ నగరం అతలాకుతలమైంది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం 10 గంటల వరకు భారీవర్షం కురిసింది. ఈదురుగాలులు తోడవ డంతో నగరవాసులు వణికిపోయారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. వాణిజ్య సముదా యాలు మధ్యాహ్నం 12 గంటలకు తెరుచుకో లేదు. దుర్గగుడి ఘాట్ మార్గాన్ని మూసే ఉంచారు. నగరంలో రోడ్లు జలమయమ య్యాయి. బెంజిసర్కిల్, మొగల్రాజపురం, గాంధీనగర్, వన్‌టౌన్ ప్రాంతాల్లోని రోడ్లు నీటితో నిండిపోయాయి. పండిట్ నెహ్రూ బస్టాండ్‌వద్ద లోబ్రిడ్జిలోకి నీరు భారీగా చేరింది. ఎక్కడ నీరు నిలిచినా అప్పటికప్పుడు మోటార్ల ద్వారా, పంపింగ్ ట్యాంకుల ద్వారా తోడేశారు. గాంధీనగర్‌లో చెట్లు కూలగా, యుద్ధప్రాతిపది కన తొలగించారు.

రవాణాకు నష్టం

జిల్లాలో సగానికి పైగా ఆర్టీసీ బస్సులు నడ వలేదు. ఎన్టీఆర్ రీజియన్ నుంచి 409 రద్ద య్యాయి. హైదరాబాద్, బెంగళూరు, చెన్నైతో పాటు విశాఖపట్నం, తిరుపతి, ఖమ్మం, కాకి నాడ, రాజమండ్రి బస్సులను రద్దు చేశారు. రీజి యన్ పరిధిలో మొత్తం 749 ఆర్టీసీ సర్వీసులకు గానూ బుధవారం కేవలం 349 బస్సులే నడి చాయి. విజయవాడ అంతర్జాతీయ విమానా శ్రయం నుంచి 46 షెడ్యూల్ విమానాలు యథావిధిగా నడిచాయి. షార్జా, ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, విశాఖ మధ్య విమానాలు నడిచాయి. విజయ వాడ రైల్వే డివిజన్ పరిధిలో బుధవారం 49 రైళ్లు రద్దయ్యాయి. రెండు రోజులుగా రద్దయిన రైళ్లలో సగంమేర పునరుద్ధరించారు.

కృష్ణాజిల్లాలో..

మొంథా తఫానుకు కృష్ణాజిల్లా చిగురుటా కులా వణికింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం 11 గంటల వరకూ ఎడతె రిపి లేకుండా వర్షం కురవడంతో అంతటా భయాందోళన పరిస్థితులు నెలకొన్నాయి. బల మైన గాలులు వీయడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్షంతో పాటు బలమైన గాలులు వీచాయి. మంత్రులు కొల్లు రవీంద్ర, గొట్టిపాటి రవికుమార్ మచిలీపట్నంలో పర్య టించి పరిస్థితిని పర్యవేక్షించారు. జిల్లాలో 224 పునరావాస శిబిరాలను ఏర్పాటుచేసి అందులో 17,272 మందికి ఆవాసం కల్పించినట్లు కలెక్టర్ బాలాజీ తెలిపారు. తుఫాను తీవ్రత తగ్గడంతో ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేసి ప్రజలను ఇళ్లకు పంపిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా వరి, మినుము, వేరుశెనగ పంటలు 46వేల357హెక్టార్లలో దెబ్బ తిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమి కంగానిర్ధారించి ప్రభుత్వానికి నివేదిక పంపారు. 2,229 మంది రైతులకుచెందిన 1,416.22 హెక్టా ర్లలో ఉద్యానపంటలు దెబ్బతినగా, రూ. 73.45 కోట్ల నష్టం వాటిల్లినట్లుగా అంచనా వేశారు.

లెక్క తేల్చారు

(5వ పేజీ తరువాయి)

ఏజెంట్లు గాదంశెట్టి బాలకృష్ణమూర్తి, ఆయన సతీమణి నాగలక్ష్మీదేవిని పోలీసులు అరెస్టు చేశారు. ఆదిత్య ఏజెంట్లు, ఖాతాదారుల నుంచి పెట్టుబడు లను స్వీకరించినా ఎక్కడా రికార్డులు నిర్వహించలేదు. బ్యాంకింగ్‌లో సుజా తకు ఉన్న అనుభవం, మోసాల్లో తనకున్న తెలివితో పెట్టుబడులు ఎలా రాబట్టాలో ఆలోచించారు. 92 మంది రూ.9.47 కోట్లను పెట్టుబడిగా పెట్టారు. వారంతా కంపెనీ, ఏజెంట్ల నుంచి ఒక్క రూపాయి రిటర్న్ తీసు కోలేదు. వారందరినీ బాధితులుగా పోలీసులు నిర్ధారించారు.

మొత్తం రూ.144 కోట్ల నష్టం

2022లో అద్విక సంస్థను ఏర్పాటుచేసిన ఆదిత్య ఇప్పటి వరకు 1,417 మంది నుంచి రూ.413.03 కోట్లు సేకరించాడు. వాటిలో రూ.355.03 కోట్లు తిరిగి చెల్లించి, రూ.144 కోట్లకు ఎగనామం పెట్టాడు అని పోలీసులు నిర్ధా రించారు. ఇందులో పెట్టుబడులు పెట్టిన వారందరినీ విజయవాడలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి పిలిపించి విడివిడిగా వాంగ్మూలాలు తీసుకు న్నారు. చెల్లింపులకు సంబంధించిన లావాదేవీలను టాలీ షీట్ ద్వారా సరి చూశారు. ఇలా రేయింబవళ్లు లెక్కలు తీస్తే అద్విక చూపించిన నష్టం రూ.144 కోట్లుగా తేలింది. డిపాజిటర్లలో 1,139 మంది రూ.255 కోట్లు అద్వికలో పెడితే రూ.120 కోట్లను మాత్రమే తిరిగి తీసుకున్నారు. వారికి ఆదిత్య రూ.135 కోట్ల నష్టాన్ని మిగిల్చాడు. ఏజెంట్లలో 30 మంది రూ.54 కోట్లు పెడితే రూ.45 కోట్లు మాత్రమే చెల్లించాడు. వారికి రూ.9 కోట్ల నష్టాన్ని చూపించాడు.

'దర్యాప్తు'నకు రివార్డులు

సుమారు ఐదు నెలలుగా కేసును అధ్యయనం చేసిన పోలీసు అధికా రుల అసలు గుట్టును బయటకు లాగారు. పెట్టుబడులు, చెల్లింపులు పోగా పైసా ముట్టని బాధితులకు న్యాయం చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. అద్వికలో పెట్టుబడులు పెట్టి లాభాలు పొందినవారంతా వాటిని వెనక్కి ఇవ్వాలని ప్రతిపాదించారు. లేనిపక్షంలో సంస్థ ఎండీ శ్రీవెంకట ఆదిత్య దంపతుల మాదిరిగా కేసుల్లో ఇరుక్కోవాల్సి వస్తుందని హెచ్చరి స్తున్నారు. కాగా, దర్యాప్తు అధికారులు, సిబ్బందిని పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అభినందించారు. వారికి నగదు బహుమతులు అందజేశారు. ఈ కేసు దర్యాప్తునకు ఏర్పాటు చేసిన సిట్‌కు క్రైమ్స్ డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి చీఫ్‌గా వ్యవహరించారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ లతాకు మారి, సెంట్రల్ జోన్ ఏసీపీ కె.దామోదరరావు, మాచవరం ఇన్‌స్పెక్టర్ ప్రకాష్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం, మాచవరం ఎస్ఐ శంకర్, పటమట ఎస్ఐ రేవతితో పాటు ఈ బృందంలో పనిచేసిన హెడ్ కానిస్టే బుళ్లు, కానిస్టేబుళ్లకు నగదు బహుమతి అందజేశారు.


కొండపల్లి మున్సిపాలిటీలోని కాలనీల్లో పర్యటిస్తూ బాధితులతో మాట్లాడుతున్న మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్


మునేరు ఉధృతిని సీపీతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సౌమ్య


ఆర్టీసీ కాలనీలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాతయ్య

ఉధృతంగా వైరా, కట్లేరు నదులు

నందిగామరూరల్ : వైరా, కట్లేరు నదులు పొంగిపొర్లడంతో నందిగామ,వీరులపాడు మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బుధవారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షంతో నదులు ఉధృ తంగా ప్రవహిస్తున్నాయి. మండలంలోని దాములూరు నుంచి వీరు లపాడు మండలం పల్లపల్లికి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. నదిలోకి ఎవరూ దిగకుండా పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.

మరోసారి మద్యం నిందితుల బెయిల్ పిటిషన్లు

విజయవాడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకో ణంలో రిమాండ్ ఖైదీలుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, నవీన్‌కృష్ణ, బాలాజీ కుమార్ యాదవ్ ఏసీబీ కోర్టులో డిఫాల్ట్ బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. శ్రీధర్ రెడ్డి మంగళవారం దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. దీంతో ఆయన తిరిగి బుధవారం బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం జైళ్లలో ఉన్న ఏడుగురు నిందితుల బెయిల్ పిటిషన్లను ఇటీవల కోర్టు కొట్టేసింది. వారిలో నలుగురు మరోసారి బెయిల్ పిటి షన్లు దాఖలు చేశారు.

నకిలీ మద్యం పీటీ వారెంట్‌పై నేడు తీర్పు

విజయవాడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ కేసులో చిత్తూరు జిల్లా జైల్లో ఉన్న నలుగురు నిందితుల పీటీ వారెంట్‌పై తీర్పును విజయవాడ ఆరో అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు గురువారానికి వాయిదా వేసింది. ఈ కేసులో నింది తులుగా ఉన్న సయ్యద్ హాజీ, కట్టా శ్రీను, మిథున్ దాస్, అంత దాస్ నిందితులుగా ఉన్నారు. వారిపై పీటీ వారెంట్‌కు అనుమతి ఇవ్వాలని కొద్దిరోజుల క్రితం ఎక్సైజ్ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. 22వ తేదీలోపు వారిని కోర్టులో హాజరుపరచాలని న్యాయా ధికారి జి.లెనిన్‌బాబు ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఎక్సైజ్ పోలీ సులు వారిని హాజరుపర్చలేదు. దీనితో కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల గడువు ముగిసిపోయింది. ఇప్పుడు మళ్లీ ఎక్సైజ్ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ప్రసాదంపాడులో చెరువును తలపిస్తున్న రోడ్లు

గుణదల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల నుంచి ఎడతెరపు లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రసాదంపాడు వద్ద జాతీయ రహదారి చెరువును తలిపించేలా రోడ్డుమీద వర్షపునీరు భారాగా నిలిచిపోయింది. దీంతో బుధవారం ఉదయం వాహనాల రాకపోకలు భారీగా నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న నాల్గవ ట్రాఫిక్ సీఐ రమేష్ కుమార్, ఆర్ఎస్ఐ ఆదినారాయణలు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. అగ్నిమాపక శకటాల ద్వారా రోడ్లమీద నిలిచి పోయిన నీటిని మోటార్ల సాయంతో తొలగించారు. మైక్ సాయంతో వాహన చోదకులకు గుంతలు లేవు రోడ్డు సజావుగానే ఉందని ధైర్యం చెబుతూ వాహనాలను క్రమబద్ధీకంరించారు.


జవహర్ ఆటోనగర్ పాకలవీధిలో తొలగిస్తున్న రోడ్డుపై వర్షపు నీరు

జనజీవనం అస్తవ్యస్తం

- ఆటోనగర్‌లో మొంథా తుఫాన్ ప్రభావం
- నేలకు ఒరిగిన భారీ వృక్షాలు
- రోడ్లపై వర్షపునీరు.. మోటార్ల సహాయంతో తొలగింపు
- న్యూఆటోనగర్‌లో మునిగిన రోడ్లు.. అడుగడుగునా గుంతలు

ఆటోనగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : జవహర్ ఆటోనగర్, న్యూఆటోనగర్‌లో మొంథా తుఫాను ప్రభావం కనిపించింది. ఈఆటోనగర్‌ల్లో వర్షానికి రోడ్లు ఛిద్రంగా మారాయి. దీంతో జనజీవనమే అస్తవ్యస్తంగా మారింది. ప్రధాన రహదారితోపాటు అంతర్గత రోడ్లలో సైతం వర్షపునీరు నిల్వడంతో నడవడమే కష్టంగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

జవహర్ ఆటోనగర్‌లో నెలకొరిగిన భారీ వృక్షాలు...

జవహర్ ఆటోనగర్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం పక్కరోడ్డులో రెండు చెట్లు, ఇండస్ట్రీయల్ ఎస్టేట్ రెండవ క్రాస్ ఒకటో రోడ్డులో, ఒకటో క్రాస్ ఆరవ రోడ్డులో ఒకటేసీ చొప్పున మొత్తం నాలుగు భారీ వృక్షాలు నెలకొరిగాయి. రోడ్లకు అడ్డంగా ఈవృక్షాలు పడటంతో వీటిని తొలగించేందుకు ఐలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. పాకలవీధికి వర్షపునీటితోపాటు డ్రెయినేజీ నీరు తోడవడంతో ఆవీధిలో మునిగిపోయింది. ఐలా అధికారులు మోటర్ల సహాయంతో నీటిని తోడుతున్నారు. గుంటుతిప్ప డ్రెయిన్‌లో నీరు తగ్గితే ఆటోనగర్‌లోని పలురోడ్ల నీటి మునకనుంచి బయటపడతాయని ఐలా అధికారులు చెబుతున్నారు. స్థానికులు తీవ్ర అవస్తలు పడుతున్నారు. ఐలా అధికారులు పాకలవీధిలో మోటార్లుతో నీటిని తోడిస్తున్నారు.

న్యూఆటోనగర్‌లో రోడ్లపైనే వర్షపునీరు

న్యూఆటోనగర్‌లో మెయిన్‌రోడ్డుతోపాటు అంతర్గత రోడ్లు కూడా వర్షపునీటితో నిండాయి. దీంతో ఈరోడ్లపై నడవడమే కష్టంగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిలువెత్తు గోతులతో ఉన్న రోడ్లపైకి వర్షపునీరు రావడంతో ఇబ్బంది పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. వాహనాలు గొయ్యిల్లో పడి వాహనచోదకులు గాయాలకు గురవుతున్నారు. ఐలా అధికారులు దృష్టి సారించి న్యూఆటోనగర్‌లలో సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


జవహర్ ఆటోనగర్‌లో రోడ్డుపై విరిగిపడిన భారీ వృక్షాలు

కొండచిలువల తొలగింపు

రామలింగేశ్వరనగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : శ్మశాన వాటిక వద్ద చంపిన కొండ చిలువలను అధికారులు జేసీబీతో తొలగించారు. వాటిని చూసి 14వ డివిజన్ పటమట అంబేద్కర్‌నగర్, సత్యనారాయణనగర్, చిన్న వంతెన సెంటర్, కాలువగట్టు ప్రాంత ప్రజలు బెంబేలెత్తారు. నివాసాలకు ఆనుకుని ఉన్న స్మశానాన్ని ఎప్పటినుంచో శుభ్రపరచకపోవడం వలనే చెట్లు ఏపుగా పెరిగి దట్టమైన అడవిని తలపించేలా మారడంతో సమాధులలో విషసర్పాలు, కొండచిలువలు, మండ్రగప్పలు వంటి విష పురుగులకు కేంద్రంగా మారింది. గత మూడు రోజుల క్రితం వీఎంసీ సిబ్బంది స్మశానాన్ని 70 శాతం మాత్రమే శుభ్రపరిచారని పూర్తిగా శుభ్రపరచకపోవడం వలన కొండచిలువలు విష సర్పాలు సంచరిస్తున్నాయి.


బెత్లహాం నగర్‌లో కొండప్రాంతంలో ప్రజలను పునరావాస కేంద్రాలకు వెళ్లేలా వారితో మాట్లాడుతున్న సెంట్రల్ డీసీపీ దామోదర్

సెంట్రల్ ఏసీపీకి ప్రశంసల జల్లు

- రెండో డివిజన్ బెత్లహాంనగర్‌లో రాత్రి వరకు పరిశీలన
- స్థానికులను ఒప్పించి.. పునరావాస కేంద్రాలకు వెళ్లేలా చొరవ

విజయవాడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 2వ డివిజన్ బెత్లహాంనగర్‌లో కొండప్రాంతంలో ఉన్న నివాసితులను పునరావాస ప్రాంతాలకు వెళ్లేలా బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఏసీపీ దామోదర్ చేసిన కృషి స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు. మొంథా తుఫాను ప్రభావంతో నగరంలోని 2వ డివిజన్ బెత్లహాంనగర్‌లో బుధవారం తెల్లవారుజామున ఓ ఇంటి ప్రహరీపై పెద్ద కొండరాయి విరిగిపడి ఒక ఇంటి ప్రహరీ పై పడడంతో ప్రహరీ పడిపోయింది. అదృష్టవశాత్తు ఆ రాయి ఇంటిని తాకకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగలేదు. విషయం తెలుసుకున్న సెంట్రల్ ఏసీపీ దామోదర్ ప్రమాద స్థలానికి డీసీపీ సరితతో కలిసి వెళ్లారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఏసీపీ దామోదర్ అక్కడి ప్రజలను పునరావాస కేంద్రాలకు వెళ్లాలంటూ కోరారు. కొంతమంది వినకపోయినప్పటికీ గాలులు, వర్షం వస్తే జరిగే నష్టాల గురించి వివరించి సుమారు 20 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు వెళ్లేలా ఒప్పించారు. వెళ్లడానికి ఇష్టపడని కొంతమందిని తమ బంధువులు, స్నేహితులు ఇళ్లకైనా వెళ్లాంటూ ఓపిగ్గా చెప్పడంతో మరికొంతమంది బంధువుల ఇళ్లకు వెళ్లారు. బెత్లహాంనగర్ నివాసితులు ఏసీపీ దామోదర్‌పై ప్రశంసలు కురిపించారు.

బాధితులకు బద్రి పరామర్శ

రామలింగేశ్వరనగర్ అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు ఆదేశానుసారం గోవిందరాజులు స్కూల్లో పునరావాస కేంద్రంలో ఉన్న మొంథా తుఫాను వరద బాధితులను 14వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి గరికిపాటి బద్రి బాధితులను యోగ క్షేమాలు అడిగి తెలుసుకుని ఎటువంటి లోటు లేకుండా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వారు తీసుకుంటున్న ఆహార సదుపాయాలు సౌకర్యాలను పరిశీలించి వారికి ఎటువంటి లోటు లేకుండా చూసుకోవాలని అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షులు కర్ల రమేష్, టీడీపీ సీనియర్ నాయకులు రాధారపు ఎల్లబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో బాసట.. కానరాని అలసట

- తుఫాను సహాయ చర్యల్లో ముమ్మరంగా జిలా యంత్రాంగం
- పలు ప్రాంతాల్లో జేసీ, ఆర్డీవోల విస్తృత పర్యటన



నున్న పునరావాస కేంద్రంలో భోజనం వడ్డిస్తున్న జేసీ ఇలక్కియా

కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తుఫాను సహాయక చర్యల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్న కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాల మేరకు జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా, ఆర్డీఓలు కావూరి చైతన్య, కె.మాధురి, కె.బాలకృష్ణ క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించారు. పునరావాస కేంద్రాలకు, తుఫాను ప్రభావిత ప్రాంతాలకు వెళ్లి ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. నీరునిలిచిన హెచ్‌బీ కాలనీ, స్వాతి థియేటర్ రోడ్డును, భవానీపురం, లేబర్‌కాలనీ పునరావాస కేంద్రాలను జేసీ ఇలక్కియా పరిశీలించారు. విజయవాడ ఆర్డీఓ కావూరి చైతన్యతో కలిసి నున్న గ్రామంలోని చెరువును, జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న వారికి స్వయంగా భోజనం వడ్డించారు. కొత్తూరు తాడేపల్లి గ్రామంలోని పునరావాస కేంద్రంలో భోజనం, ఇతర ఏర్పాట్లు పరిశీలించారు. తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని తిరువూరు ఆర్డీఓ కె.మాధురి పరిశీలించి, అక్కడ ఆశ్రయం పొందుతున్న ప్రజలతో కలిసి అల్పాహారం స్వీకరించారు. చింతలపాడు గ్రామం వద్ద పొంగిపొర్లుతున్న గుర్రపు వాగును పరిశీలించి, రాకపోకలు సాగించరాదని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. మాచవరం రెవిన్యూ కాలనీలో కొండ ప్రాంతాలను విజయవాడ ఆర్డీఓ కావూరి చైతన్య పరిశీలించారు. ఫ్రేజర్‌పేటలో కూలిన చెట్లను, విద్యుత్ స్థంభాన్ని పరిశీ లించి, తొలగింపచేశారు. విజయ రాకేష్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పున రావాస కేంద్రాన్ని పరిశీలించారు. నందిగామ ఎమ్మె ల్యే తంగిరాల సౌమ్యతో కలిసి ఆర్డీఓ కె.బాలకృష్ణ డీవీఆర్ కాలనీ లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు.


బాధితులతో కలిసి అల్పాహారం చేస్తున్న తిరువూరు ఆర్డీవో మాధురి

ప్రాణ నష్టం జరగకుండా జాగ్రత్త పడటం ప్రధానం: డీసీపీ సరిత

గుణదల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్లు విపత్తులు వచ్చిన సమయంలో ప్రాణనష్టం జరగకుండా ప్రజలను అప్రమత్తం చేయడం ప్రధానం అని డీసీపీ సరిత అన్నారు. మొంథా తుఫాను నేపథ్యంలో గుణదల్లోని రెండవ డివిజన్ పరిదిలోగల బెత్లహామ్ నగర్, కార్మెల్‌నగర్, లూర్దునగర్లలో డీసీపీ సరిత, మాచవరం సీఐ ప్రకాష్ తదితరులు కొండ ప్రాంతంలో బుధవారం పర్యటించి ప్రజలకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. రెండు రోజులుగా ఎడతె రపిలేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కొండ చరియలు విరిగిప డేందుకు అవకాశం ఉన్న ప్రదేశాలను ముందుగా గుర్తించామని ఆమె తెలిపారు. అటువంటి ప్రదేశాల్లో నివాసాలు ఉండేవారిని అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను కోరారు. పరిసర ప్రాంతాల్లో ఒరిగిన ప్రహరీ పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.


గుణదల రెండో డివిజన్ పరిధిలో కొండచరియలు విరిగిపడేందుకు అవకాశం ఉన్న ప్రదేశాలను పరిశీలిస్తున్న డీసీపీ సరిత, మాచవరం సీఐ ప్రకాష్

చుట్టుగుంటలో విరిగిపడ్డ చెట్టు

ఏలూరు రోడ్డులోని చుట్టుగుంట వద్దగల బీఎస్ఎన్ఎల్ రీజనల్ కార్యాలయం వద్ద మంగళవారం రాత్రి పెద్దచెట్టు విరుచుకుపడిపోయింది. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉండటంతో సమాచారం అందుకున్న 26వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ వల్లభనేని సతీష్, డివిజన్ అధ్యక్షుడు తోట పాండులు ఘటనా స్థలానికి చేరుకుని చెట్టుతొలగింపుకు వీఎంసీ సిబ్బంది సాయంతో చర్యలు తీసుకున్నారు.



గేమేళాబజార్ రోడ్డులో నిలిచిన వర్షపునీరు.. పీఅండ్‌టీ కాలనీలో..

రహదారులు జలమయం

భారతీనగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథాతుఫాను ప్రభావం వల్ల మంగళవారం రాత్రి కురిసిన గాలివానకు తూర్పు నియోజక వర్గం పరిధిలోని 3,4,10,11 డివిజన్ల పరిధిలోని పలు ప్రధాన, అంతర్గత రోడ్లు జలమయం అయ్యాయి. అంతే కాకుండా పలుచోట్ల చెట్లు కూలిపోయాయి. ముఖ్యంగా ఏపీఐఐసీకాలనీ, , నాగార్జుననగర్ కాలనీ, ఆర్ఆర్ గార్డెన్, కరణంగారి బజార్, పంట కాలువ రోడ్డు సమీపంలోని పీఅండ్‌టీ కాలనీ, శ్రీనివాస బ్యాంక్ కాలనీ అంతర్గత రోడ్లు, విజయలక్ష్మీ కాలనీ మెయిన్ రోడ్డుతో పాటు పలు ప్రధాన కాలనీల మెయిన్ రోడ్లు, భారతీనగర్ కాలనీ మెయిన్ రోడ్డు, ఈఎస్ఐ రోడ్డు, ఎన్టీఆర్ కాలనీ, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ, వెంకటేశ్వరనగర్, సుబ్బారావు కాలనీ, కరెన్సీనగర్ కాలనీలోని పలు అంతర్గత రోడ్లు జలమయం అయ్యాయి. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగించారు.

విరిగిపడిన చెట్లు.. మునిగిన రోడ్లు

ఈదురుగాలులకు భయంతో వణికిపోయిన ప్రజలు.. తొలగింపు పనులు చేపట్టిన టీడీపీ నాయకులు

మొగల్రాజపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను తాకిడికి మంగళవారం అర్ధరాత్రి కురిసిన వర్షం, వీచిన గాలుల తాకిడికి పలు మొగల్రాజపురం పరిసర ప్రాంతాలలో పలుచోట్ల రోడ్లు వర్షం నీటితో నిండిపోవడం, భారీ వృక్షాలు కూలడం జరిగింది. ఏడో డివిజన్ పరిధిలో జమ్మిచెట్టు సెంటర్‌కు నలువైపులా భారీగా వర్షం నీరు చేరి రోడ్డు మునిగిపోయింది. పిన్నమనేని రోడ్డులో అయితే మదర్‌థెరీసా జంక్షన్, సిద్దార్థ ఫార్మశీ కళాశాల, లలితా జ్యూయలరీస్ ఎదురు, గాయత్రీనగర్ రోడ్డు, రిజిస్టార్ ఆఫీసు రోడ్డు నీట మునిగాయి.

కృష్ణలంక : మొంథా తుఫాను నేపథ్యంలో మంగళవారం రాత్రి వీచిన పెను ఈదురుగాలులకు కృష్ణలంక రణదీవెనగర్ కట్ట కింద ఓ ఇంటిలోని భారీ వేపచెట్టు పడిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న టీడీపీ డివిజన్ అధ్యక్షుడు మోటేపల్లి చిన్నా, నాయకులు అడపా శివ, వన్నెంరెడ్డి రాధాకృష్ణ, ఒడుగు సురేష్‌వర్మ, చిటికెల ఏసుబాబులు కార్పొరేషన్ సిబ్బందిని సంప్రదించి ఎలక్ట్రికల్ రంపాన్ని తెప్పించి పడిపోయిన వృక్షాన్ని ముక్కలుగా చేయించి రాకపోకలకు మార్గం సుగమం చేశారు.

లబ్బీపేట : మొంథా తుఫాను ప్రభావంతో నగరంలో పలు చోట్ల చెట్లు నెలకొరిగాయి. లబ్బీపేట 19వ డివిజన్‌లో ఫకీరు గూడెం, ఆర్ అండ్ బీ క్వార్టర్స్ పున్నమ్మతోట, బృందావన్ కాలనీ తదితర ప్రాంతాలలో భారీ వృక్షాలు తుఫాను ప్రభావంతో నెలకొరిగాయి. దీంతో విద్యుత్ అంతరాయంతో పాటు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తడంతో స్థానికులు అవస్థలు పడ్డారు. విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే స్పందించి వృక్షాలను యుద్ధప్రాతిపదికను తొలగించి స్థానికుల కు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

రామలింగేశ్వరనగర్ : మొంథా తుఫాను దాటికి నగరంలోని 13,14 డివిజన్‌లలోని దర్శిపేట ఎస్ఎస్ఎం స్కూల్ రోడ్డు, న్యూ ఆర్టీసీ కాలనీలోని రామమందిరం రోడ్డులో వృక్షాలు నేలకొరిగాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు కురిసిన వర్షానికి బలమైన గాలులు తోడవడంతో రోడ్ల వెంబడి చెట్లు కూలాయి. రోడ్డు అడ్డంగా చెట్లు పడటంతో ఆయా ప్రాంతాల్లో కొన్ని గంటలు రాకపోకలు స్థంభించాయి. వెంటనే స్పందించిన మునిసిపల్ సిబ్బంది ఉదయం పడిన చెట్లను తొలగించి, ప్రజా రవాణాను పునరుద్దరించారు.



జమ్మిచెట్టు సెంటర్‌లో విద్యుత్ లైన్‌పై పడిన చెట్టు కొమ్మలు ..కూలిన వేపచెట్టు తొలగింపు పనుల్లో టీడీపీ నాయకులు

చంద్రబాబు ముందస్తు
ఆలోచనతో తప్పిన ప్రమాదాలు

గద్దె క్రాంతి కుమార్


మాచవరంలో కొండ చరియలు విరిగిపడిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న గద్దె క్రాంతి కుమార్

గుణదల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్య మంత్రి చంద్రబాబు ముందస్తు ఆలోచనల కారణంగా పెను తుఫానుకు ప్రాణనష్టం ఆస్తి నష్టం ఏమీ జరగకుండా జాగ్రత్త పడగలిగామని టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ అన్నారు. ముం దస్తుగా హెచ్చరికలు జారీ చేయడం మొదలు అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్లల్లోనుంచి బయటికి రావద్దని చేసిన హెచ్చరికలు ఎంతో ప్రాణాలను కాపాడాయని చెప్పకతప్పదన్నారు. స్థానిక రెండవ డివిజన్లోని రెవెన్యూ కాలనీ రెండవ రోడ్డులో కొండ చరియలు విరిగిపడిన ప్రదేశాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో 2వ డివిజన్ టీడీపీ నాయకులు దాసరి గాబ్రియేలు, సుగసాని రత్నశ్రీ, కృష్ణ ప్రసాద్, ముత్యాల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

స్తంభించిన మురుగు

కృష్ణలంక : మొంథా తుఫాను నేపథ్యంలో కురిసిన వర్షానికి ఓపెన్‌డ్రైనేజీలో మురుగు నీరు పారుదల పెరగడం, దీనికితోడు కొబ్బరిబోండాలు, ప్లాస్టిక్ కవర్ల వలన పారుదల నిలిచిపోవడంతో రాణిగారితోట సిద్ధం కృష్ణారెడ్డి రోడ్డులోని ప్రధాన డ్రైనేజీలో మురుగునీరు పారుదల సక్రమంగా జరిగేందుకు స్థానిక టీడీపీ డివిజన్ అధ్యక్షుడు వేముల దుర్గారావు బుధవారం శానిటరీ సిబ్బందిచే దగ్గరుండి పారుదల సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకొన్నారు.

మొంథా విధ్వంసం

● కోడూరులో భారీ వృక్షాలు పడి ఇళ్లు ధ్వంసం ● మచిలీపట్నంలో విరిగిపడిన చెట్లు ● చల్లపల్లిలో నేలవాలిన వరి, కూలిన అరటి పంట ● భారత్ సాల్ట్ పరిశ్రమకు భారీ నష్టం

● పునరావాస కేంద్రాలను సందర్శించిన కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ, జేసీ నవీన్, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ● బాధితులకు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ భరోసా ● కృత్తివెన్నులో ఆక్వా అతలాకుతలం



కోడూరులో ఇంటిపై పడిన భారీ వృక్షం

కోడూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో వీచిన ఈదురుగాలులకు కోడూరులోని పలుప్రాంతాల్లో భారీ వృక్షాలు కూలి నివాసాలు, కార్లు ధ్వంసమయ్యాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరగటంతో విద్యుత్‌కు పూర్తిగా అంతరాయం ఏర్పడింది. వేలాది ఎకరాలలో వరి పంట నేలకొరిగింది. కోడూరు, రామకృష్ణాపురం, నరసింహాపురం, కృష్ణాపురం, విశ్వనాథపల్లి, మందపాకల, స్వతంత్రపురంలో భారీ వృక్షాలు కూలటంతో రాకపోకలకు, విద్యుత్ అంతరాయం ఏర్పడి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి.



పునరావాస కేంద్రాల్లో బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టర్ పునరావాస కేంద్రాల సందర్శన

తీర ప్రాంత గ్రామ ప్రజల సంరక్షణకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను బుధవారం కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ, జేసీ నవీన్, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు సందర్శించారు. ఆహారం, తాగునీరు, వైద్య సామగ్రి ఏర్పాట్ల గురించి బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో 5 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. తీర ప్రాంత గ్రామాలైన రామకృష్ణాపురం, ఊటగుండం, ఇరాలి, బసవవానిపాలెం, హంసలదీవి, పాలకాయితిప్ప, చింతకోళ్ల నుంచి 5వేల మంది ప్రజలను పునరావాస కేంద్రాకు తరలించామన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి విపత్తు ప్రాణ నష్టం, జంతు నష్టం జరగలేదన్నారు. తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి, ఎంపీడీవో సుధా ప్రవీణ్, ఎంఈవో రామదాసు, ఈవోపీఆర్డీ రేవతి, మండల కూటమి నేతలు, పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, బండే శ్రీనివాసరావు, మర్రె గంగయ్య పాల్గొన్నారు.

ఇళ్లకు తరలిన బాధితులు

తుపాను ప్రభావం సమసిపోవటంతో పునరావాస కేంద్రాల్లోని తీర ప్రాంత ప్రజలను వారి ఇళ్లకు ప్రత్యేక వాహనాల్లో తరలించారు. రెవెన్యూ పోలీసు అధికారులు ప్రత్యేక పర్యవేక్షణలో బాధితులను వాహనాల్లో ఎక్కించారు.

గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మండలంలోని రామకృష్ణాపురం గ్రామాన్ని పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలోని పునరావాస కేంద్రంలోని తుఫాను బాధితులతో మాట్లాడి వారికి భరోసా ఇచ్చారు. తుఫాను ప్రభావిత వర్షాలు వీడే వరకు శిబిరాల్లోనే ఉండాలని సూచించారు. బాధితులకు అండగా ఉండాలని కూటమి నేతలకు సూచించారు.



చిన్నాపురంలో విరుచుకుపడ్డ చెట్టు

మచిలీపట్నంలో విరిగిపడిన చెట్లు

మచిలీపట్నం టౌన్: మొంథా తుపాను ప్రభావం నగరంలో ఎక్కువగా కనబడింది. నియోజకవర్గంలో ప్రాణ నష్టం, పశునష్టం సంభవించలేదు కానీ పంట నష్టం సంభవించింది. పెనుగాలులకు రోడ్లపక్కన చెట్లు కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు రోడ్లకు అడ్డంగా ఉన్న చెట్లను హుటాహుటిన తొలగిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు పాడైపోవడం, విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో ఇంకా నగరంలో కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా జరగలేదు. చిలకలపూడి వెళ్లే దారిలో మంగినపూడి, మేకావారిపాలెం, తాళ్లపాలెం, చిన్నాపురం తదితర ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. మేజర్ పంచాయతీలైన తాళ్లపాలెం తదితర గ్రామాల్లో ఇంకా విద్యుత్ సరఫరా అందించే పరిస్థితి లేదు.

నిలిచిన జిల్లా రిజిస్ట్రార్ ఆఫీసు పనులు

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పెద్ద చెట్లు రెండు కూలగా, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో కార్యాలయంలో విద్యుత్ సరఫరా లేనందున కార్యాలయం పనిచేయ లేదు. లావాదేవీలు నిలిచిపోయాయి. వెంటనే చెట్లను తొలగించి విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

భారత్ సాల్ట్‌కు తీవ్రనష్టం

మచిలీపట్నం: మొంథా తుపాను కారణంగా మచిలీపట్నం పల్లెతుమ్మలపాలెంలోని భారత్ సాల్ట్ కంపెనీకి తీవ్రనష్టం వాటిల్లింది. 6500 ఎకరాల్లో ఉప్పు సాగుతోంది. తుపాను ప్రభావంతో పెద్దఎత్తున అలలు ఎగిసిపడి ఉప్పు ఉత్పత్తి కేంద్రంలోకి ప్రవేశించటంతో అక్కడ ఉప్పు ఉత్పత్తికోసం నిల్వ ఉంచిన చెరువుల్లోని నీరు, చెరువులకు సంబంధించిన గట్లకు గండ్లు పడిపోయాయి. ఏటా నవంబరులో ఇక్కడ ఉప్పు ఉత్పత్తి ప్రారంభమవుతుంది. ఈ తరుణంలో తుఫాను కారణంగా చెరువులకు గండ్లు పడటంతో తీవ్రనష్టం వాటిల్లింది. భారత్ సాల్ట్ కోన, పల్లెతుమ్మలపాలెం, పోలాటితిప్ప తదితర గ్రామాలకు చెందిన 2వేల మందికి పైగా ప్రజలకు ఉపాధి కల్పిస్తోంది. ఈ ఏడాది ఉప్పు ఉత్పత్తి ప్రారంభించే సమయానికి తుపాను రూపంలో విపత్తు రావటంతో ఉప్పు ఉత్పత్తి ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. భారత్ సాల్ట్ ఫ్యాక్టరీలోని విద్యుత్ స్తంభాలు, పోలాటితిప్ప, పల్లెతుమ్మలపాలెం, కోన గ్రామాల్లోని విద్యుత్ స్తంభాలు నేలవాలటంతో తీవ్ర నష్టం వాటిల్లింది.



నదీతీరంలో గాలులకు విరిగిపడిన అరటిచెట్లు

నేలవాలిన వరిచేలు.. విరిగిపడిన అరటిచెట్లు

చల్లపల్లి: తుఫాను గాలుల ధాటికి వరిచేలు నేలవాలాయి. మండలంలో 11వేల 907 ఎకరాల్లో వరిసాగవుతుండగా, పలు గ్రామాల్లో గింజ పాసుపోసుకునే దశలో ఉంది. కొన్నిర గ్రామాల్లో వరిపైరు గింజ తయారై ఉంది. గాలుల తీవ్రతకు వరి గింజలు తయారైన చేలు నేలవాలాయి. మాజేరు పరిధిలోని పల్లపు ప్రాంతంలో సుమారు 190 ఎకరాలు నీటిలోనే ఉన్నాయి. చల్లపల్లి, మంగళాపురం, మాజేరు, మేకావారిపాలెం, వక్కలగడ్డ, రాముడుపాలెం, పాగోలు తదితర గ్రామాల్లో 3618 ఎకరాల్లో వరిపంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఈమేరకు గ్రామాల్లో పర్యటించి వరిచేలను పరిశీలించి రైతులకు సూచనలు అందిస్తున్నట్టు ఏవో కే మురళీకృష్ణ తెలిపారు. కృష్ణానదీ తీర గ్రామాల్లో వాణిజ్య పంటలు, ప్రధానంగా అరటితోటలు గాలులకు విరిగిపడ్డాయి. చేతికందే దశలో ఉన్న అరటిచెట్లు విరిగిపడిపోవటంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వరద కారణంగా గతంలో అరటి రైతులు నష్టపోగా, తాజాగా 114 ఎకరాల్లో అరటి తోటలు, రెండెకరాల్లో బొప్పాయి పంటకు నష్టం వాటిల్లినట్లు అంచనావేసినట్లు ఉద్యానవన శాఖ అధికారాణి జే కీర్తి తెలిపారు.



ఆక్వా అతలాకుతలం

కృత్తివెన్ను: మొంథా తుపాన్ ప్రభావంతో డ్రైన్లు పొంగిపొర్లుతున్నాయి. ముఖ్యంగా మండలంలోని తీరప్రాంత, లోతట్టు గ్రామాలైన లక్ష్మీపురం, పోడు, నిడమర్రు, దోమలగొంది గ్రామాల్లో డ్రెయిన్లు నీరు లాగకపోవటంతో పొంగి, సమీప చెరువులన్నీ నీట మునిగాయి. దీంతో గట్లు కనబడకుండా నీటిలో చెరువులు మునిగిపోతున్నాయి. చెరువుల్లోని చేపలు, రొయ్యలను కాపాడుకొనేందుకు ఆక్వా రైతులు గట్లపై వలలు కట్టుకొని, తీవ్రంగా శ్రమిస్తున్నారు. అయిన తమకు నష్టం తప్పదని వాపోతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

నూజివీడు కోర్టుకు మాజీ ఎమ్మెల్యే వంశీ



నూజివీడు టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వల్లభనేని వంశీ బుధవారం ఏలూరు జిల్లా నూజివీడు కోర్టుకు హాజరయ్యారు. కృష్ణాజిల్లా బాపులపాడు మండలంలో నకిలీ నివేశన స్థలపట్టాల పంపిణీ విషయంలో బాపులపాడుకు చెందిన ఓ వ్యక్తి వేసిన ప్రైవేట్ కేసులో కోర్టుకు హాజరు కావాల్సిందిగా ఆదేశాలు రావడంతో వంశీ నూజివీడు సెకండ్ ఏజేఎం కోర్టుకు హాజరయ్యారు. న్యాయమూర్తి సదరు కేసును వచ్చే ఏడాది ఫిబ్రవరి 16కి వాయిదా వేయడంతో న్యాయవాదులతో మాట్లాడిన అనంతరం కోర్టు నుంచి వెళ్లిపోయారు.

లీనా మార్ట్ బ్రాంచ్‌ల పేరుతో

రూ.50లక్షలు మోసం, కేసు నమోదు

విద్యాధరపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతాల్లో లీనా మార్ట్ బ్రాంచ్‌లు ఏర్పాటు పేరుతో అవుట్ ఏజెన్సీ ప్రాంతానికి చెందిన వ్యక్తి వద్ద రూ.50లక్షలు డబ్బులు తీసుకుని మోసం చేసిన కాణిపాక అనిల్ అనే వ్యక్తిపై బుధవారం భవానీపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. భవానీపురం రంగూన్ సాహెబ్ వీధి అవుట్ ఏజెన్సీ ప్రాంతంలో చింతపల్లి విద్యాసాగర్ కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. కరెన్సీనగర్‌లోని ఓ ప్రముఖ హాస్పటల్‌లో పనిచేస్తున్నాడు. ఇతనికి గొల్లపూడి వాసవీ కాంప్లెక్స్‌లోని ఓ మెడికల్ షాపులో పనిచేస్తున్న స్నేహితుడు కేసరి సుబ్బారెడ్డి వద్దకు అప్పుడప్పుడు వెళుతుంటాడు. ఈ క్రమంలో అక్కడ కాణిపాక అనిల్ పరిచయమయ్యాడు. తాను లీనా మార్ట్ సంస్థలో జీఎంగా పని చేస్తున్నానని, అమరావతిలోనూ మూడు బ్రాంచ్‌లు ప్రారంభించాలన్నాడు. దీంతో విద్యాసాగర్ తానే ప్రారంభిస్తానని ఒకసారి రూ.24లక్షలు, మరోసారి రూ.26 లక్షలు ఇచ్చాడు. అనంతరం అనిల్ చెప్పినట్టు సరుకులు పంపించకపోవటంతో బాధితుడు విద్యాసాగర్ ఫోన్ చేసి అడగ్గా సరుకులు పంపించను, డబ్బులు ఇవ్వను అడిగితే చంపేస్తానంటూ బెదిరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కాణిపాకం అనిల్‌పై కేసు నమోదు చేశారు.

తిరువూరును వదిలే ప్రసక్తే లేదు

● ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

మేడూరు (గంపలగూడెం) అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరువూరు నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లేవరకు, తాను తిరువూరును విడిచివెళ్లే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మేడూరు పంచాయతీ పరిధిలో టీడీపీ నేత మారబత్తుల సునంధరావు గృహంలో ఏర్పాటు చేసిన, పార్టీ నేతలు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విస్సన్నపేట మండల టీడీపీ అధ్యక్షుడు రాయల సుబ్బారావుకు వైసీపీతో నిత్య సంబంధాలున్నాయని, గతంలో వైఎస్ జగన్ జన్మదిన వేడుకల్లో పాల్గొని, కేక్‌కట్ చేసిన చరిత్ర ఉందన్నారు. అంతేకాదు తిరువూరు, గంపలగూడెం మండలాల టీడీపీ అధ్యక్షులుగా ఉన్నవారు ఒకప్పుడు కాంగ్రెస్‌లో ఉన్నవారేనని, అలాంటి వ్యక్తులకు ఎంపీ మద్దతుతో పదవులు వచ్చాయన్నారు. మొంథాతుపాన్‌వచ్చి వరదలు ముంచెత్తుతుంటే, ఎంపీ కేశినేని శివనాథ్ ఎక్కడున్నారో చెప్పాలన్నారు. కల్తీమద్యం కేసులో ఉన్నవారందరితో ఎంపీకి వ్యాపార సంబందాలున్నాయని ఆరోపించారు. డిల్లీలో ఎంపీ పేకాడుతుంటే పోలీసులు పట్టుకున్న సందర్భం ఉందన్నారు. ఇసుక, మద్యం, మట్టి మాఫియాలో ఎంపీకి వాటాలున్నాయన్నారు. సీఎం చంద్రబాబు చెప్పినట్టు బీసీలకు 50 శాతం, ఎస్సీలకు 16 శాతం, ఎస్టీలకు 7 శాతం దమాషా ప్రకారం పదవులు కేటాయిస్తామన్నారు. పీఏసీఎస్ అధ్యక్షుల ఎంపికలో బడుగు బలహీన వర్గాలకు అన్యాయం జరిగిందని, ఎంపీ కార్యాలయలో ముడుపులు అప్పగించిన ఓసీలకు పదవులిచ్చారన్నారు. పార్టీకి ఎవరు నష్టం తెస్తున్నారో పార్టీ అధినేత చంద్రబాబే తెలుస్తారన్నారు.

తుఫాను బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం

● మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

గొల్లపూడి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజల భద్రత, రైతుల భవిష్యత్తు కోసం సీఎం చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని, మొంథా తుఫాను బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి పరిసర ప్రాంతాల్లో తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను బుధవారం పరిశీలించిన ఆయన రైతులతో మాట్లాడి, వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా దేవినేని ఉమా మాట్లాడుతూ తుఫాను సమయంలో ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలు, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ కృషిని ప్రశంసించారు. రైతుల నష్టాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. సీఎం చంద్రబాబు ఐదు రోజులుగా పర్యవేక్షిస్తూ, ప్రజల ప్రాణాలు, ఆస్తి నష్టాన్ని తగ్గించే దిశగా అధికారులకు మార్గనిర్దేశం చేస్తున్నారన్నారు. మంత్రి లోకేష్ రాత్రింబవళ్లు ఆర్టీజీ కార్యాలయంలోనే ఉండి సహాయక చర్యలను సమీక్షిస్తున్నారని, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఇతర మంత్రులు తుఫాను సహాయక రక్షణ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారని, అందుకే బాధితులకు త్వరగా సహాయం అందుతుందన్నారు.



ఎప్పుడూ బిజీగా ఉండే బందరు రోడ్ ఖాళీగా..

బోసిపోయిన నగరం

● ప్రధాన కూడళ్లలో తెరవని వ్యాపార సముదాయాలు

● రవాణా సేవలు అంతంతమాత్రం ● ఖాళీగా రోడ్ల దర్శనం

విజయవాడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో నగరం మొత్తం స్తబ్దంగా మారింది. గాలులు, వర్షం తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణశాఖ అధికారులు ప్రకటించిన నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. నగరంలోని అన్ని వాణిజ్య సముదాయాలు, దుకాణాలు, షాపింగ్ మాల్స్‌ను మూసేయలంటూ మంగళవారం రాత్రే ఆదేశాలు జారీచేశారు. దీంతో నగరంలోని అన్ని వ్యాపార సముదాయాలను మంగళవారం రాత్రి ఎనిమిది గంటలకే మూసేయడంతో నగరం ఒక్కసారిగా నిశ్శబ్దంలోకి జారుకుంది. నగరంలోని ప్రధాన వాణిజ్య సముదాయ ప్రాంతాలైన బీసెంట్ రోడ్డు, బెంజిసర్కిల్, ఆటోనగర్, వన్‌టౌన్, టూటౌన్, గవర్నర్‌పేట బోసిపోయాయి. తుఫాన్ ప్రభావంతో బలమైన గాలులతో కూడిన వర్షం పడే అవకాశముందని, ప్రజలెవరూ ఇళ్లనుంచి బయటకు రావద్దని అధికారులు ప్రకటించడంతో రోడ్లు ఖాళీగా దర్శనమిచ్చాయి. బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు షాపులు తెరవకపోవడంతో అక్కడక్కడ మినహా వ్యాపార సముదాయాలున్న ప్రాంతాలు జనసంచారం లేకపోవడంతో బోసిపోయాయి. రవాణా సేవలు కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయి. బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలు పరిమిత స్థాయిలో మాత్రమే నడుస్తుండడంతో నగరంలోని రహదారుల్లో రద్దీ కనిపించలేదు. బుధవారం సాయంత్రం వరకు ఇదే పరిస్థితి నెలకొంది.

ప్రమాదం లేదు.. రండి!

● నీట మునిగిన ప్రాంతాల్లో కాప్ ప్రణాళిక ● మైకుల్లో ప్రకటన

ఆంధ్రజ్యోతి - విజయవాడ: సాధారణ రోజుల్లో ట్రాఫిక్ పరిస్థితికి, వర్షాలు కురిసినప్పటి పరిస్థితికి వ్యత్యాసం ఉంటుంది. సాధారణ రోజుల్లో ప్రయాణించిన వేగంగా వాహనాలు వర్షాలు కురిసినప్పుడు ముందుకు కదలవు. రహదారులు ఎత్తుపల్లంగా ఉన్న చోట్ల వర్షపు నీరు నిలిచిపోతుంది. ఇదో కారణమైతే ఆ నీళ్లకు అడుగు భాగాన రోడ్లపై ఏమైనా గుంతలున్నాయా అన్న అనుమానం ప్రధాన కారణం. దీంతో భారీ వాహనాల నుంచి ద్విచక్ర వాహనాల వరకు నత్తతో సమానంగా నడుస్తాయి. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఇలాంటి పరిస్థితి ఉత్పన్నం కాకుండా విజయవాడ పోలీసులు ఒక ప్రణాళికను అమలు చేశారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో మైక్ ప్రచారం మొదలుపెట్టారు. నగరంలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు కురిసిన వర్షానికి పలు రహదారులపై నీరు నిలిచింది. ఇలా నీరు నిలిచిపోయిన ప్రదేశాల్లో గుంతలుంటే ప్రమాదాలు జరుగుతున్నాయన్న భయంతో వాహనదారులంతా నీరు లేని ప్రదేశం నుంచి నెమ్మదిగా ప్రయాణిస్తున్నాయి. ఆ నీరు ఉన్న ప్రాంతంలో ఎలాంటి గుంతలు లేవని, వేగంగా వెళ్లడం వల్ల ప్రమాదం లేదని తెలియజేస్తూ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది మైకుల్లో ప్రచారం చేశారు. అలాగే ట్రాఫిక్‌లో ఉన్న వార్డెన్లతో ప్లకార్డులను ప్రదర్శించారు. దీంతో ట్రాఫిక్ ఆ రహదారులపై స్తంభించకుండా చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు.



గుంతలు లేవంటూ మైక్ ప్రచారం చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు





కూలిన ధ్వజస్థంభం

మొంథా తుఫాను ధాటికి మంగళవారం అర్ధరాత్రి పామర్రు మండలం, పసుమర్రు గ్రామంలోని శివాలయ ధ్వజస్థంభం కూలిపోయినట్టు ఆలయ పూజారి హరిబాబు, ఈవో ప్రసాదరావు తెలిపారు.

విజయవాడ రైల్వే డివిజన్ అప్రమత్తం

రైల్వేస్టేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావం సమయంలో విజయవాడ రైల్వే డివిజన్ పూర్తి అప్రమత్తతతో పనిచేస్తోంది. ఖచ్చితమైన ప్రణాళిక సమన్వయ ప్రయత్నాలతో, కార్యకలాపాలపై తుపాను ప్రభావం కారణంగా తలెత్తే ఏదైనా అత్యవసర పరిస్థితిని ఎదుర్కోవడానికి డివిజన్ 24 గంటలూ సిబ్బందిని, యంత్రాలను సమీకరించింది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా 20806 ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌ప్రెస్ (న్యూఢిల్లీ - విశాఖపట్నం)ను విజయవాడ స్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్ నంబర్ 6 వద్ద సురక్షితంగా నిలిపివేశారు. వాణిజ్య, ఆర్‌పీఎఫ్ అధికారులు, సిబ్బంది మొత్తం 329 మంది ప్రయాణికులను దింపి, జాగ్రత్తగా ప్లాట్‌ఫామ్ నంబర్-1లోని వెయిటింగ్ హాళ్లకు తరలించారు, అక్కడ సీటింగ్ రిఫ్రెష్‌మెంట్ సహా అన్ని అవసరమైన ఏర్పాట్లు అందుబాటులో ఉంచారు. హౌరాకు వెళ్లే రైళ్లలో ప్రయాణికులకు ఒకే టికెట్లపై వసతి కల్పించారు, అదనపు చార్జీలు లేదా అసౌకర్యం లేకుండా వారి తదుపరి ప్రయాణానికి అవకాశం కల్పించారు. స్టేషన్‌లోని అన్ని క్యాటరింగ్ స్టాళ్లు రాత్రంతా తెరిచి ఉన్నాయి, ప్రయాణికులకు నిరంతర సేవ సహాయం అందిస్తున్నాయి. 2800 క్యూబిక్ మీటర్ల ఇసుక, 2500 క్యూబిక్ మీటర్ల బండరాళ్లు, 12స్టీల్ ఎమర్జెన్సీ గిడ్డర్లు, 150 హ్యూమ్ పైపులు వంటి అత్యవసర సామగ్రిని కీలకమైన ప్రదేశాల్లో పేర్చబడి సిద్ధంగా ఉంచారు. పగలు, రాత్రి ఆపరేటర్లతో కూడిన 72 ట్రాక్ యంత్రాలు అవసరమైన మానవశక్తి, సాధనాలతో పాటు ఏదైనా ప్రభావిత ప్రదేశానికి త్వరగా తరలించడానికి సిద్ధంగా ఉంచారు. భారత్ స్కౌట్స్, గైడ్స్ వలంటీర్లు ప్రశంసనీయమైన సమాజ స్ఫూర్తిని ప్రదర్శిస్తూ తుపాను అనంతర పునరుద్ధరణ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్నారు. రైల్వేస్టేషన్ పరిసరాలు, కాలనీలు, కార్యాలయాలు పరిసర ప్రాంతాల నుంచి పడిపోయిన చెట్లు, శిథిలాలను తొలగించడంలో సహాయపడి సాధారణ స్థితిని పునరుద్ధరించారు. డివిజన్ సంసిద్ధత గురించి విజయవాడ డీఆర్‌ఎం మోహిత్ సోనాకియా మాట్లాడుతూ మొంథా తుపాను సమయంలో తమ బృందాలు అద్భుతమైన నిబద్ధతను ప్రదర్శించాయన్నారు. ప్రయాణికుల భద్రత, పారిశుధ్యం సజావుగా కార్యకలాపాలను నిర్వహించడానికి 24 గంటలూ పనిచేస్తున్నాయని, వాణిజ్య, ఆపరేటింగ్, ఇంజనీరింగ్ నుంచి వైద్య, భద్రత వరకు ప్రతి విభాగం ప్రయాణికులను, రైల్వే ఆస్తులను రక్షించడానికి నిస్వార్థంగా పని చేసిందన్నారు. ప్రజా సంబంధాల అధికారి సకాలంలో సమాచారాన్ని వ్యాప్తి చేశారన్నారు.



టార్పాలిన్, దుప్పట్లను పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

రెడ్‌క్రాస్ సేవలు

● పలు ప్రాంతాల్లో టార్పాలిన్, దుప్పట్లు పంపిణీ

విజయవాడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా కమిటీ నగరంలోని నీటముంపునకు గురైన కుటుంబాలకు బుధవారం ఉదయం పూరిగుడెసెలు, రేకుల షెడ్డులో ఉంటున్న నిరుపేదలకు దుప్పట్లు, టవల్స్, టార్పాలిన్స్ అందించారు. సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ జీ సమరం, వైస్ చైర్మన్ డాక్టర్ వెలగా జోషి, సెక్రటరీ చిట్టిబాబు, సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ జీ సమరం మాట్లాడుతూ, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు దేశవ్యాప్తంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ విస్తృతమైన సేవలందిస్తుందన్నారు. వైస్ చైర్మన్ వెలగా జోషి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ ముంపు ప్రాంతాల్లోని నిరుపేదలకు అవసరమైన కనీస సదుపాయాలు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో కేబీఎన్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లపై అసత్యప్రచారం

● అమరావతి రైతులకు రిటర్నబుల్ ప్లాట్‌ల కేటాయింపు ● దాదాపు తుది దశకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

● ఇంకా 2501 మందికి 8441 ప్లాట్‌లు రిజిస్ట్రేషన్ చేయాలి ● ప్రతి రోజు 60 నుంచి 90 ప్లాట్‌లు రిజిస్ట్రేషన్

● రానున్న 4 నెలల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తాం ● మున్సిపల్ మంత్రి నారాయణ

అమరావతి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని రైతులకు ప్లాట్‌ల కేటాయింపు, రిజిస్ట్రేషన్లపై కొంతమంది సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని మంత్రి నారాయణ అన్నారు. రైతులను, ప్రజలను తప్పుదోవ పటిస్తూ గందరగోళానికి గురిచేస్తున్నారన్నారు. రాబోయే 4 నెలల్లో రైతులకు కేటాయించాల్సిన ప్లాట్‌లతో పాటు రిజిస్ట్రేషన్లను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. బుధవారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అమరావతిలో ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ, 2014-19 మధ్య కాలంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్లాట్‌ల కేటాయింపు, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ గురించి లెక్కలతో సహా మంత్రి నారాయణ వివరించారు. భూసమీకరణ కింద ఇప్పటి వరకూ 29644 మంది రైతులకు 34192.19 ఎకరాల్లో ప్లాట్ల కేటాయింపు పూర్తయిందన్నారు. ఇంకా 991 మంది రైతులకు 719.04 ఎకరాలకు ప్లాట్ల కేటాయింపు చేయాల్సి ఉందన్నారు. వీటిలో ఉండవల్లిలో లేఅవుట్ ఫైనల్ కాకపోవడం, లంక భూములు, కోర్టు కేసులు, పీవోటీ కేసులు, 12 సెంట్లలోపు ఉన్నభూములు ఉన్నాయన్నారు.

ఇక రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ కూడా వేగవంతంగా జరుగుతుందని మంత్రి తెలిపారు. ఇప్పటి వరకూ 26732 మంది రైతులకు 60980 ప్లాట్లను రిజిస్ట్రేషన్ పూర్తయిందన్నారు. ఇంకా 2501 మంది రైతులకు 8441 ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. వీటిలో కోర్టు కేసులన్నవి 70 మంది రైతులకు చెందిన 312 ప్లాట్లు, ల్యాండ్ ఎక్విజిషన్ పెండింగ్ ప్రాంతంలో 254 మంది రైతులకు చెందిన 1170 ప్లాట్లు, వివాదాల్లో 450 మందికి చెందిన 1889 ప్లాట్లు, పీవోటీ కేసుల్లో 78 మంది రైతులకు చెందిన 208 మంది ప్లాట్లు, దేవదాయశాఖ వివాదంలో 32 మంది రైతులకు చెందిన 69 ప్లాట్లు, లంక అసైన్డ్ భూములు 170 మంది రైతులకు చెందిన 337 ప్లాట్లు, ఎన్ఆర్ఐలు 210 మందికిచెందిన 444 ప్లాట్లు ఉన్నాయన్నారు. పెండింగ్ ప్లాట్లకు రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం రోజుకు 60 నుంచి 90 ప్లాట్ల వరకూ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయన్నారు., ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 231.03 కోట్ల నగదు చెల్లించగా మరో 484 మంది రైతులకు 3.15 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గత రెండు ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి 319 మంది రైతులకు 1.03 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు.



పీ నైనవరంలో చెరువుకు గండి

● పరిశీలించిన అధికారులు

విజయవాడ రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం పీ నైనవరం గ్రామంలోని కుక్కలవాని కుంట చెరువుకు బుధవారం ఉదయం గండి పడింది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెరువు నిండి ఆరడుగుల మేర గండి పడింది. దీంతో నీరు పంట పొలాల్లోకి వెళ్లడంతో పంట పొలాలు నీటమునిగాయి. ఆర్డీవో కావూరి చైతన్య, ఎండీవో విగ్గిన్స్, తహసీల్దార్ సుగుణ చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. గండి కారణంగా ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. నీటి ప్రవాహం తగ్గిన వెంటనే పూడుస్తామని పంచాయతీ కార్యదర్శి అజేంద్ర తెలిపారు.

ప్రమాదకరంగా బూరుగుల చెరువు

నున్న గ్రామంలోని బూరుగుల చెరువు ప్రమాదకరంగా ఉంది. 3 రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా చెరువు పూర్తిగా నిండిపోయి నీరు పైకి ఎగదన్ని కనిపిస్తుంది. గండి పడే అవకాశాలుండటంతో అప్రమత్తమైన అధికారులు నీటిని మళ్లిస్తున్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉంది. బుధవారం తహసీల్దార్ సుగుణ, ఇరిగేషన్ డీఈ సత్యనారాయణ, ఏఈ రాజశేఖర్, పంచాయితీ కార్యదర్శి సురేష్‌బాబులు చెరువును పరిశీలించారు.

గర్భిణులకు ఫిజియోథెరపీ?

కౌన్సెలింగ్

డాక్టర్! ఫిజియోథెరపీ సుఖ ప్రసవానికి తోడ్పడుతుందనీ, ప్రసవం తదనంతర ఆరోగ్యానికి కూడా సహాయపడుతుందనీ వైద్యులు అంటున్నారు. ఇదెంతవరకూ నిజం? గర్భిణులు ఫిజియోథెరపీ చేయవచ్చా?

- ఓ సోదరి, హైదరాబాద్.

గర్భిణిగా ఉన్న సమయంలో, ప్రసవానికి ముందు, ప్రసవ సమయంలో, ప్రసవం తర్వాత కలిగే శారీరక ఇబ్బందు



లను ఎదుర్కోవటానికి, వాటిని అదుపులోకి తెచ్చుకోవటానికి ఫిజియోథెరపీ ఎంతో ఉపయోగపడుతుంది.

- గర్భం దాల్చినప్పుడు శరీరంలో ఎన్నో మార్పులొస్తాయి. వెన్ను, నడుము నొప్పి, కాళ్ల వాపులు లాంటి ఇబ్బందులు ప్రారంభంలో ఉంటాయి. మూత్రాశయం మీద ఒత్తిడి పెరిగి మూత్రం ఆపుకోలేకపోవటం (యూరినరీ ఇన్‌కాంటినెన్స్) లాంటి సమస్య మొదలవుతుంది. ఇలాంటి వాటికి వేడి, చల్లని కాపడం పెట్టడం, స్ట్రెచెస్ చేయించటం లాంటి వ్యాయామాలు ఉపయోగపడతాయి
- మూత్రాన్ని అదుపు చేయగలిగే కటి కండరాలను బలపరిచే వ్యాయామాలు చేయాల్సి ఉంటుంది
- కొందరికి ఆరో నెలలోనే ఎనిమిది నెలల గర్భంలా పొట్ట ఎత్తుగా తయారవుతుంది. ఇందుకు కారణం వాళ్ల శరీరాకృతిని సరిగా అనుసరించకపోవటమే! ఇలాంటి శరీరాకృతి సమస్యల వల్ల కండరాల మీద ఒత్తిడి పెరిగి నొప్పులు మొదలవుతాయి. ఈ నొప్పులు రాకుండా ఉండాలంటే ఫిజియోథెరపిస్టులను సంప్రదించి శరీర భంగిమలను సరిదిద్దుకోవాలి
- సుఖ ప్రసవం జరగాలంటే నడుములోని కండరాలు బలంగా కలిగి ఉండాలి. ఇందుకోసం క్రమం తప్పకుండా కొన్ని వ్యాయామాలను చేయాల్సి ఉంటుంది. అలాగే ప్రసవ సమయంలో ఎంతో ఆందోళనకు, ఒత్తిడికి లోనవుతూ ఉంటారు. ఇలాంటప్పుడు ఊపిరి ఎలా తీసుకోవాలి? ఎప్పుడు రిలాక్స్ అవ్వాలి? ఎప్పుడు గాలి లోపలికి తీసుకుని ప్రసవం జరిగేలా పుషింగ్ బ్రీతింగ్ చేయాలి? అన్నది ఫిజియోథెరపిస్టులు సూచిస్తారు
- ప్రసవం తర్వాత వదులైన కండరాలను తిరిగి బిగుతుగా చేసుకోగలిగే వ్యాయామాల విషయంలో కూడా ఫిజియోథెరపిస్టుల సహాయంతో చేయాలి.
- ప్రసవం జరిగిన తీరును బట్టి త్వరగా కోలుకోవటానికి అనుసరించవలసిన పద్ధతులు, పాలిచ్చే విధానం, నొప్పిని అదుపులోకి తెచ్చుకోగలిగే పద్ధతులను కూడా ఫిజియోథెరపీలో తెలుసుకోవచ్చు.

- డాక్టర్ మానస,
సీనియర్ ఫిజియోథెరపిస్ట్, హైదరాబాద్.

హాయిగా నిద్ర పట్టాలంటే...

ఎలాంటి ఆలోచనలు, ఒత్తిడి, ఆందోళన లేకుండా ప్రశాంతంగా నిద్రపోవడం వల్ల ఆరోగ్య సమస్యలు దరిచేరవని నిపుణులు సూచిస్తున్నారు. అలా హాయిగా నిద్ర రావాలంటే పడుకునేముందు ఏ జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం...



- చాలామంది పడుకునేముందు కుటుంబ సమస్యలు, ఆర్థిక వ్యవహారాలు, ఆఫీసు పని తదితరాల గురించి ఆలోచిస్తుంటారు. ఇలాచేయడం వల్ల మనసంతా ఆందోళనలతో నిండి నిద్ర కరవవుతుంది. అలాకాకుండా పడుకునే ముందు ఆ రోజు జరిగిన సంతోషకరమైన సంఘటనలను లేదా జీవితంలో సాధించిన విజయాలను ఒకసారి గుర్తు చేసుకుంటే మన సంతా సంతోషంతో నిండుతుంది. వెంటనే నిద్ర వచ్చేస్తుంది కూడా.
- పడుకునేముందు సామాజిక మాధ్యమాల్లో గడపడం వల్ల తెలియకుండానే సమయం మించిపోతుంటుంది. దీనివల్ల నిద్ర సరిపోక కళ్లు మండడం, తలనొప్పి, అలసట తీరకపోవడం లాంటి సమస్యలు వస్తుంటాయి. రాత్రి పడుకోవడానికి గంట ముందు నుంచే ఫోన్, టీవీలను చూడడం మానేయాలి. సాధ్యమైనంత వరకూ స్క్రీన్ సమయాన్ని తగ్గించుకునే ప్రయత్నం చేయడం మంచిది.
- రాత్రి భోజనాన్ని త్వరగా ముగించాలి. నూనె పదార్థాలు, మసాలాలతో నిండిన ఆహారం కాకుండా తేలికగా జీర్ణమయ్యే వాటిని మాత్రమే మితంగా తినాలి. కడుపులో తేలికగా ఉంటే హాయిగా నిద్ర పడుతుంది. పడుకోవడానికి అరగంట ముందు గోరువెచ్చని పాలు తాగితే వెంటనే నిద్ర ముంచుకొస్తుంది.
- పడక గది ప్రశాంతంగా ఆహ్లాదకరంగా ఉండేలా చూసుకోవాలి. సాధ్యమైనంతవరకూ ఎక్కువ వెలుతురు లేకుండా గదిని చీకటిగా ఉంచుకుంటే చక్కగా నిద్ర పడుతుంది. పడకగదిలో ఫోన్‌కు బదులు గడియారంలో అలారం సెట్‌చేసుకోవడం మంచిది.
- రోజూ ఒకే సమయానికి పడుకోవడం, లేవడం అలవాటు చేసుకుంటే రోజంతా ఉల్లాసంగా ఉంటుంది.

సంకల్పం



దశాబ్దాలుగా జీవన స్రవంతిలో మిళితమై... ఒక వెలుగు వెలిగిన 'ముగ, ఎరి' పట్టు... తెరమరుగైపోవడం ఆమెను కలవర పెట్టింది. ఈ వారసత్వ కళకు పూర్వ వైభవం తెచ్చి... భావి తరాలకు అందించాలన్న సంకల్పం ఆమెను మరో అడుగు ముందుకు వేయించింది. అదే... గృహహింస బాధితులైన గ్రామీణ మహిళలకు ఉపాధి మార్గమైంది. వారిని సాధికారత వైపు నడిపించి... గౌరవప్రదమైన జీవితాన్ని అందించి... సంప్రదాయ పట్టుకు ఎనలేని ఆదరణ కల్పిస్తున్నారు **జాగృతి**. ఆమె అంతరంగం ఇది.

సంప్రదాయ పట్టుకు పునరుజ్జీవం

"అసోం రాష్ట్రం... బ్రహ్మపుత్ర నదీ తీరం... ధెమాజి పట్టణం... సూర్యోదయం వేళ ఆ ప్రాంతంలో అడుగుపెడితే... మగ్గం శబ్దాలు లయబద్ధంగా వినిపిస్తుంటాయి. ఆ మగ్గాలపై ముగా పట్టు బంగారు దారాలు చక్కని ఆకారంలో ఒదిగిపోతుంటాయి. అక్కడే పుట్టి పెరిగిన నాకు అదంతా ఒక సుమధుర గీతంలా అనిపించేది. మనసుకు ఎంతో ఆహ్లాదంగా ఉండేది. పండుగలు, పెళ్లిళ్లప్పుడు ఆ వస్త్రాలు ధరించి... హొయలు పోయిన జ్ఞాపకాలు ఎన్నో. కానీ నేను పెరిగే క్రమంలో ఆ పట్టు వస్త్రాలు కనుమరుగవుతూ వచ్చాయి.

నా గుండె చప్పుడు...

మాది కూడా నేత కుటుంబమే. నిద్రలేచి, కళ్లు తెరిచే సరికి అమ్మ మగ్గం మీద చీరలు నేస్తూ కనిపించేది. వెంటనే వెళ్లి అమ్మ పక్కన కూర్చొని... ఆ కళాత్మకమైన పనితనాన్ని ఆస్వాదించేదాన్ని. ఎంతలా అంటే... ఆ మగ్గాల కదలికలు నా గుండె చప్పుడులా మారాయి. అయితే యంత్రాల రాకతో... కుప్పలు తెప్పలుగా వచ్చిపడుతున్న ఆధునిక దుస్తులతో మా ప్రాంత నేతన్నలకు పని తగ్గుతూ వచ్చింది. కొన్నేళ్లకు దాన్ని నమ్ముకున్న వారికి ఉపాధి కూడా కష్టమైంది. ఇది నన్ను కలవరపెట్టింది.

అందరిలా నేనూ...

'నిఫ్ట్'లో ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు చేసి, తిరిగి మా ఊరు వెళ్లి, సొంతంగా ఒక డిజైనింగ్ స్టూడియో పెట్టాలనేది నా కల. అనుకున్నట్టే ఢిల్లీ వెళ్లి 'నిఫ్ట్'లో కోర్సు పూర్తి చేశాను. మా ఊరు వచ్చాను. అందరు డిజైనింగ్ గ్రాడ్యుయేట్స్‌లా నేను కూడా సృజనకు రెక్కలు తొడిగి, ఫ్యాషన్ పరిశ్రమలో వినూత్న వస్త్ర శ్రేణులను ఆవిష్కరించాలని ఆరాటపడ్డాను. కానీ అందులో దిగాక తెలిసింది... సృజనాత్మక స్వేచ్ఛ పేరుతో ఎంతటి విధ్వంసానికి పాల్పడుతున్నామో! అవసరానికి మించి ఉత్పత్తి, విచ్చలవిడిగా రసాయనాల వినియోగం, తద్వారా విడుదలయ్యే కాలుష్యం, దాని వల్ల పర్యావరణానికి కలిగే హాని... ఇవన్నీ అనుభవంలోకి వచ్చాయి. అన్నిటికీ మించి 'ముగ, ఎరి' పట్టు వస్త్రాలు రూపొందిస్తూ, వారసత్వ కళను నమ్ముకొని జీవిస్తున్న కళాకారులకు జీవనోపాధిని దూరం చేస్తున్నామని తెలిసినప్పుడు ఎంతో బాధ కలిగింది. ఇది కాదు నేను కోరుకున్నది.

'వే ఆఫ్ లివింగ్'...

ఒకప్పుడు మా ప్రాంతంలో ఇళ్లన్నీ మగ్గాల చప్పుళ్లతో... వెలిగిపోతున్న నేతన్నల మోములతో కళకళలాడేవి. కానీ నేను తిరిగి వచ్చేనాటికి ఊళ్లో మగ్గాలు మోగబోయాయి. తరతరాలుగా వస్తున్న వారసత్వ కళ అవసాన దశలో ఉంది. అద్భుతమైన 'ముగ, ఎరి' పట్టుకు పూర్వ వైభవం తేవాలని ఆ క్షణమే సంకల్పించాను. దాని కోసం నాలుగేళ్ల కిందట మా ధెమాజి పట్టణంలో 'వే ఆఫ్



లివింగ్ స్టూడియో' నెలకొల్పాను. దాని ద్వారా కనుమరుగు అవుతున్న కళను బతికించే ప్రయత్నం ప్రారంభించాను.

స్టూడియో మాత్రమే కాదు..

కళకు పునరుజ్జీవం కోసమే కాకుండా... మా స్టూడియోను అటు నేతన్నకు, ఇటు గ్రామీణ మహిళలకు ఒక చక్కని వేదికగా మార్చాలని అనుకున్నాను. అందులో భాగంగా తొలుత కళాకారులను కలిసి చర్చించాను. వారి అనుభవాలు, సూచనల నుంచి, మా ప్రాంత రమణీయత నుంచి స్ఫూర్తి పొంది... సంప్రదాయ 'ముగ, ఎరి' పట్టుకు ఆధునికత జోడించి, విభిన్న వస్త్ర శ్రేణులను తీసుకువచ్చాను. అదే సమయంలో పర్యావరణానికి ఎలాంటి హాని కలిగించకుండా, నాణ్యతలో రాజీ పడకుండా, నేటి తరానికి నచ్చేలా చీరలు, స్కార్ఫ్‌లతో పాటు ట్రెండీ దుస్తులను రూపొందిస్తున్నాం.

వందమందికి పైనే...

ప్రస్తుతం మా 'వే ఆఫ్ లివింగ్ స్టూడియో' రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కేంద్రంలో పద్నాలుగు మగ్గాలు ఉన్నాయి. ఒక్కో మగ్గంపై ఎనిమిది మంది కళాకారులు పని చేస్తారు. ప్రత్యక్షంగా దాదాపు వందమందికి పైగానే రైతులు, కళాకారులు ఉపాధి పొందుతున్నారు. మార్కెటింగ్, ఇంటింటికీ వెళ్లి పట్టు దారాలు సేకరించేవారు... ఇలా దాదాపు మరో యాభై మంది సంస్థపై ఆధారపడి జీవిస్తున్నారు. వీరిలో తొంభై శాతంమంది మహిళలే. వీరందరి కృషితో మా స్టూడియోకు మంచి ఆదరణ లభించింది. స్మిత గోద్రెజ్, జాన్వి నిలేకని, రోషినీ నాడార్ లాంటి ప్రముఖుల చొరవతో ప్రపంచ వ్యాప్త గుర్తింపు దక్కింది. ఒక అంతర్జాతీయ సంస్థ మాతో కలిసి పని చేసేందుకు ముందుకు వచ్చింది. అంతిమంగా నా కృషికి తగిన ఫలితం కనిపిస్తోంది. అంతరించిపోతున్న పట్టుకు పూర్వ వైభవం లభిస్తున్నందుకు ఎంతో సంతోషంగా, సంతృప్తిగా ఉంది.

అంత కంటే ఎక్కువ...

ముఖ్యంగా ముగ పట్టు పురుగులు చాలా అరుదు. ఏమాత్రం కాలుష్యం లేని ప్రాంతాల్లో మాత్రమే జీవించగలుగుతాయి. అవి ఆవాసం ఏర్పరచుకున్నాయంటే అర్థం... అక్కడ పర్యావరణ సమతుల్యత ఉందని. నేలకు, చెట్లకు, మనుషులకు మధ్య సామరస్యం కుదిరిందని. అందుకే ముగ... మా అసోం ప్రజలకు ఒక పట్టు వస్త్రమే కాదు... అది మా గుర్తింపు. రాష్ట్రంలో అతి పెద్ద పండుగైన బిహూకు ముగ పట్టు ధరించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. దాని మెరిసే దారాలు మా వారసత్వ సంపదకు సజీవ చిహ్నం. అలాగే ఎరి పట్టు కూడా అస్సామీల జీవన గమనంలో ఒక భాగం. ఈ నేపథ్యంలోనే అంతరించిపోతున్న ఈ పట్టును భావి తరాలకు అందించాలని అనుకున్నాను.

మహిళలకు సాధికారత...

మా సంస్థ ఆధ్వర్యంలో 'ముగ, ఎరి' పట్టు పురుగుల పెంపకం చేపట్టాం. దాని కోసం గ్రామీణ మహిళలకు శిక్షణ ఇచ్చాను. మగ్గం పని కూడా నేర్పించాను. ముఖ్యంగా గృహహింసకు బాధితులైన ఒంటరి మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాను. ఇప్పుడు ఎంతోమంది మహిళలు ఒకరిపై ఆధారపడకుండా గౌరవప్రదంగా జీవించగలుగుతున్నారు. కొందరు ఇంటి వద్ద నుంచే పని చేస్తూ, తమ పిల్లలను పోషించుకోగలుగుతున్నారు. సాధికారత వైపు అడుగులు వేస్తున్నారు. రైతులు, నేతన్నలు, వారిని నమ్ముకున్నవారు... ఇక్కడ మా అందరిదీ ఒకే కుటుంబం. అందుకే నాకు లాభాలు, వ్యాపార దృక్పథం కంటే మానవ సంబంధాలు, విలువలే ప్రధానం."

అదానీ పంప్డ్ స్టోరేజీ ప్లాంటుకు రోజుకు 100 కిలోలీటర్ల జలాలు

» గండికోట రిజర్వాయరు నుంచి 36 నెలలు తీసుకునేందుకు అనుమతి

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా గండికోట రిజర్వాయరు వద్ద అదానీ గ్రీన్ ఎనర్జీ నిర్మిస్తున్న 1,000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్ పథకానికి నీటి కేటాయింపులు చేస్తూ రాష్ట్ర జల వనరుల శాఖ, పరిశ్రమల శాఖ బుధవారం విడివిడిగా ఉత్తర్వులు జారీ చేశాయి. ప్రాజెక్టు నిర్మాణ పనుల కోసం రోజుకు 100 కిలోలీటర్ల చొప్పున 36 నెలలపాటు నీరు తీసుకునేందుకు అనుమతిచ్చాయి. రిజర్వాయరు నుంచి ప్లాంటు దాకా కృష్ణా జలాలను తరలించేందుకయ్యే వ్యయమంతా అదానీ సంస్థ భరించాల్సి ఉంటుందని జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి యువరాజ్ తమ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. 2015లో ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వు ప్రకారం ప్రతి 1,000 గ్యాలన్లకు రూ.5.50 చొప్పున రాయల్టీగా వసూలు చేస్తామని స్పష్టం చేశారు. పైపులైన్లు వేసుకునేందుకు కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) నుంచి సానుకూల ధ్రువీకరణ తెచ్చుకునే బాధ్యత అదానీదేనని పేర్కొన్నారు.

జీవోలు 'కాన్ఫిడెన్షియల్'గా ఉండొద్దు

» హైకోర్టులో పిల్.. ప్రతివాదులకు నోటీసులు

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే జీవోలను జీవోఐఆర్ పోర్టల్‌లో కాన్ఫిడెన్షియల్ అని పేర్కొనడాన్ని చట్టవిరుద్ధమని ప్రకటించాలని కోరుతూ దాఖలైన పిల్‌పై బుధవారం హైకోర్టు విచారణ జరిపింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సాధారణ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. విచారణను వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ గవర్నమెంట్ ఆర్డర్స్ ఇష్యూ రిజిస్టర్ (జీవోఐఆర్) పోర్టల్‌లో జీవోలను బహిర్గతం చేయకుండా కాన్ఫిడెన్షియల్‌గా పేర్కొనడాన్ని సవాల్ చేస్తూ సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ ప్రాపర్టీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ రైట్స్(ఎస్‌పీసీపీఈఆర్) అధ్యక్షుడు, విజయవాడకు చెందిన పరసా సురేశ్‌కుమార్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ప్రభుత్వ జీవోలను వర్గీకరించి కాన్ఫిడెన్షియల్‌గా పేర్కొనడం సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 41(బీ), 8, భారతీయ సాక్ష్య అధినియంలోని సెక్షన్ 74, 75కి విరుద్ధమని పేర్కొన్నారు. సహేతుక సమయంలో జీవోలను పోర్టల్‌లో ఉంచేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పిటిషనర్ తరఫున న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపించారు.

నేడు ఆస్పత్రులతో 'ట్రస్ట్' చర్చలు

» 'ఆశా' ప్రతినిధులను మరోసారి ఆహ్వానించిన సీఈవో

అమరావతి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రయివేటు ఆస్పత్రుల ఆందోళనలు కొనసాగింపు నేపథ్యంలో ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ మరోసారి ఆశా(ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ ఆస్పత్రుల అసోసియేషన్) ప్రతినిధులతో చర్చించాలని నిర్ణయించింది. ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించే చర్చలకు రావాలని ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈవో కె.దినేష్‌కుమార్ గురువారం వారికి లేఖ పంపించారు. ఆస్పత్రుల ఆందోళనల తర్వాత ప్రభుత్వం రూ.250 కోట్లు ఆస్పత్రుల ఖాతాల్లో జమ చేసింది. మరో రూ.250 కోట్లు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉంది. కానీ ఆషా ప్రతినిధులు మాత్రం సీఎఫ్ఎంఎస్‌లో పెండింగ్‌లో ఉన్న రూ.680 కోట్ల వరకూ విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

చావు ఏదైనా.. చిచ్చు పెట్టేద్దాం

ఆత్మహత్య ఘటనలో వైసీపీ శవరాజకీయాలు

» గుంటూరు జిల్లా మహిళ మరణంపై రోతపత్రికలో విష ప్రచారం
» కందుకూరు మాదిరిగానే రెండు కులాల మధ్య చిచ్చుకు యత్నం
» బంధువులు వేధిస్తే ఓ కులానికి అంటగట్టిన వైనం
» వైసీపీ ప్రచారాన్ని తిప్పికొట్టిన కుటుంబ సభ్యులు
» కులాల ప్రమేయం లేదని స్పష్టీకరణ

గుంటూరు(తూర్పు), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శవం కోసం వెతకడం, దాని చుట్టూ రాజకీయాలు చేయడం వైసీపీకి పరిపాటైంది. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం వెంగళాయపాలెం గ్రామానికి చెందిన ఈపూరి శేషమ్మ(42) అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో వైసీపీ వెంటనే శవ రాజకీయాన్ని మొదలు పెట్టింది. 'నా చావుకు కారణం టీడీపీ నేతలు-కాల్ మనీ ఆగడాలకు బలైన కాపు మహిళ' అంటూ రోత పత్రిక బుధవారం అసత్య కథనాన్ని వండి వార్చింది. మృతురాలు కాపు కులానికి చెందడం, ఆత్మహత్యకు ముందు తీసుకున్న వీడియోలో పొరబాటున కమ్మ సామాజిక వర్గానికి చెందిన టీడీపీ నేత పేరు చెప్పడంతో రెండు కులాల మధ్య చిచ్చు పెట్టేలా విష ప్రచారం మొదలు పెట్టింది. కందుకూరు ఘటన మాదిరిగానే ఈ ఘటనను చిత్రీకరించే కుట్రకు తెరలేపారు. రోతపత్రిక కథనాన్ని శేషమ్మ కుటుంబ సభ్యులు ఖండించారు. ఆమె ఆత్మహత్య ఘటనలో టీడీపీ నాయకులకు ఎటువంటి సంబంధం లేదని వారు స్పష్టం చేశారు. కుటుంబ సభ్యుల మధ్య ఆర్థిక లావాదేవీల కారణంగానే ఆత్మహత్య చేసుకుందని, ఇందులో ఎటువంటి రాజకీయ ప్రమేయం లేదని తేల్చి చెప్పారు.

అసలేం జరిగిందంటే..

కొవిడ్‌కు ముందు శేషమ్మ సమీప బంధువుల వద్ద రూ. 5 లక్షలు అప్పు తీసుకోగా, వడ్డీతో రూ.10 లక్షలైంది. బాకీ చెల్లించాలనే ఒత్తిడిని భరించలేక ఆమె పది రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఈ క్రమంలో మంగళవారం ఆమె మృతి చెందింది. ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియో తీసుకుంది. తన చావుకు బంధులైన సీత, పద్మ, కుమారుడి వరుసైన ఈపూరి రమేశ్, మరోవ్యక్తి కర్లపూడి శ్రీను కారణమని ఆ వీడియోలో చెప్పింది. బాకీలో కొంత చెల్లించినా ఇంటిపైకి వచ్చి తిడుతున్నారని వాపోయింది. ఇవి తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నట్టు చెప్పింది. ఒక నిమిషం నిడివి ఉన్న ఆ వీడియోలో 22 సెకన్ల వద్ద కర్లపూడి శ్రీనుకు బదులు పొరపాటున కల్లూరి శ్రీను అని పలికింది. ఆ వెంటనే కర్లపూడి శ్రీను అని శేషమ్మ సరిచేసుకుంది. ఆ పొరపాటే ఆధారంగా వైసీపీ నాయకులు విష ప్రచారం మొదలు పెట్టారు. కల్లూరి శ్రీను లక్ష్యంగా వైసీపీ సోషల్ మీడియా, రోత పత్రికలో కులాల మధ్య కుంపట్లు రాజేయాలని ప్రయత్నించారు. అంతటితో ఆగక ఆయనపై కాల్‌మనీ తదితర ఆరోపణలు చేశారు.



Sakshi_AP_29-10-2025

నా చావుకు కారణం టీడీపీ నేతలే

కాల్‌మనీ ఆగడాలకు బలైన కాపు మహిళ

- టీడీపీ నేతల టార్చర్ తట్టుకోలేకపోతున్నా
- రూ.రెండు లక్షలు తీసుకుని రూ.1.30 లక్షలు తిరిగి చెల్లించేశా.. అయినా రోజూ ఇంటికొచ్చి గొడవ చేస్తున్నారు
- చెల్లిస్తానన్నా వినడం లేదు.. తీవ్రంగా వేధిస్తున్నారు
- సెల్ఫీ వీడియో తీసుకుంటూ కాపు మహిళ బలవన్మరణం
- ప్రధాన నిందితుడు టీడీపీ మండల కన్వీనర్
- గుంటూరు జిల్లా వెంగళాయపాలెంలో ఘటన

5లో

పురుగుమందు తాగుతున్న ఈపూరి శేషమ్మ

బుధవారం జగన్ పత్రికలో ప్రచురించిన కథనం

అవసరానికి డబ్బుతీసుకుంది



శేషమ్మ వరుసకి చిన్నమ్మ అవుతుంది. అవసరాల నిమిత్తం రూ.5 లక్షలు తీసుకుంది. 2020లోనే చెల్లిస్తానని చెప్పినా ఇప్పటివరకు ఇవ్వలేదు. మిగతా అప్పుల వాళ్లకు ఇచ్చి మాకు మాత్రం ఇవ్వకపోవడంతో పెద్ద మనుషుల వద్దకు వెళ్లాం. ఈనెల 16న మా బంధువుల పెళ్లి సమయానికి చెల్లిస్తానని పెద్ద మనుషుల వద్ద శేషమ్మ ఒప్పందం చేసుకుంది. మా అమ్మాయి వద్దకు వెళ్లి డబ్బులు తెచ్చి నీకు ఇస్తానని ఈ నెల 14న ఫోన్ చేసి చెప్పింది. ఆ తరువాత ఇటువంటి నిర్ణయం తీసుకుంది. మేము ఆమెపై ఒత్తిడి చేయలేదు. ఈ వివాదంలో రాజకీయ నాయకుల ప్రమేయం లేదు.

- ఈపూరి రమేశ్ (శేషమ్మకు వరుసకు కుమారుడు) (వీడియో ద్వారా)

శోకంలో ఉన్నాం.. రాజకీయం చేయకండి



ఈపూరి శేషమ్మ భర్త, కుమార్తె, అల్లుడు

పుట్టెడు శోకంలో ఉన్నాం. దయచేసి రాజకీయం చేయకండి. నా భార్య చావుకి సమీప బంధువుల ఒత్తిళ్లే కారణం. అంతే తప్ప కమ్మ సామాజిక వర్గం కాదు. టీడీపీ అసలు కాదు. కేసులు పెట్టి, ఇంటి పైకి వచ్చి మమ్మల్ని తిట్టడంతో మనస్తాపం చెంది ఆమె ఈ నిర్ణయం తీసుకుంది. పొలం అమ్మి ఇస్తామని చెప్పినా వారు వినలేదు. బూతులతో రమేశ్ తీవ్రంగా వేధించారు. కల్లూరు శ్రీనివాసరావు మా ఊరి వ్యక్తే. ఏదైనా చిన్నా పెద్దా పనులుంటే ఆయన వద్దకు వెళ్తాం. అందుకే నా భార్య పొరబాటున ఆ పేరు చెప్పి సరిచేసుకుని కర్లపూడి శీనుగా మార్చింది. ఇందులో రాజకీయ కుట్ర లేదు.

- శేషమ్మ భర్త, కుమార్తె, అల్లుడు మద్దిలేటి, శివమణి, నవీన్

సునీతారెడ్డి అడిగిన అంశాలపై..
తదుపరి దర్యాప్తునకు మేం సిద్ధం

» ప్రత్యేక కోర్టులో సీబీఐ మెమో దాఖలు
» నిందితుల కౌంటర్ల కోసం విచారణ నేటికి వాయిదా

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తదుపరి దర్యాప్తు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని సీబీఐ సమ్మతి తెలియజేసింది. ఈ మేరకు నాంపల్లి ప్రత్యేక కోర్టులో మెమో దాఖలుచేసింది. తన తండ్రి హత్య కేసులో ఇంకా అసలు వాస్తవాలు వెలుగు చూడలేదని.. గత ప్రభుత్వ హయాంలో తనను, తన భర్తను, సీబీఐ అధికారి రాంసింగ్‌ను నిందితులుగా పేర్కొంటూ కౌంటర్ కేసు అల్లడానికి జరిగిన కుట్ర తదితరాలపై తదుపరి దర్యాప్తు జరగాలని వివేకా కుమార్తె డాక్టర్ నర్రెడ్డి సునీతారెడ్డి సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్ బుధవారం మరోసారి విచారణకు వచ్చింది. ఆమె కోరిన విధంగా వివిధ కోణాల్లో తదుపరి దర్యాప్తు చేయడానికి సిద్ధంగా ఉన్నామంటూ సీబీఐ మెమో దాఖలు చేసింది. తొలుత గంగిరెడ్డి, సునీల్ యాదవ్, గజ్జల ఉమాశంకర్‌రెడ్డి, షేక్ దస్తగిరి (అప్రూవర్)లను నిందితులుగా పేర్కొంటూ చార్జిషీటు దాఖలు చేశామని సీబీఐ పేర్కొంది. ఆ తర్వాత సునీతారెడ్డి అభ్యర్థన మేరకు ఈ కేసును సుప్రీంకోర్టు కడప కోర్టు నుంచి హైదరాబాద్ సీబీఐ కోర్టుకు బదిలీ చేసిందని గుర్తుచేసింది. ఆ తర్వాత ఏ-5గా దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డిని.. ఏ-6గా గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డిని, ఏ-7గా వైఎస్ భాస్కర్‌రెడ్డిని, ఏ-8గా ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిని పేర్కొంటూ రెండు అనుబంధ చార్జిషీట్లు దాఖలు చేశామని పేర్కొంది. మరోవైపు.. తదుపరి దర్యాప్తు అవసరం లేదని ఏ-3 ఉమాశంకర్‌రెడ్డి తన కౌంటర్‌లో పేర్కొన్నారు. నిందితులు శివశంకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అవినాశ్ రెడ్డి కౌంటర్లు దాఖలు చేయాల్సి ఉన్నందున తదుపరి విచారణను కోర్టు గురువారానికి వాయిదావేసింది.

జగన్ కోర్టుకు రావలసిందే!

» నవంబరు 14లోపు వ్యక్తిగత హాజరుకు గతంలోనే ఆదేశించామన్న ప్రత్యేక కోర్టు
» తప్పుడు ఫోన్ నంబర్ వ్యవహారంలో సీబీఐ పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల వ్యవహారంలో ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి.. దాదాపు ఐదున్నరేళ్ల తర్వాత కోర్టుకు హాజరుకావలసిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల ఆయన లండన్ పర్యటనకు అనుమతి మంజూరు చేసినప్పుడు.. పర్యటన ముగిశాక నవంబరు 14వ తేదీలోపు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని నాంపల్లి సీబీఐ కోర్టు ఆదేశించింది. స్వదేశానికి ఎప్పుడు వచ్చారనే వివరాలతో మెమో సైతం దాఖలు చేయాలని స్పష్టంచేసింది. అయితే లండన్ పర్యటన సందర్భంగా జగన్ తన ఫోన్ నంబర్ కాకుండా వేరే వారి నంబర్ ఇచ్చారని.. ఈ నేపథ్యంలో పర్యటన రద్దు చేయాలంటూ సీబీఐ పిటిషన్ దాఖలు చేయడం తెలిసిందే. దీనిపై కోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. విదేశీ పర్యటనలో జగన్ అందుబాటులో ఉన్నారా లేరా అని మాత్రమే చూడాలని.. అయినా ఆయన ఇప్పటికే పర్యటన నుంచి తిరిగి వచ్చేసినందున సీబీఐ పిటిషన్‌కు కాలం చెల్లిపోయిందంటూ దానిని కొట్టివేసింది. అయితే జగన్ నవంబరు 14వ తేదీన.. లేదంటే ఆలోపు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని పెట్టిన షరతును న్యాయస్థానం తీర్పులో ప్రస్తావించింది. దీంతో దాదాపు ఐదున్నరేళ్ల తర్వాత జగన్ నాంపల్లి సీబీఐ కోర్టుకు రావడం తప్పనిసరైంది.

కాగ్నిజెంట్‌లో ఫ్రెషర్ల నియామకాలు

15,000-20,000

సెప్టెంబరు త్రైమాసిక ఆదాయం 540 కోట్ల డాలర్లు

న్యూఢిల్లీ: అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్నప్పటికీ, భారత కార్యాలయాల్లోనే అధిక శాతం ఉద్యోగులున్న ఐటీ కంపెనీ కాగ్నిజెంట్ ఆదాయం సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో 7.3 శాతం పెరిగి 541.5 కోట్ల డాలర్లకు చేరుకుంది. నికర ఆదాయం మాత్రం 53 శాతం తగ్గి 27.4 కోట్ల డాలర్లకు పరిమితమైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (జనవరి-డిసెంబరు) మొత్తానికి ఆదాయ అంచనాను 2,015-2,110 కోట్ల డాలర్లకు మెరుగుపరిచింది. గడిచిన మూడు నెలల్లో కంపెనీ ఉద్యోగుల సంఖ్య నికరంగా 6,000 పెరిగి 3,49,800కు చేరుకుంది. కొత్త నియామకాల్లో అధిక శాతం ఫ్రెషర్లేనని కంపెనీ స్పష్టం చేసింది. ఈ ఏడాదిలో మొత్తం 15,000-20,000 మందిని ఫ్రెషర్లను నియమించుకోనున్నట్లు సంస్థ తెలిపింది. అంతేకాదు, ఈ నవంబరు 1 నుంచి అమలులోకి వచ్చేలా 80 శాతం ఉద్యోగులకు వేతనాలు పెంచినట్లు కాగ్నిజెంట్ వెల్లడించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

30వ తేదీ			
హైదరాబాద్	570	విజయవాడ	575
వరంగల్	572	గోదావరి	580
చిత్తూరు	593	విశాఖపట్నం	570
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	117	విజయవాడ	123
వరంగల్	117	గుంటూరు	126
కరీంనగర్	117	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	117	చిత్తూరు	114
కర్నూలు	117	నెల్లూరు	119
విశాఖపట్నం	119	అనంతపురం	119
గోదావరి	123		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,21,580 ▼	1,11,450 ▼	1,66,000 ▲
విజయవాడ	1,25,500 ▲	1,19,000 ▲	1,51,000 ▲
విశాఖపట్నం	1,24,720 ▲	1,12,200 ▼	1,66,000 ▲
రాజమండ్రి	1,21,580 ▲	1,11,450 ▲	1,50,000 ▲
ప్రొద్దుటూరు	1,18,500 ▼	1,09,020 ▼	1,50,000 ▲
ముంబై	1,20,628 ▲	1,10,495 ▲	1,46,633 ▲

యూనియన్ బ్యాంక్‌తో బీఓఐ విలీనం!



- ఇండియన్ బ్యాంక్‌తో ఐఓబీ మెర్జర్
- బీఓఎం, పీ అండ్ ఎస్‌బీ ప్రైవేటీకరణ
- ప్రభుత్వ బ్యాంకింగ్ రంగంలో మరో విడత సంస్కరణలకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు

న్యూఢిల్లీ: ప్రభుత్వ బ్యాంకింగ్ రంగంలో మరో విడత విలీనాలకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ)తో బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ)ను విలీనం చేసే ఆలోచనలో ఉన్నట్లు ఈ విషయంతో సంబంధం ఉన్న అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ విలీనం జరిగితే, భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) తర్వాత దేశంలో రెండో అతిపెద్ద ప్రభుత్వ బ్యాంక్ (పీఎస్‌బీ)గా అవతరించనుంది. ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంక్‌ల న్నింటిలో నాలుగో అతిపెద్ద బ్యాంక్‌గా మారనుంది. ప్రస్తుతం పీఎస్‌బీల్లో రెండో స్థానంలో ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) మొత్తం ఆస్తుల విలువ ఈ జూన్ 30నాటికి రూ.18.62 లక్షల కోట్లుగా ఉంది. యూబీఐ-బీఓఐ విలీనం ద్వారా ఏర్పడే బ్యాంక్ మొత్తం ఆస్తుల విలువ రూ.25.67 లక్షల కోట్లకు చేరనుంది.

దేశీయ బ్యాంకింగ్ రంగంలో ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తర్వాత మూడో స్థానంలో ఉన్న ఐసీఐసీఐ బ్యాంక్ ప్రస్తుత ఆస్తులు రూ.26.42 లక్షల కోట్లకు విలీన బ్యాంక్ ఆస్తుల విలువ చేరువ కానుంది.

చెన్నై కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ), ఇండియన్ బ్యాంక్‌లను సైతం ఒక్కటి చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. అంతేకాదు, మిగతా పీఎస్‌బీలతో పోలిస్తే తక్కువ ఆస్తులు కలిగిన పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ (పీ అండ్ ఎస్‌బీ), బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం)ను భవిష్యత్‌లో ప్రైవేటీకరించే ఆలోచన కూడా ఉన్నట్లు తెలిసింది.

డజను పీఎస్‌బీలు

చివరిసారి 2020లో మోదీ ప్రభుత్వం పీఎస్‌బీల విలీనాలను చేపట్టింది. దీంతో పీఎస్‌బీల సంఖ్య 27 నుంచి 12కు తగ్గింది. ఈ మార్చి నాటికి ఈ డజను పీఎస్‌బీల ఆస్తుల మొత్తం విలువ దాదాపు 1.95 లక్షల కోట్ల డాలర్లు. అంటే, మన కరెన్సీలో సుమారు రూ.171 లక్షల కోట్లు. దేశీయ బ్యాంకింగ్ రంగ మొత్తం ఆస్తుల్లో 55 శాతానికి సమానమిది.

వికసిత్ భారత్ లక్ష్యాల్లో భాగంగానే..

ఆస్తుల విలువపరంగా ప్రస్తుతం ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మాత్రమే ప్రపంచంలోని 100 అతిపెద్ద బ్యాంకుల జాబితాలో ఉన్నాయి. వీటి తరహాలో మరో 3-4 మెగా పీఎస్‌బీలను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ఈసారి విలీనాలను చేపట్టనున్నట్లు సమాచారం. వికసిత్ భారత్ లక్ష్యాల సాధనకు దేశంలో మరిన్ని ప్రపంచ స్థాయి బ్యాంక్‌ల ఏర్పాటు అవసరమని మోదీ సర్కారు భావిస్తోంది. అంతేకాదు, మలి విడత సంస్కరణల్లో భాగంగా పీఎస్‌బీల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) పరిమితిని 49 శాతానికి పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. పీఎస్‌బీల్లో విదేశీ పెట్టుబడుల ప్రస్తుత పరిమితి 20 శాతంగా ఉంది. ప్రైవేట్ రంగ బ్యాంక్‌ల్లో 74 శాతం వరకు విదేశీ పెట్టుబడులకు అనుమతి ఉంది.

ఐదేళ్లలో మార్కెట్లోకి 8 కొత్త ఎస్‌యూవీలు



మారుతి సుజుకీ ప్రణాళిక

టోక్యో: రాబోయే ఐదేళ్ల కాలంలో ఎనిమిది కొత్త ఎస్‌యూవీలను మార్కెట్లోకి తీసుకురానున్నట్లు దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్‌ఐ) ప్రకటించింది. ఈ కొత్త ఎస్‌యూవీలతో కంపెనీకి చెందిన ఎస్‌యూవీల సంఖ్య 28కి చేరుతుంది. భారత మార్కెట్లో 50% మార్కెట్ వాటా తిరిగి సాధించాలన్నది తమ ధ్యేయమని, ఇందుకు అది సహాయకారి అవుతుందని సుజుకీ మోటార్ కార్పొరేషన్ రిప్రెజెంటేటివ్ డైరెక్టర్, ప్రెసిడెంట్ తొషిహిరో సుజుకీ అన్నారు. అయితే తీవ్రమైన పోటీ నెలకొన్న భారత మార్కెట్లో ఆ లక్ష్యాన్ని చేరడం అంత తేలికైన పని కాదని జపాన్ మొబిలిటీ షో సందర్శించిన భారతీయ విలేకరులతో మాట్లాడుతూ ఆయన వ్యాఖ్యానించారు. మారుతి సుజుకీలో సుజుకీ మోటార్ కార్పొరేషన్‌కు 58% వాటా ఉంది. సుమారు 43 లక్షల వాహనాల సామర్థ్యం గల భారత మార్కెట్లో ఏప్రిల్-సెప్టెంబరు మధ్య కాలంలో మారుతి సుజుకీ వాటా 39 శాతానికి తగ్గింది. రాబోయే కాలంలో 50% మార్కెట్ వాటా తిరిగి సాధించడంతో పాటు విద్యుత్ కార్ల ఉత్పత్తి, ఎగుమతుల్లో నంబర్ వన్ కావాలనుకుంటున్నట్లు సుజుకీ చెప్పారు. కాగా, 2030-31 నాటికి దేశంలో రూ.70 వేల కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్లు మారుతి సుజుకీ ఇప్పటికే ప్రకటించింది.

మరిన్ని ఎస్‌యూవీలు తెస్తాం: హోండా కార్స్

భారత మార్కెట్లోకి మరిన్ని ఎస్‌యూవీలు తీసుకురావాలని భావిస్తున్నట్లు హోండా కార్స్ ఇండియా తెలిపింది. కంపెనీ ప్రెసిడెంట్, సీఈఓ తకాషి నకజిమా మాట్లాడుతూ.. అమెరికా, జపాన్‌తో పాటు భవిష్యత్ వృద్ధికి తమకు భారత్ కీలక మార్కెట్ అని అన్నారు. భారత మార్కెట్లో ఎస్‌యూవీల అమ్మకాలు జోరుగా ఉన్నాయని, భవిష్యత్తులో కూడా ఇదే ధోరణి కొనసాగుతుందని ఆయన చెప్పారు. భారత్‌లో తమ టూవీలర్ విభాగం ఇప్పటికే అతిపెద్ద వ్యాపారమని, బ్రాండ్, అమ్మకాలు రెండూ పెంచడం ద్వారా కార్ల మార్కెట్లో కూడా అదే తరహాలో బలం పుంజుకోవాలనుకుంటున్నామని అన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మూడు కొత్త ఎస్‌యూవీలు ప్రవేశపెట్టాలనుకుంటున్నామంటూ వాటిలో హైబ్రిడ్, బ్యాటరీ మోడళ్లుంటాయని తకాషి తెలిపారు.

కొత్తతరం ఈవీ 'ఓపీ ఆల్ఫా' ఆవిష్కారం



హోండా మోటార్ 'హోండా ఓపీ ఆల్ఫా' పేరిట కొత్త తరం ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని ఆవిష్కరించింది. 2027లో భారత్‌లో ఈ కారు అమ్మకాలు ప్రారంభించాలని యోచిస్తోంది. ఇది అటు పట్టణ, ఇటు పల్లె వాతావరణాలు రెండింటిలోనూ నడపదగ్గదని తెలుపుతూ, భారత్‌లో ఇది తమ తొలి బ్యాటరీ విద్యుత్ కారు అని తకాషి చెప్పారు.

ఎన్‌విడియా @ 5 లక్షల కోట్ల డాలర్లు

ప్రపంచంలో ఈ స్థాయి మార్కెట్ విలువ కలిగిన ఏకైక సంస్థ

భారత్, జపాన్, యూకే జీడీపీ కంటే అధికం



న్యూయార్క్: కృత్రిమ మేధ (ఏఐ) చిప్‌ల తయారీ దిగ్గజం ఎన్‌విడియా సరికొత్త రికార్డు సృష్టించింది. అమెరికా స్టాక్ మార్కెట్లో కంపెనీ షేరు బుధవారం నాడు ఒక దశలో 5.17 శాతం పెరిగి 211.43 డాలర్లకు చేరింది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ 5.13 లక్షల కోట్ల డాలర్లకు ఎగబాకింది. ప్రపంచంలో 5 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ విలువకు చేరుకున్న ఏకైక, తొలి కంపెనీ ఇదే. భారత్, జపాన్, యూకే జీడీపీల కంటే అధికమిది. కంపెనీకి 50,000 కోట్ల డాలర్ల విలువైన ఏఐ చిప్‌ల ఆర్డర్లు లభించాయని, అమెరికా ప్రభుత్వం కోసం 7 కొత్త సూపర్ కంప్యూటర్లను అభివృద్ధి చేయనున్నట్లు ఎన్‌విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ ప్రకటించడం తాజా ర్యాలీకి దోహదపడింది. అలాగే, 6జీ సెల్యులార్ టెక్నాలజీ అభివృద్ధి కోసం నోకియాలో 100 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెడుతున్నట్లు కంపెనీ ప్రకటించడం కూడా ఇందుకు తోడ్పడింది. మంగళవారం ట్రేడింగ్‌లోనూ కంపెనీ షేరు 5% మేర లాభపడింది. ప్రపంచంలో అత్యంత విలువైన కంపెనీల జాబితాలో ఎన్‌విడియా తర్వాత ఐఫోన్ల తయారీ సంస్థ యాపిల్, మైక్రోసాఫ్ట్ 4 లక్షల కోట్ల డాలర్లకు పైగా మార్కెట్ విలువతో వరుసగా 2,3 స్థానాల్లో ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఏఐ సేవలకు, చిప్‌లకు డిమాండ్ శరవేగంగా పెరుగుతుండటంతో ఎన్‌విడియా షేరు కూడా అంతే వేగంగా పెరుగుతూ వచ్చింది. ఈ ఏడాదిలో ఇప్పటికే 50% పైగా పుంజుకుంది.

ఎన్‌విడియా ప్రస్థానంలో కీలక మైలురాళ్లు

- వీడియో గేమ్ ప్రాసెసర్ల తయారీతో తన ప్రస్థానాన్ని ప్రారంభించిన ఎన్‌విడియా.. ప్రస్తుత ఏఐ బూమ్‌లో అత్యంత కీలక కంపెనీగా ఎదిగింది.
- 1999లో సంస్థ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు వచ్చింది. 12 డాలర్ల వద్ద కంపెనీ షేరు మార్కెట్లో నమోదైంది. ఆ సమయంలో సంస్థ మార్కెట్ విలువ 100 కోట్ల డాలర్ల కంటే తక్కువే.
- ఈ ఏడాది జూలై 10న ఎన్‌విడియా 4 లక్షల కోట్ల మార్కెట్ విలువ కలిగిన తొలి సంస్థగా అవతరించింది.
- 100 బిలియన్ డాలర్ల నుంచి 4 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ విలువను సాధించేందుకు కంపెనీకి 26 ఏళ్లు పట్టగా.. ఆ తర్వాత కేవలం మూడు నెలలకు పైగా కాలంలోనే మరో లక్ష కోట్ల డాలర్ల మార్కెట్ విలువను సాధించడం విశేషం.
- కంపెనీ మార్కెట్ విలువ 2023లో తొలి లక్ష కోట్ల డాలర్ల మైలురాయికి చేరింది. గడిచిన రెండేళ్లలో 4 లక్షల కోట్ల వృద్ధిని సాధించడం మరో విశేషం.

మార్చి నాటికి హైదరాబాద్ మెట్రోకు గుడ్‌బై

ఎల్ అండ్ టీ ప్రెసిడెంట్ శంకర్ రామన్

న్యూఢిల్లీ: హైదరాబాద్ మెట్రో నుంచి పెట్టుబడుల ఉపసంహరణ ప్రస్తుత త్రైమాసికం లేదా రాబోయే త్రైమాసికాని (జనవరి-మార్చి)కి మధ్యలో ఏ సమయంలో అయినా జరగవచ్చని ఎల్ అండ్ టీ ప్రెసిడెంట్, హోల్‌టైమ్ డైరెక్టర్ ఆర్ శంకర్ రామన్ చెప్పారు. ఎల్ అండ్ టీ సెప్టెంబరు (క్యూ2) త్రైమాసిక ఫలితాల అనంతరం ఇన్వెస్టర్ కాల్‌లో ఆయన మాట్లాడుతూ.. తాము ఇప్పటికే ఈ విషయం ఎక్స్ఛేంజీలకు, మార్కెట్లకు తెలియచేశామని, పెట్టుబడుల ఉపసంహరణ విధివిధానాలపై ప్రభుత్వంతో సవివరంగా చర్చిస్తున్నట్లు వెల్లడించారు. ఈ లావాదేవీకి సంబంధించిన పత్రాల విషయంలో కొన్ని లోపాలు జరిగి ఉండవచ్చని, అందుకే వచ్చే త్రైమాసికం నాటికి అది పూర్తి కావచ్చన్న అభిప్రాయం తాను ప్రకటించానని ఆయన వివరించారు. ఎంత తొందరగా పూర్తయితే అంత మంచిది అయినప్పటికీ గడువును నిర్ణయించడంలో తాము ఒక్కరే భాగం కాదన్న విషయం ఆయన గుర్తు చేశారు.

క్యూ2 లాభంలో 15.6% వృద్ధి: ఎల్ అండ్ టీ సెప్టెంబరు త్రైమాసికంలో రూ.3,926.09 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.3,395.29 కోట్లతో పోల్చితే లాభం 15.6% పెరిగింది.

మళ్లీ 26,000 పైకి నిఫ్టీ

ముంబై: అమెరికా ఫెడ్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లను మరింత తగ్గించనుందన్న అంచనాలతో అంతర్జాతీయ మార్కెట్లు ర్యాలీ తీసిన నేపథ్యంలో దేశీయ సూచీలూ బుధవారం లాభాల్లో పయనించాయి. సెన్సెక్స్ ఒకదశలో 477.67 పాయింట్లు ఎగబాకి 85,105.83 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి సూచీ 368.97 పాయింట్ల లాభంతో 84,997.13 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 117.70 పాయింట్లు బలపడి 26,053.90 వద్ద ముగిసింది.

● మ్యాక్సివిజన్ ఐ హాస్పిటల్.. ఆంధ్రప్రదేశ్‌లోని కాలేజీ విద్యార్థుల కోసం 'కంప్యూటర్ విజన్ సిండ్రోమ్ (సీవీఎస్), రెఫ్రాక్టివ్ ఎర్రర్స్ అవేర్‌నెస్' కార్యక్రమాన్ని ప్రారంభించింది. విద్యార్థులు ఎక్కువ కాలం కంప్యూటర్లను చూడటం కారణంగా వచ్చే ఇబ్బందులతో పాటు కంటి చూపులో వచ్చే మార్పుల గురించి వివరించనుంది. ఈ కార్యక్రమం ద్వారా 5,000 మంది విద్యార్థులకు కంటిచూపుపై అవగాహన కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

స్పోర్ట్స్

రోహిత్@1

- కెరీర్‌లో తొలిసారి టాప్ ర్యాంక్ సొంతం
- ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్



దుబాయ్: కెరీర్‌లో తొలిసారి రోహిత్ శర్మ ఐసీసీ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచాడు. ఇటీవలే ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్ మూడో మ్యాచ్‌లో అజేయంగా 121 పరుగులతో అదరగొట్టిన రోహిత్.. రెండు స్థానాలు మెరుగుపర్చుకొని నెం:1 ర్యాంక్‌ను కైవసం చేసుకొన్నాడు. శుభ్‌మన్ గిల్ మూడో స్థానానికి పడిపోయాడు. సుదీర్ఘ కెరీర్‌లో ఎప్పుడూ టాప్-10లోనే నిలిచిన 38 ఏళ్ల రోహిత్ చరమాంకంలో కెరీర్ బెస్ట్‌ను సొంతం చేసుకోవడం విశేషం. ఆల్‌రౌండర్ల విభాగంలో అక్షర్ పటేల్ నాలుగు మెట్లెక్కి ఎనిమిదో ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు.

పోరాడి ఓడిన టైటాన్స్

క్వాలిఫయర్-2లో పుణెరి పల్టన్ విజయం

ఫైనల్లో దబాంగ్ ఢిల్లీతో అమీతుమీ

న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటాన్స్ కథ ముగిసింది. బుధవారం హోరాహోరీగా జరిగిన క్వాలిఫయర్-2లో టైటాన్స్ 45-50తో పుణెరి పల్టన్ చేతిలో పరాజయం పాలైంది. చివరి 3 నిమిషాల్లో స్టార్ రైడర్ ఆదిత్య షిండే ఐదు పాయింట్ల సూపర్ రైడ్‌తో మ్యాచ్‌ను పల్టన్‌వైపు తిప్పాడు. ఈ మ్యాచ్‌లో గెలిచిన పుణెరి పల్టన్ శుక్రవారం జరిగే టైటిల్ పోరులో దబాంగ్ ఢిల్లీతో తాడోపేడో తేల్చుకోనుంది. టైటాన్స్ ప్లేయర్ భరత్ 23 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలిచినా జట్టును గెలిపించలేక పోయాడు. ఫస్టాఫ్ చివరికి టైటాన్స్ 24-20తో పైచేయిగా నిలిచింది.

లక్ష్యసేన్ ముందంజ

- శ్రీకాంత్ అవుట్
- హైలో ఓపెన్

జార్‌బ్రుకెన్ (జర్మనీ): కిడాంబి శ్రీకాంత్‌కు హైలో ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ ఈవెంట్‌లో చుక్కెదురైంది. ఆరంభ రౌండ్లో భారత్‌కే చెందిన కిరణ్ జార్జ్ 21-19, 21-11తో ప్రపంచ మాజీ నెంబర్‌వన్ శ్రీకాంత్‌ను చిత్తుచేసి ప్రీక్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. కాగా లక్ష్యసేన్ 21-16, 22-20తో ఐదో సీడ్ క్రిస్టో పొపోవ్ (ఫ్రాన్స్)కు షాకిచ్చి రెండోరౌండ్‌కు చేరాడు. ప్రీక్వార్టర్స్‌లో సహచర షట్లర్ శంకర్ ముత్తుసామితో లక్ష్య తలపడనున్నాడు. మహిళల సింగిల్స్‌లో రైజింగ్ స్టార్ శ్రియాంశి వలిశెట్టి ముందంజ వేసింది.

ఫైనల్లో సఫారీలు



- సెంచరీతో కదం తొక్కిన కెప్టెన్ లారా వోల్వార్ట్
- మరిజానెకు ఐదు వికెట్లు
- చిత్తుగా ఓడిన ఇంగ్లండ్

గువాహటి: ప్రతిష్ఠాత్మక ప్రపంచ కప్‌ను సొంతం చేసుకొనేందుకు దక్షిణాఫ్రికా మహిళలు అడుగు దూరంలో నిలిచారు. బుధవారం జరిగిన తొలి సెమీఫైనల్లో సఫారీలు ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టారు. 125 పరుగుల తేడాతో మాజీ చాంపియన్ ఇంగ్లండ్‌ను చిత్తు చేసి ఫైనల్లో అడుగుపెట్టారు. మొదట బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా 50 ఓవర్లలో ఏడు వికెట్లకు 319 పరుగులు చేసింది. కెప్టెన్ లారా వోల్వార్ట్ (169) సెంచరీతో కదం తొక్కింది. తజ్మిన్ బ్రిట్స్ (45), మరిజానె కాప్ (42), ట్రయాన్ (33) రాణించారు. స్పిన్నర్ ఎకిల్‌స్టోన్ నాలుగు వికెట్లు పడగొట్టింది. భారీ ఛేదనలో పేసర్ కాప్ (5/20) ధాటికి ఇంగ్లండ్ 42.3 ఓవర్లలో 194 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ బ్రంట్ (64), కాప్సీ (50) హాఫ్ సెంచరీలు చేశారు. డిక్లెర్క్ రెండు వికెట్లు కైవసం చేసుకుంది. వోల్వార్ట్ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచింది.

దక్షిణాఫ్రికా: 50 ఓవర్లలో 319/7 (వోల్వార్ట్ 169, బ్రిట్స్ 45, కాప్ 42, ట్రయాన్ 33 నాటౌట్, ఎకిల్‌స్టోన్ 4/44, లారెన్ బెల్ 2/55)
ఇంగ్లండ్: 42.3 ఓవర్లలో 194 ఆలౌట్ (బ్రంట్ 64, కాప్సీ 50, డానీ వ్యాట్ 34, లిన్సీ స్మిత్ 27, కాప్ 5/20, డి క్లెర్క్ 2/24).

ఆ ఇద్దరూ ఆడకుంటే..: ఛేదనలో కాప్ వణికించడంతో ఇంగ్లండ్ ఒక పరుగుకే మూడు వికెట్లు చేజార్చుకుంది. ఈ దశలో బ్రంట్, కాప్సీ నాలుగో వికెట్‌కు 107 పరుగులు జత చేయడంతో ఇంగ్లండ్ పరువు దక్కించుకుంది. ఆపై దక్షిణాఫ్రికా బౌలర్లు మళ్లీ విజృంభించడంతో ఇంగ్లండ్ కనీసం 200 పరుగులు కూడా చేయలేకపోయింది.

వోల్వార్ట్ ఒంటి చేత్తో..: కెప్టెన్ ఆట ఎలా ఉండాలో నిరూపిస్తూ వోల్వార్ట్ ఒంటిచేత్తో సౌతాఫ్రికా ఇన్నింగ్స్‌ను నడిపించింది. మరో ఓపెనర్ బ్రిట్స్ జతగా మొదటి వికెట్‌కు వోల్వార్ట్ 116 పరుగులు జోడించింది. కానీ 23వ ఓవర్లో బ్రిట్స్, బాష్ (0) బౌల్డ్ చేసిన స్పిన్నర్ ఎకిల్‌స్టోన్ సఫారీలకు షాకిచ్చింది. కానీ కాప్ జతగా నాలుగో వికెట్‌కు 72 పరుగులు జత చేసిన లారా ఆపై, ట్రయాన్ జతగా ఏడో వికెట్‌కు 89 పరుగులు జోడించి జట్టును ఆదుకుంది.

అమ్మాయిలకు అగ్నిపరీక్ష

మ. 3 గంటల నుంచి



నేడు ఆస్ట్రేలియాతో భారత్ సెమీస్

వన్డే వరల్డ్ కప్



నవీ ముంబై: కొంచెం కష్టానికి మరికొంత అదృష్టం కలిసొచ్చి వరల్డ్ కప్‌లో సెమీఫైనల్‌కు చేరిన భారత జట్టు ఇప్పుడిక అసలు సిసలు సవాలుకు సిద్ధమైంది. గురువారం జరిగే రెండో సెమీఫైనల్లో పటిష్టమైన ఆస్ట్రేలియాతో తలపడనుంది. ఈ సందర్భంగా డెర్బీలో జరిగిన 2017 ప్రపంచ కప్ సెమీఫైనల్లో ఆస్ట్రేలియా జట్టుపైనే ప్రస్తుత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ చేసిన అసామాన ప్రదర్శన గుర్తు చేసుకోవాలి. ఆ మ్యాచ్‌లో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకు పడిన కౌర్ కేవలం 115 బంతులలో అజేయంగా 171 పరుగులు చేసి భారత్‌కు అపురూప విజయం అందించింది. మరి..ఈసారి సెమీఫైనల్లోనూ కౌర్ సారథ్యంలోని మన అమ్మాయిలు ఆ మ్యాచ్ ఫలితాన్ని పునరావృతం చేస్తారేమో చూడాలి. కానీ ఈసారి టోర్నీలో హర్మన్ సేన నిలకడైన ప్రదర్శన కనబర్చలేకపోయింది. వరుసగా మూడు పరాజయాలు చవిచూడడమే అందుకు ఉదాహరణ.

జట్టు కూర్పు ఆసక్తికరం..

సెమీస్‌కు ముందు కీలక బ్యాటర్ ప్రతీక రావల్ గాయంతో వైదొలగడం భారత్‌కు పెద్ద దెబ్బ. దాంతో దూకుడైన బ్యాటింగ్ చేసే షఫాలీ వర్మను ప్రతీక స్థానంలో తీసుకున్నారు. ఆస్ట్రేలియాపై ఒత్తిడి తెచ్చే ఉద్దేశంతో..మంధానతో కలిసి షఫాలీని ఓపెనింగ్ చేయిస్తారా? లేదంటే ఆరో బౌలర్‌కు చోటు కల్పించేందుకు హర్లీన్ డియోల్‌ను ఓపెనర్‌గా పంపుతారా.. అనేది చూడాలి. అలాగే..బంగ్లాదేశ్‌పై గత మ్యాచ్‌లో పదునైన బౌలింగ్‌తోపాటు చురుకైన ఫీల్డింగ్‌తో ఆకట్టుకున్న స్పిన్నర్ రాధా యాదవ్‌ను కొనసాగిస్తారా అనేదీ ఆసక్తికరం. ఈ సారి టోర్నమెంట్‌లో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయిన కెప్టెన్ కౌర్..ఎనిమిదేళ్ల నాటి సెమీస్ ఇన్నింగ్స్ స్ఫూర్తిగా ఆస్ట్రేలియాపై మరోసారి విరుచుకు పడాలన్నది అభిమానుల ఆకాంక్ష. మరో వైపు ఇప్పటికే ఒక సెంచరీ, రెండు హాఫ్ సెంచరీలతో సూపర్ ఫామ్‌లో ఉన్న మంధాన అదే జోరు కొనసాగించాల్సి ఉంటుంది. అయితే బౌలర్లు ధారాళంగా పరుగులిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈనేపథ్యంలో పటిష్ఠమైన ఆస్ట్రేలియా బ్యాటర్లను నిలువరించాలంటే మన బౌలర్లు శక్తికి మించి సత్తా చాటాల్సిందే.

హీలీ ఓకే..

ఈసారి పలు మ్యాచ్‌ల్లో క్లిష్ట సమయాల్లో పుంజుకొన్న తీరు ఆస్ట్రేలియా పోరాట పటిమను తెలియజేస్తుంది. కాగా.. కండర గాయంతో చివరి రెండు లీగ్ మ్యాచ్‌లకు దూరమైన కెప్టెన్ హీలీ ఫిట్‌నెస్ టెస్ట్‌లో నెగ్గడం సెమీస్‌కు ముందు ఆసీస్ జట్టుకు అత్యంత సానుకూలాంశం.

జట్లు (అంచనా)


భారత్: హర్మన్ ప్రీత్ (కెప్టెన్), స్మృతీ మంధాన, హర్లీన్, షఫాలీ, దీప్తిశర్మ, జెమీమా, స్నేహ్ రాణా, శ్రీచరణి, రేణుకా సింగ్, రిచా ఘోష్ (కీపర్), క్రాంతి గౌడ్.

ఆస్ట్రేలియా: అలిసా హీలీ (కెప్టెన్), గార్డ్‌నర్, కిమ్ గార్త్, అలనా కింగ్, లిచ్‌ఫీల్డ్, మెక్‌గ్రాత్, మోలినెక్స్, బేత్ మూనీ (కీపర్), పెర్రీ, షూట్, సదర్లాండ్.

వాతావరణం

గురువారం వర్షం కురిసే అవకాశం 25 శాతం మేర ఉంది. కనీసం 20 ఓవర్లు సాధ్యపడకపోతే మ్యాచ్ నిలిచిపోయిన దగ్గరనుంచి శుక్రవారం రిజర్వ్‌డే నాడు మిగతా ఆట కొనసాగుతుంది. ఒక వేళ రిజర్వ్‌డే రోజు కూడా ఫలితం రాకపోతే గ్రూప్ దశలో భారత్‌కంటే అత్యధిక విజయాలున్న ఆస్ట్రేలియా ఫైనల్‌కు వెళ్తుంది.

సూర్య ప్రతాపంపై నీళ్లు



సూర్యకుమార్ (39 నాటౌట్)

- వరుణడిదే పైచేయి
- ఆసీస్-భారత్ తొలి టీ20 రద్దు

కాన్‌బెర్రా: చాన్నాళ్ల తర్వాత ఫామ్ దొరకబుచ్చుకున్న టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 39 నాటౌట్) జోష్‌పై వరుణుడు నీళ్లు కుమ్మరించాడు. ఎడతెగని వర్షం కారణంగా ఆస్ట్రేలియా-భారత్ జట్ల మధ్య తొలి టీ20 అర్ధంతరంగా రద్దయింది. టాస్ కోల్పోయి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఆట నిలిచే సమయానికి 9.4 ఓవర్లలో 97/1 స్కోరు చేసింది. ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (20 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 37 నాటౌట్), సూర్య రెండో వికెట్‌కు 35 బంతుల్లో 62 పరుగులు జోడించారు. అంతకుముందు 5 ఓవర్లు పూర్తవగానే సుమారు 40 నిమిషాలపాటు వాన ఆటంకం కలిగించడంతో మ్యాచ్‌ను 18 ఓవర్లకు కుదించారు. కానీ ఆ తర్వాత మరోసారి మొదలైన వర్షం ఆగకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. రెండో టీ20 శుక్రవారం మెల్‌బోర్న్‌లో జరగనుంది.

అభిషేక్ విఫలం: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు అభిషేక్ శర్మ (14 బంతుల్లో 4 ఫోర్లతో 19) అదిరే ఆరంభాన్ని అందించలేక పోయాడు. 4వ ఓవర్‌లో ఎల్లిస్ బౌలింగ్‌లో గిల్ 2 ఫోర్లతో జోరు చూపినా.. పేలవ షాట్ ఆడిన అభిషేక్ మిడాన్‌లో డేవిడ్‌కు క్యాచిచ్చాడు. దీంతో తొలి వికెట్‌కు 35 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయితే, వన్‌డౌన్‌లో వచ్చిన సూర్య ఐదో ఓవర్‌లో హాజెల్‌వుడ్ బౌలింగ్‌లో 92 మీటర్ల దూరంలో భారీ సిక్స్ బాది స్టేడియంలో జోష్ తీసుకొచ్చాడు. బార్ట్‌లెట్ బౌలింగ్‌లో ఫిలిప్స్ క్యాచ్ చేజార్చడంతో సూర్యకు లైఫ్ లభించింది. ఇక, పదో ఓవర్‌లో ఎల్లిస్ బౌలింగ్‌లో రెండు బౌండ్రీలు, ఓ సిక్స్ సాధించాడు. అతడి దూకుడు చేస్తే భారీ స్కోరు ఖాయమనుకొంటున్న తరుణంలో వర్షం అడ్డుపడింది.

స్కోరుబోర్డు

భారత్: అభిషేక్ (సి) డేవిడ్ (బి) ఎల్లిస్ 19, గిల్ (నాటౌట్) 37, సూర్యకుమార్ (నాటౌట్) 39; **ఎక్స్‌ట్రాలు:** 2; **మొత్తం:** 9.4 ఓవర్లలో 97/1; **వికెట్ పతనం:** 1-35; **బౌలింగ్:** హాజెల్‌వుడ్ 3-0-24-0, బార్ట్‌లెట్ 2-0-16-0, ఎల్లిస్ 1.4-0-25-1, స్టొయినిస్ 1-0-10-0, కునేమన్ 2-0-22-0.

1

టీ20ల్లో అత్యంత వేగంగా 150 సిక్స్‌లు బాదిన బ్యాటర్‌గా సూర్యకుమార్. 86 ఇన్నింగ్స్‌లో 1649 బంతుల్లో సూర్య ఈ మైలురాయిని అందుకొన్నాడు. యూఏఈ ఆటగాడు వసీం 66 ఇన్నింగ్స్‌లో 1543 బంతుల్లోనే 150 సిక్స్‌ల మార్క్‌ను చేరాడు. కానీ, అతడి రికార్డును అసోసియేట్ మెంబర్‌గా ఐసీసీ నమోదు చేసింది. ఓవరాల్‌గా 150, అంతకంటే ఎక్కువ సిక్స్‌లు కొట్టిన జాబితాలో రోహిత్ (205 ఇన్నింగ్స్), వసీం (187), గప్టిల్ (173), బట్లర్ (172) సూర్య కంటే ముందున్నారు.

నితీశ్‌కు మెడ నొప్పి

తొలి మూడు టీ20లకు దూరం



కాన్‌బెర్రా: టీమిండియా ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్‌ను గాయాలు వెంటాడుతున్నాయి. తాజాగా మెడనొప్పి కారణంగా అతడు ఆస్ట్రేలియాతో తొలి మూడు టీ20లకు దూరమయ్యాడు. కాగా, ఆసీస్‌తో అడిలైడ్‌లో జరిగిన రెండో వన్డేలో అతడికి తొడ కండర గాయమైంది. దీంతో మూడో వన్డేకు కూడా అందుబాటులో లేకుండా పోయాడు. అతడి ఆరోగ్య పరిస్థితిని మెడికల్ టీమ్ పర్యవేక్షిస్తోందని బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది.

ఒకే డివిజన్‌లో అసెంబ్లీ స్థానం!

- పెద్ద నియోజకవర్గాలకు రెవెన్యూ డివిజన్ హోదా!!
- ఒకే డివిజన్ పరిధిలోకి ఉదయగిరి
- తిరుపతి జిల్లాలోకి నగరి..
- మంత్రివర్గ ఉపసంఘం భేటీలో కీలక చర్చ
- డివిజన్లు, మండలాల మార్పుపై కసరత్తు

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రాంతాల మధ్య సమతౌల్యం, ఆర్థిక, సామాజిక అంశాలను ప్రామాణికంగా తీసుకుని జిల్లాల పునర్‌వ్యవస్థీకరణపై కసరత్తు చేయాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. ప్రస్తుతం ఈ దిశగా మరింతగా అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని, అందులో ప్రజాప్రతినిధులు, ప్రాంతాల ఆకాంక్షలు ప్రతిబింబించాలని రెవెన్యూ శాఖను ఆదేశించింది. ప్రత్యేకించి ఒక అసెంబ్లీ నియోజకవర్గం ఒకే రెవెన్యూ డివిజన్‌లో ఉండేలా కసరత్తు చేయాలని దిశానిర్దేశం చేసింది. దాని నివేదిక ఆధారంగా కొత్త డివిజన్ల ఏర్పాటుపై ప్రతిపాదనలు చేయనుంది. వీలైనంత త్వరగా రిపోర్టు సిద్ధం చేస్తే మరోసారి సమావేశమవ్వాలని నిశ్చయించింది. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన ఉపసంఘం బుధవారం సాయంత్రం అమరావతి సచివాలయంలో సమావేశమైంది. మంత్రులు పి.నారాయణ, నిమ్మల రామానాయుడు, వంగలపూడి అనిత, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ తదితరులు హాజరయ్యారు. రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు, మార్గదర్శకాల నేపథ్యంలో ఆ శాఖ జిల్లా, డివిజన్ల కూర్పుపై ఓ నివేదికను ఉపసంఘం ముందుంచింది. ఎన్ని కొత్త జిల్లాలు ఏర్పాటు చేయాలో ఇప్పటికే స్పష్టత వచ్చినందున.. ఉపసంఘం బుధవారం ప్రధానంగా రెవెన్యూ డివిజన్లు, అసెంబ్లీ నియోజకవర్గాలపై చర్చించింది. ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గం ప్రస్తుతం రెంటికిపైగా రెవెన్యూ డివిజన్లలో విస్తరించి ఉంది. ఈ నియోజకవర్గంలోని మండలాల ప్రజలు మూడు ఆర్‌డీవో ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఒక అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఒక రెవెన్యూ డివిజన్‌లోనే సర్దుబాటు చేసేలా కొత్త డివిజన్లను ప్రతిపాదించాలని మంత్రులు రెవెన్యూ శాఖకు సూచించారు. ఉదయగిరి తరహాలో రాష్ట్రంలో ఎన్ని నియోజకవర్గాలు ఎన్ని డివిజన్లలో ఉన్నాయి.. వాటిని ఒకే రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎలా సర్దుబాటు చేయాలి.. కొత్త డివిజన్ ఏర్పాటు చేయాలా.. ఈ అంశాలపై సమగ్ర ప్రతిపాదనలు ఇవ్వాలని కోరారు. దీనిపై తక్షణమే కలెక్టర్ల నుంచి నివేదికలు తెప్పించుకోవాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలుగా ఉంటూ పెద్ద మండలాలుగా ఉన్నవి.. రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు అవకాశం ఉన్న పెద్ద నియోజకవర్గాల వివరాలు కూడా కోరారు. ఉదయగిరి, మడకశిర రెండు అసెంబ్లీ నియోజకవర్గాలు. వాటిని ప్రత్యేక డివిజన్లుగా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు చర్చకొచ్చాయి. అలాగే కందుకూరు, అద్దంకి, పుంగనూరు నియోజకవర్గాలనూ డివిజన్లుగా ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించనున్నారు.

శాస్త్రీయంగా పునర్‌వ్యవస్థీకరణ: అనగాని

జిల్లాల పునర్‌వ్యవస్థీకరణను ప్రజల ఆకాంక్షల మేరకు శాస్త్రీయంగా చేపడతామని మంత్రి అనగాని చెప్పారు. గతంలో జిల్లాల విభజనలో వచ్చిన ఇబ్బందులను తీరుస్తామని ఎన్నికల సందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారని.. జగన్ చేసిన తప్పుల వల్ల ప్రజలెదుర్కొంటున్న ఇబ్బందులకు పరిష్కారం చూపుతామని తెలిపారు. జనగణనకు ముందే జిల్లాల పునర్‌వ్యవస్థీకరణపై నివేదిక ఇస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.

పెద్ద గ్రామాలు మండలాలుగా..

ఒక మండలం పరిధిలో ఆర్థికాభివృద్ధికి బాగా అవకాశం ఉన్న పెద్ద గ్రామాలను గుర్తించి అక్కడి ప్రజల కోరిక మేరకు వాటిని మండలాలుగా ఏర్పాటు చేసే అంశం కూడా ఉపసంఘం సమావేశంలో చర్చకొచ్చింది. అలాగే కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాలు, రెవెన్యూ మండలాలు, డివిజన్లను ఇతర జిల్లాలకు మార్చే అంశాన్నీ సబ్‌కమిటీ పరిశీలిస్తోంది. ఉదాహరణకు.. చిత్తూరులో ఉన్న నగరి నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లా పరిధిలోకి తీసుకురావాలనుకుంటున్నారు. నగరి స్థానం పరిధిలోని రెండు మండలాలు తిరుపతిలో, మూడు మండలాలు చిత్తూరులో ఉన్నాయి. మొత్తం నగరిని తిరుపతి జిల్లా, రెవెన్యూ డివిజన్ పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు తెలిసింది. జిల్లాల నుంచి సమాచారం తెప్పించుకున్నాక శుక్రవారం లేదా సోమవారం (3న) మరోసారి సమావేశమై.. దీనిపై ఓ స్పష్టతకు రావాలని ఉపసంఘం నిర్ణయించింది.

హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సుభేందు ప్రమాణం

- ప్రమాణ స్వీకారం చేయించిన సీజే ధీరజ్‌సింగ్ ఠాకూర్

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సుభేందు సమంత్ ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం హైకోర్టులోని మొదటి కోర్టు హాల్‌లో సీజే ధీరజ్‌సింగ్ ఠాకూర్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకుముందు జస్టిస్ సుభేందు బదిలీకి సంబంధించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జారీచేసిన ఉత్తర్వులను హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వైవీఎస్‌బీజీ పార్థసారథి చదివి వినిపించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి జస్టిస్ సుభేందు కుటుంబసభ్యులు, అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, అదనపు ఏజీ సాంబశివ ప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ, అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనుంజయ, ఏపీ బార్ కౌన్సిల్ అధ్యక్షుడు ద్వారకానాథరెడ్డి, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ పార్థసారథి, రిజిస్ట్రార్‌లు, హైకోర్టు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది హాజరయ్యారు.

రాష్ట్ర పండుగగా బ్రౌన్ జయంతి

చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (సీపీ బ్రౌన్) జయంతిని రాష్ట్ర పండుగగా జరపనున్నారు. ప్రతి ఏటా నవంబరు 10న ఆయన జయంతి రోజున ఈ వేడుకలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు బుధవారం పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. 'ఆయన తన ఖాళీ సమయాన్ని తెలుగు భాష, సాహిత్యానికి అంకిత చేశారు. తన సంపాదనలో ప్రతి రూపాయి తెలుగు భాష, సాహిత్య పునరుజ్జీవనం, ప్రచారం కోసం ఖర్చు చేశారు. తెలుగు అధ్యయనాలకు దోహదపడిన యూరోపియన్ పండితుల్లో సి.పి.బ్రౌన్ పేరు ఒక దీపంలా వెలుగుతుంది. లండన్ విశ్వవిద్యాలయంలో తెలుగు ఆచార్యునిగా చివరి శ్వాస వరకూ పని చేశారు. తెలుగు భాష, సాహిత్యం కోసం తన జీవితాన్ని త్యాగం చేశారు' అని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కల్తీ నెయ్యి కేసులో వైవీ పీఏ అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యం ఉన్న తొలి నిందితుడు ఇతనే. చిన్న అప్పన్నది విజయనగరం జిల్లా తెర్లాం మండలం పాములవలస. హైదరాబాద్ కేంద్రంగా వైవీ సుబ్బారెడ్డి వ్యక్తిగత, వ్యాపారాలకు సంబంధించిన వ్యవహారాలను చూస్తుంటారు. టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంలో అతడు కీలక పాత్ర పోషించినట్టు సిట్ భావిస్తోంది. గత జూన్ 4వ తేదీన చిన్న అప్పన్నను తిరుపతిలోని సిట్ కార్యాలయానికి పిలిపించి ఈ విషయంపై విచారించింది. చిన్న అప్పన్నను విచారణకు పిలిపించడంతోనే వైవీ సుబ్బారెడ్డి సహా వైసీపీ శిబిరం కలవరపాటుకు గురైంది. ఆ వెంటనే వైవీ సుబ్బారెడ్డి ఈ కేసు దర్యాప్తు అధికారిగా తిరుపతి అదనపు ఎస్పీ వెంకట్రావు కొనసాగడాన్ని హైకోర్టులో సవాల్ చేయడం, హైకోర్టు దర్యాప్తుపై స్టే విధించడం తెలిసిందే. సుమారు మూడున్నర నెలల తర్వాత సుప్రీం కోర్టు ఆదేశాలతో సిట్ దర్యాప్తు తిరిగి ప్రారంభమైంది. ఆ వెంటనే ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. విచారణ నిమిత్తం దర్యాప్తు అధికారులు బుధవారం తిరుపతి సిట్ కార్యాలయానికి చిన్న అప్పన్నను పిలిపించారు. హైదరాబాద్, విశాఖపట్నం సీబీఐ కార్యాలయాల నుంచి వచ్చిన ముగ్గురు డీఎస్పీలు, ముగ్గురు సీఐలు విచారణలో పాల్గొన్నారు. విచారణ అనంతరం చిన్న అప్పన్నను అరెస్టు చేశారు. రాత్రి 8.10 గంటలకు రుయా ఆస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం నెల్లూరు ఏసీబీ కోర్టులో హాజరుపరిచేందుకు తీసుకెళ్లారు. రాత్రి వేళ కావడంతో జడ్జి నివాసం వద్ద నిందితుడిని హాజరుపరచనున్నారు. రిమాండు రిపోర్టులో అతడిని ఏ-24గా పేర్కొన్నారు. చిన్న అప్పన్న అరెస్టుతో తదుపరి వైవీ సుబ్బారెడ్డికి సైతం నోటీసులు జారీ చేసి విచారించే అవకాశం ఉంది. కేసు దర్యాప్తు మరింత కీలక మలుపు తీసుకునే అవకాశం కనిపిస్తోంది. దానికనుగుణంగా కీలక వ్యక్తుల అరెస్టులు కూడా జరుగుతాయన్న ఊహాగానాలు మొదలయ్యాయి.

'పీపీపీ' ఆపలేం

(మొదటి పేజీ తరువాయి)

అంశాలను లోతుగా పరిశీలించాల్సి ఉందని తెలిపింది. "పీపీపీ ప్రక్రియ ప్రస్తుతం టెండర్ల దశలోనే ఉంది. ప్రభుత్వం ఆహ్వానించిన వెంటనే డబ్బుల సంచులతో పెట్టుబడిదారులు హడావుడిగా రారుకదా!" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసిన తరువాత అన్ని అంశాలను పరిశీలిస్తామని పేర్కొంది. కౌంటర్ వేసేందుకు సమయం ఇస్తూ తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.

స్టే ఇవ్వండి!

రాష్ట్రంలోని ఆదోని, మదనపల్లి, మార్కాపురం, పులివెందుల, పెనుగొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సీపట్నం, బాపట్ల, పార్వతీపురం మెడికల్ కాలేజీలను పీపీపీతో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదిస్తూ గత నెల 9న ప్రభుత్వం జీవో 590ని జారీ చేసింది. దీనిని సవాల్ చేస్తూ గుంటూరుజిల్లా, తాడేపల్లికి చెందిన సామాజిక కార్యకర్త డాక్టర్ కుర్రా వసుంధర హైకోర్టులో పిల్ వేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్. శ్రీరామ్, న్యాయవాది అశోక్‌రామ్ వాదనలు వినిపించారు. "లాభ, నష్టాలను సమగ్రంగా అధ్యయనం చేయకుండానే పీపీపీ విధానంలో నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. నిర్వహణ బాధ్యతను 33ఏళ్ల పాటు థర్డ్ పార్టీకి అప్పగించడం ద్వారా ప్రైవేటు వ్యక్తులు రూ.వేల కోట్లు ఆర్జిస్తారు. ఇప్పటికే పిలిచిన టెండర్లను ఖరారు చేయకుండా కోర్టు స్టే ఇవ్వాలి" అని కోరారు. ధర్మాసనం స్పందిస్తూ.. ఆసుపత్రుల నిర్మాణానికి ఎంత ఖర్చు అవుతుందని, కాలేజీల నిర్మాణం ఏదశలో ఉందని ఆరా తీసింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) వాదనలు వినిపిస్తూ.. "మొత్తం 17 మెడికల్ కాలేజీలు, ఆసుపత్రుల నిర్మాణానికి రూ.8,500 కోట్లు అవసరం. పులివెందుల మెడికల్ కాలేజీ నిర్మాణం 80 శాతం పూర్తయింది. మిగిలిన కాలేజీల నిర్మాణాలు 20-30శాతం మాత్రమే జరిగాయి. పీపీపీ విధానంలో అభివృద్ధి వ్యవహారం టెండర్ల దశలో ఉంది. పూర్తి వివరాలతో కౌంటర్ వేస్తాం. ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వద్దు" అని ధర్మాసనాన్ని కోరారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై సుప్రీం విచారణ 19కి వాయిదా

న్యూఢిల్లీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఇసుక అక్రమ తవ్వకాలపై విచారణను సుప్రీంకోర్టు నవంబరు 19కి వాయిదా వేసింది. ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించి జేపీ వెంచర్స్‌కు జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) రూ.18 కోట్ల జరిమానా విధించడంతో.. ఆ సంస్థ 2023 మే 15న సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. న్యాయస్థానం ఆదేశాలతో నాటి అక్రమ తవ్వకాలకు సంబంధించిన సమగ్ర నివేదికను ప్రస్తుత ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు అందజేసింది. పిటిషన్‌పై బుధవారం జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఏపీ ప్రభుత్వం తరఫు న్యాయవాదుల విజ్ఞప్తి మేరకు విచారణను వాయిదా వేసింది.

శ్రీ సత్యసాయి శతజయంతి ఉత్సవాలను

రాష్ట్ర వేడుకగా నిర్వహిస్తే తప్పేముంది?

- విశిష్ట వ్యక్తులను గౌరవించడంలో తప్పేముంది?
- పిల్‌ను ఉపసంహరించుకోకుంటే ఖర్చులు విధిస్తామని హెచ్చరించిన ధర్మాసనం
- ఉపసంహరించుకున్న పిటిషనర్

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి శ్రీ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారిక వేడుకగా నిర్వహిస్తే తప్పేముందని పిటిషనర్‌ను హైకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. తీవ్ర నీటి ఎద్దడి ఉన్న మూడు జిల్లాలకు సత్యసాయి ట్రస్టు ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించారని సహచరుల ద్వారా తెలుసుకున్నామని తెలిపింది. అలాగే ఆసుపత్రులు, విద్యాసంస్థలు కూడా స్థాపించి ప్రజలకు సేవ చేశారని గుర్తు చేసింది. ఇలాంటి విశిష్ట వ్యక్తులను గౌరవించడంలో తప్పేముందని ప్రశ్నించింది. కేవలం సత్యసాయి ఒక్కరి జయంతినేకాక, రాష్ట్రంలో మొత్తం 22 మంది జయంతులను రాష్ట్రవేడుకగా నిర్వహిస్తున్నారని గుర్తు చేసింది. తగిన అధ్యయనం చేయకుండానే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తుందా? అని ప్రశ్నించింది. ప్రజోపయోగ వ్యాజ్యాలు దాఖలు చేయాలని పిటిషనర్‌కు హితవు పలికింది. పిల్‌ను స్వచ్ఛందంగా ఉపసంహరించుకోవాలని, లేకుంటే ఖర్చులు విధించి కొట్టివేస్తామని హెచ్చరించింది. పిల్ ఉపసంహరణకు పిటిషనర్ అంగీకరించడంతో, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం పిల్‌ను ఉపసంహరణకు అనుమతిస్తున్నట్లు ప్రకటించింది. పుట్టపర్తి సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వ అధికారిక వేడుకగా ప్రకటించడంతో పాటు నిర్వహణకయ్యే ఖర్చులను రెగ్యులర్ ఫండ్స్ నుండి ఖర్చు చేయాలని వివిధ శాఖలను కోరడాన్ని సవాల్ చేస్తూ ప్రకాశం జిల్లాకు చెందిన భారత హేతువాద సంఘం అధ్యక్షుడు వెంకట సుబ్బయ్య హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపించారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ... మొత్తం 22 మంది విశిష్ట వ్యక్తుల జయంతులను అధికారిక వేడుకగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

వేడుకలకు 10 కోట్లు

శ్రీ సత్యసాయి బాబా శతజయంతి వేడుకలకు ప్రభుత్వం రూ.10 కోట్లు కేటాయించింది. ఈ మేరకు బుధవారం పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. నవంబరు 23న శ్రీ సత్యసాయిబాబా శత జయంతి వేడుకలను రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జయంతి వేడుకల నిర్వహణలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పనకు పర్యాటక శాఖ నుంచి రూ.10 కోట్లు కేటాయించింది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

నన్ను టార్గెట్ చేశారు



సోషల్‌మీడియాలో తనపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ హీరో చిరంజీవి బుధవారం మరోసారి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. తనపై అభ్యంతరకర పోస్టులు పెడుతూ, దుర్భాలాషలాడుతున్న కొన్ని ఎక్స్ హ్యాండిల్ ప్రొఫైల్స్‌పై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా దయాచౌదరి అనే వ్యక్తి తనను లక్ష్యంగా చేసుకొని దూషణకు పాల్పడుతున్నాడనీ, అతనిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని చిరంజీవి పోలీసులను కోరారు. కొందరు తన ఫొటోలను మార్ఫింగ్ చేసి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై వైరల్ చేస్తున్నారని ఇటీవలే చిరంజీవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిరంజీవి పేరు, ఫొటోలు, గొంతును ఆయన అనుమతి లేకుండా ఎవరూ ఉపయోగించకూడదని సిటీ సివిల్‌కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

హీరోయిన్‌గా మహేశ్‌బాబు మేనకోడలు

● కథానాయికగా మంజుల కుమార్తె జాన్వీ స్వరూప్



సూపర్ స్టార్ కృష్ణ ఫ్యామిలీ నుంచి మరో వారసురాలు తెలుగు చిత్రపరిశ్రమకు పరిచయమవనున్నారు. కృష్ణ మనవరాలు, మహేశ్‌బాబు మేనకోడలు, మంజుల కుమార్తె జాన్వీ స్వరూప్ కథానాయికగా తెరంగేట్రం చేయనున్నారు. బుధవారం జాన్వీ పుట్టినరోజు సందర్భంగా ఈ విషయాన్ని మంజుల ప్రకటించారు. తన కుమార్తె హీరోయిన్‌గా టాలీవుడ్‌లో అరంగేట్రం చేయబోతున్నందుకు ఎంతో ఆనందంగా ఉందని మంజుల తెలిపారు. 'నన్ను అడ్డుకున్న వారే ఇప్పుడు జాన్వీ కోసం ప్రార్థిస్తున్నారు. ఆమె చిరునవ్వు నా ప్రార్థనలకు సమాధానం' అని స్పందించారు. ఆమె నటించబోయే సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలోనే ప్రకటించనున్నారు. ఘట్టమనేని కుటుంబం నుంచి పరిచయం కానున్న తొలి హీరోయిన్ జాన్వీనే కావడం విశేషం. మంజుల తెరకెక్కించిన 'మనసుకు నచ్చింది' సినిమాలో జాన్వీ బాలనటిగా నటించారు.

సైనికుడి శౌర్యం



అమితాబ్ బచ్చన్ మనవడు అగస్త్య నంద కథానాయకుడిగా దర్శకుడు శ్రీరామ్ రాఘవన్ తెరకెక్కిస్తున్న బాలీవుడ్ చిత్రం 'ఇక్కీస్'. 'ద అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ సెకండ్ లెఫ్టినెంట్ అరుణ్ కేతర్‌పాల్'. దేశంలోనే అతి పిన్న వయసులోనే పరమ వీర చక్ర పురస్కారం (మరణాంతరం) పొందిన యుద్ధ వీరుడు అరుణ్ కేతర్‌పాల్ జీవితం ఆధారంగా ఈ తెరకెక్కిన చిత్రమిది. ధర్మేంద్ర కీలకపాత్ర పోషించారు. డిసెంబరులో విడుదల కానుంది. తాజాగా ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. దేశభక్తి, ధైర్యం, భావోద్వేగాలు, ప్రేమ, యాక్షన్ తదితర అంశాలతో నిండిన ఈ ట్రైలర్ ఆకట్టుకుంటోంది. ఈ చిత్రానికి దినేశ్ విజన్ నిర్మాత.



బ్రహ్మానందంకు సూర్యకాంతం స్మారక పురస్కారం

ప్రముఖ నటీమణి, స్వర్గీయ సూర్యకాంతం శతజయంతి పురస్కారాల ముగింపు ఉత్సవం బుధవారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో సూర్యకాంతం స్మారక పురస్కారాన్ని నటుడు బ్రహ్మానందం అందుకున్నారు. డాక్టర్ సూర్యకాంతం శతజయంతి కమిటీతో కలసి కిన్నెర ఆర్ట్స్ థియేటర్ ఈ వేడుకను నిర్వహించింది. సూర్యకాంతం కుమారుడు అనంత పద్మనాభమూర్తి, ఆమె మనవడు, మనవరాలు కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. 2023లో సూర్యకాంతం శతజయంతి వేడుకలు మొదలయ్యాయి. ఈ కార్యక్రమంలో నటుడు మురళీమోహన్, దర్శకుడు రేలంగి నరసింహా రావు, నటుడు తనికెళ్ల భరణి, అలీ తదితరులు పాల్గొన్నారు. సూర్యకాంతంపై సినీ జర్నలిస్ట్ ఎస్వీ రామారావు తెరకెక్కించిన 'అత్తగారు జిందాబాద్' లఘు చిత్రాన్ని ఈ సందర్భంగా ప్రదర్శించారు.

టైటిల్‌కు తగ్గ కథతో వస్తున్నాం


భాను భోగవరపు



'మాస్ జాతర'లో మాస్ అంశాలు పుష్కలంగా చూపిస్తూనే ఓ కొత్త పాయింట్‌ను చెప్పబోతున్నాం. ఈ చిత్రానికి టైటిల్‌ను రవితేజ గారే సూచించారు. థియేటర్‌లో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే సన్నివేశాలు ఈ చిత్రంలో చాలా ఉన్నాయి' అని దర్శకుడు భాను భోగవరపు అన్నారు. రవితేజ, శ్రీలీల జంటగా ఆయన తెరకెక్కించిన చిత్రం 'మాస్ జాతర'. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించారు. ఈ నెల 31న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు భాను భోగవరపు. రైల్వే పోలీస్ నేపథ్యంలో జరిగే ఈ కథలో క్రైమ్ సీక్వెన్స్ కొత్తగా ఉంటుంది. కథను రాసే క్రమంలో చాలా పరిశోధన చేశాను. పలువురు రైల్వే అధికారులను కలసి చాలా వివరాలు తెలుసుకున్నాను. ఇది రవితేజగారి 75వ చిత్రం కావడంతో నా బాధ్యత మరింత పెరిగింది. అయితే, ఎటువంటి ఒత్తిడి పెట్టుకోకుండా కూల్‌గా సినిమా చేయమని రవితేజ ప్రోత్సహించారు. ఇందులో శివుడి పాత్ర ఎంతో కీలకం. నవీన్‌చంద్రగారు ఈ పాత్రకు ప్రాణం పోశారు. సినిమా విడుదలయ్యాక ఆయన నటనకు అద్భుతమైన ఆదరణ దక్కుతుంది. తులసి అనే అమ్మాయిగా శ్రీలీల కనిపిస్తారు. గత చిత్రాలతో పోలిస్తే ఆమె ఇందులో కొత్తగా కనిపిస్తారు. రవితేజగారు, శ్రీలీల మధ్య వచ్చే సన్నివేశాలు 'గ్యాంగ్ లీడర్' సినిమాలో చిరంజీవి, విజయశాంతిల జంటను గుర్తు చేస్తాయి. ఈ చిత్రంలో వినోదానికి పెద్దపీట వేశాము. మాస్ అంశాలతో కూడిన ఈ విభిన్న చిత్రం అందరినీ ఆకట్టుకుంటుందనే నమ్మకముంది' అని చెప్పారు.



సుదూర బాటసారి




నిహాల్ కోధాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి. విశ్వనాథరెడ్డి దర్శకత్వంలో రూపొందిన స్పై డ్రామా 'చైనా పీస్'. కమల్ కామరాజు, రఘుబాబు కీలకపాత్రలు పోషించారు. మూన్ లైట్ డ్రీమ్స్ నిర్మించిన ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. బుధవారం మేకర్స్ 'గూఢచారి సుదూర బాటసారి' అంటూ సాగే గీతాన్ని విడుదల చేశారు. దినేశ్ కాకర్ల సాహిత్యం అందించగా, కార్తీక్ రోడ్రిగ్జ్ స్వరపరిచారు. స్ఫూర్తి జితేందర్, హారికా నారాయణ్ ఆలపించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'కొత్త తరహా కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది' అని చెప్పారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు. సినిమాటోగ్రఫీ: సురేశ్ రగుతు, ఎడిటర్: కే వెంకటేశ్

ఆర్‌ఎక్స్ 100 చిత్రంలా

గుర్తుండిపోతుంది

వేణు ఊడుగుల



అఖిల్, తేజస్విని జంటగా సాయిలు కంపాటి తెరకెక్కించిన చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. 'నీది నాది ఒకే కథ', 'విరాట పర్వం' చిత్రాలతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. డా.నాగేశ్వర రావు పూజారి సమర్పిస్తున్నారు. నవంబర్ 21న బన్నీవాస్ వర్క్స్, నందిపాటి ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై బన్నీ వాసు, వంశీ నందిపాటి విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో బన్నీవాస్ మాట్లాడుతూ 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమా చూశాను. నా మనసుకు హత్తుకుంది. సినిమా చూసి బయటకు వచ్చే ప్రేక్షకులు ఒక భావోద్వేగంతో బయటకు వస్తారు' అని అన్నారు. 'ఖమ్మం, వరంగల్ నగరాల్లో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా దర్శకుడు సాయిలు కంపాటి ఈ కథ రాసుకున్నారు. ఈ విషాదభరితమైన ప్రేమ కథ నన్ను కదిలించింది. '7జీ బృందావన్ కాలనీ', 'ప్రేమిస్తే', 'ఆర్‌ఎక్స్ 100', 'బేబి' లాంటి చిత్రాల్లా తెలుగు ప్రేక్షకులు ఈ సినిమాను ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటారు' అని చెప్పారు. 'ఈ సినిమా కథను ఒకే సిట్టింగ్‌లో వేణు అన్న అంగీకరించారు. ఈ సినిమా విజయంపై పూర్తి నమ్మకముంది' అని సాయిలు కంపాటి తెలిపారు.



నిండు గర్భిణిని పోలీసు జీప్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

పోలీసు జీపులో ఆస్పత్రికి.. కవలలు జననం

బాపట్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫానులో వాగులు, వంకలు పొంగిపొర్లుతుండటంతో అంబులెన్సు రాక ఇబ్బంది పడుతున్న నిండు గర్భిణిని పోలీసు జీపులో సకాలంలో ఆస్పత్రికి తరలించడంతో కవలలకు జన్మనిచ్చింది. బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం కొణికి గ్రామంలో బుధవారం జరిగిందీ ఘటన. కొణికి పంచాయతీలోని కట్టావారిపాలేనికి చెందిన ఓ మహిళకు బుధవారం ఉదయం పురిటినొప్పులు మొదలయ్యాయి. అప్పటికే గ్రామ సమీపంలోని వాగులు, వంకలు పొంగి పొర్లుతుండడంతో అంబులెన్స్ రావడానికి అవకాశం లేకుండా పోయింది. ఇంకొల్లు ఎస్ఐ తన జీపులోనే అంగన్వాడీ కార్యకర్తల సహాయంతో గర్భిణిని ఇంకొల్లులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆమెకు కవలలు జన్మించారు.

నాడు 'మసులీపట్నం'.. నేడు 'మొంథా'!

76 ఏళ్ల తర్వాత అదే తేదీన పంజా విసిరిన తుఫాను

- **అప్పట్లో 3లక్షల ఇళ్లు ధ్వంసం.. 800 మంది మృతి**
- **దాదాపు 10 లక్షల ఎకరాల్లో పంట నష్టం**

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

1949 అక్టోబరు 28.. 2025 అక్టోబరు 28.. సంవత్సరాలు వేరైనా ఈ తేదీలకు మాత్రం చాలా దగ్గర సంబంధం ఉంది.! సరిగ్గా 76 ఏళ్ల క్రితం బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం.. తీవ్ర తుఫానుగా మారి అక్టోబరు 28న మచిలీపట్నం వద్ద తీరాన్ని తాకింది. తాజాగా రాష్ట్రాన్ని వణికించిన మొంథా కూడా ఇదే తేదీన తీరం దాటింది. ఇది యాదృచ్ఛికమే అయినా.. అప్పుడు సంభవించిన నష్టానికి.. ఇప్పుడు జరిగిన నష్టానికీ భారీ తేడా ఉంది. అప్పట్లో సరైన సమాచార వ్యవస్థ లేదు. ప్రకృతి విపత్తుల సమయంలో సకాలంలో స్పందించే వ్యవస్థ లేదు. అప్పట్లో ఏ సమాచారమైనా రేడియోల ద్వారానే తెలిసేది. కానీ ఇప్పుడలా కాదు. సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా అందుబాటులో ఉంది. స్మార్ట్ ఫోన్ల రూపంలో ప్రజలు కూడా ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నారు. వాతావరణ శాఖ ఇచ్చిన హెచ్చరికలతో ప్రభుత్వం అప్రమత్తమై ముందస్తు ప్రణాళికలు రూపొందించడంతో మొంథా ప్రభావంతో పెద్దగా నష్టం జరగలేదు. ఈదురు గాలులు, వర్షాల కారణంగా పంట నష్టం సంభవించింది తప్ప ప్రాణ, ఆస్తి నష్టం పెద్దగా సంభవించలేదు. అయితే.. 1949లో ఇలాంటివేమీ లేకపోవడంతో ఆస్తి, ప్రాణ, పంటనష్టం తీవ్రంగా కనిపించింది.

1949లో బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుఫాను అక్టోబరు 28న తెల్లవారుజామున మచిలీపట్నం సమీపంలో తీరాన్ని తాకింది. అప్పట్లో ఎక్కడ తీరం దాటితే అదే ఆ తుఫాను పేరుగా నిర్ణయించేవారు. ఆ రోజుల్లో మచిలీపట్నాన్ని 'మసులీపట్నం' అని పిలిచేవారు. దీంతో ఈ తుఫానుకి 'మసులీపట్నం' అని పేరు పెట్టారు. ఈ తుఫాన్ ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో విధ్వంసం సృష్టించింది. దీని ప్రభావంతో ఈదురు గాలులు భారీగా వీయడంతో 27వ తేదీ రాత్రి నుంచే ఈ నాలుగు జిల్లాల్లో సమాచార వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. 3 లక్షల ఇళ్లు ధ్వంసమయ్యాయి. 10 లక్షల ఎకరాల్లో పంటలు నేలకొరిగాయి. మొత్తం 800 మంది ప్రాణాలు కోల్పోయారు. గూడు చెదిరిపోవడంతో వేలాది మంది నిరాశ్రయులయ్యారు. అండమాన్‌లో ఏర్పడిన వాయుగుండం పశ్చిమ దిశగా కదులుతూ తీరంవైపు దూసుకొచ్చింది. దీంతో 1949 అక్టోబరు 26న వాతావరణ కేంద్రం తీవ్ర తుఫాన్ హెచ్చరిక జారీ చేసింది. ఇది 28వ తేదీ రాత్రి తీరాన్ని తాకింది. ఈ తీవ్ర తుఫాన్ వల్ల మచిలీపట్నం, కాకినాడ ప్రాంతాల్లో గంటకు 136 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. సముద్రంలో అలలు 10 నుంచి 15 అడుగుల ఎత్తువరకు ఎగసిపడ్డాయి. తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు నదులు ఉప్పొంగాయి. సాగునీటి కాల్వలు అస్తవ్యస్థమయ్యాయి. 27వ తేదీ అర్ధరాత్రి నుంచి 28వ తేదీ ఉదయం 8 గంటల వరకు సుమారు 20 సెంటీమీటర్ల వర్షం కురిసింది. నాడు ఈ తుఫాన్ హెచ్చరికలన్నీ చెన్నైలోని వాతావరణ కేంద్రం నుంచి వెలువడ్డాయి. విజయవాడ, చెన్నైలోని ఆలిండియా రేడియో కేంద్రాల నుంచి 25వ తేదీ మధ్యాహ్నం నుంచి ప్రత్యేక ప్రసార కార్యక్రమాల ద్వారా హెచ్చరికలు జారీ చేశారు. ఇలా ఎప్పటికప్పుడు తుఫాన్ తీవ్రతను తెలియజేస్తూ హెచ్చరించినందుకు అప్పట్లో అనేక మంది విజయవాడ ఆకాశవాణి కేంద్రాన్ని అభినందిస్తూ లేఖలు పంపారు.

మంగళవారం ఉదయం ఎనిమిది గంటలనుంచి బుధవారం ఉదయం ఎనిమిది గంటల వరకూ రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో నమోదైన వర్షపాతం వివరాలు...

జిల్లా	ఊరు	వర్షపాతం (సెం.మీ.)
నంద్యాల	శ్రీశైలం	27
ప్రకాశం	ఒంగోలు	26
ప్రకాశం	చీమకుర్తి	24
బాపట్ల	చీరాల	24
బాపట్ల	చినగంజాం	23
నెల్లూరు	కావలి	23
ప్రకాశం	సింగరాయకొండ	22
నెల్లూరు	కందుకూరు	22
ప్రకాశం	పొదిలి	22
ప్రకాశం	పర్చూరు	22
ప్రకాశం	ఇంకొల్లు	21
ప్రకాశం	చిలకపాడు	21
ప్రకాశం	తుళ్లూరు	20
ప్రకాశం	ఉలవపాడు	19
ప్రకాశం	దొనకొండ	19
ప్రకాశం	దర్శి	19
బాపట్ల	ఇంకొల్లు	19
బాపట్ల	అద్దంకి	19
నెల్లూరు	దగదర్తి	19
ప్రకాశం	మద్దిపాడు	18
కడప	వనికుంట్ల	18
ప్రకాశం	మర్రిపాలెం	17
నంద్యాల	వెలుగోడు	17
నెల్లూరు	చామడాల	17
ప్రకాశం	పెద ఉలుగళ్లు	17
ప్రకాశం	సంతనూతలపాడు	17
ప్రకాశం	తిప్పాయిపాలెం	16
బాపట్ల	కొండయకుంట	16
ప్రకాశం	మార్కాపురం	15
నంద్యాల	ఆత్మకూరు	14
ప్రకాశం	కంభం	14
నంద్యాల	ఆత్మకూరు	14
ప్రకాశం	రాచర్ల, ముండ్లమూరు, యర్రగొండపాలెం, బెస్తవారిపేట	13
కడప	పోరుమామిళ్ల	13
నంద్యాల	జూపాడు బంగ్లా	13
నంద్యాల	మహానంది	13
నంద్యాల	నంద్యాల	12



డ్బాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బెండమూర్లంకలో వరిచేలను పరిశీలించేందుకు వస్తున్న సీఎం చంద్రబాబు

వర్షార్పణం



మచిలీపట్నంలోని హుస్సేన్ పాలెంలో నీట మునిగిన వరి చేలు



అంబేద్కర్ కోనసీమ జిల్లా గెద్దాడలో నేలనంటిన వరిచేలు

ముంచేసింది

నర్సాపురం వద్ద తీరం దాటుతూ తీర జిల్లాలపై మొంథా తుఫాన్ బీభత్సం

కుండపోత..పెను గాలులతో కుదేలైన అన్నదాత ఆశలు

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

మూడు రోజులుగా కంటి మీద కునుకు లేకుండా చేసిన మొంథా తుఫాన్ నర్సాపురం వద్ద తీరాన్ని వదిలింది. వెళుతూ, వెళుతూ, అన్నదాతలను నిండా కన్నీట ముంచేసింది. ఎటు చూసినా పంట పొలాలు సముద్రాలను తలపిస్తున్నాయి. కంకులు వచ్చి ధాన్యంగా రూపొందించేదశలో ఉన్న వరి పంట పొలంలోనే వాలిపోయింది. పత్తికాయలు విచ్చుకొని అందులోని విత్తనాల నుంచి మొక్కలు వచ్చాయి. కళ్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న చేతికి అందకుండా పోయింది. ఎడతెరిపి లేని కుండపోత వానలకుతోడు తుఫాన్ తీరం దాటేవేళ విరుచుకుపడ్డ పెనుగాలుల బీభత్సం రైతులకు అపార కష్టం మిగిల్చింది. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లోని లంకలు, గ్రామాలు, సమీప పట్టణాలు జల దిగ్బంధనంలో చిక్కుకుపోయాయి. ప్రకాశం జిల్లా కేంద్రం ఒంగోలులో కాలనీలకు కాలనీలే మునిగిపోయాయి. రాష్ట్రంలో భారీ వర్షాలతో వాగులు, గడ్డలు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తూ రోడ్లు, కల్వర్టులపైకి పారుతూ ప్రజలను భయకంపితులను చేస్తున్నాయి. రహదారులు నదులను తలపిస్తుండటంతో ప్రజా రవాణా చాలా చోట్ల కొన్నిగంటల పాటు స్తంభించిపోయింది. సకాలంలో సహాయక చర్యలు అందుబాటులోకి రావడం, రెస్క్యూ టీమ్‌లు ఎక్కడికక్కడ చురుగ్గా కదలడం ఆస్తి, ప్రాణ నష్టాలను చాలావరకు తగ్గించేసింది. గత మూడురోజులుగా రాష్ట్ర ప్రజలకు గొప్ప ఊరటను అందించింది. తుఫాన్ 1.23 లక్షల హెక్టార్ల పంట నష్టం మిగిల్చినట్టు ప్రాథమికంగా ప్రభుత్వం అంచనా వేసింది.

అపార కష్టం..

సముద్ర తీరం పరిధిలోని జిల్లాలపై మొంథా విరుచుకుపడి, రైతుల పంట కలను ఘోరంగా దెబ్బతీసింది. పశ్చిమగోదావరి జిల్లా: వర్షాల కంటే పెనుగాలితోనే పంటలకు అపారనష్టం వాటిల్లింది. తుఫాన్ తీరం దాటే సమయంలో గాలులు, వర్షం తీవ్రత అధికంగా ఉంటుందని అంచనా వేశారు. పెద్ద ప్రభావం లేకుండానే తుఫాను వీడిందని అంతా ఊపిరిపీల్చుకున్నారు. కానీ వేకువజామున మూడు గంటలకు ఈ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో సుడిగాలులు వీచాయి. రెండు గంటల పాటు వీచిన గాలులతో రైతుల ఆశలు ఆవిరి అయ్యాయి. ఈ జిల్లా వ్యాప్తంగా 26,381 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. చాలా మండలాల్లో వరి పంట వెన్నుదశలో పంట ఉంది. మరో 15 రోజుల్లో మసూళ్లు ముమ్మరం కానున్నాయి. ఈ తరుణంలో మొంథా తుఫాను విరుచుకుపడటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

బాపట్ల జిల్లా: వ్యవసాయ, ఉద్యాన పంటలు కలిపి ఈ జిల్లాలో 53,970 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ ప్రాథమికంగా తేల్చింది. ఇందులో ఉద్యాన పంటలు 4,450 ఎకరాలుగా యంత్రాంగం గుర్తించింది. 31,000 మంది రైతులపై తుఫాన్ తీవ్ర ప్రభావం చూపింది. అత్యధికంగా వరి 38,700, మినుము 4,200 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు యంత్రాంగం ప్రాథమికంగా గుర్తించింది. పత్తి, బార్లీ పొగాకుతో పాటు ఉద్యానపంటలైన అరటి, బొప్పాయి, కూరగాయల పంటల విస్తీర్ణం కూగా గణనీయంగానే ఉంది. తుఫాన్ ప్రభావంతో సముద్రపు నీరు ఉప్పొంగడంతో తీరానికి సమీపంలో ఉన్న రేపల్లె మండలం లంకెవానిదిబ్బ పరిధిలో దాదాపు 300 ఎకరాల వరి పైరు తుడిచిపెట్టుకుపోయింది. దాదాపు 200 ఎకరాల రొయ్యల చెరువులు దెబ్బతిన్నాయి.

గుంటూరు జిల్లా: 17 మండలాల్లో 22,615 హెక్టార్లలో వరి పంట దెబ్బతింది. అలానే 17,348 హెక్టార్లలో పత్తి, 1508 హెక్టార్లలో మినుము దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.

విశాఖ : 21 గ్రామాల్లో 107.7 హెక్టార్లలో పంట దెబ్బతింది.

విజయనగరం : 1633 హెక్టార్లలో వివిధ పంటలకు నష్టం వాటిల్లింది. ప్రధానంగా వరి పంట నేలవాలింది. కూరగాయల పంటలు నీట మునిగాయి.

ఏలూరు: 26 మండలాల్లో 281 గ్రామాల్లో 9,567 రైతులకు చెందిన 7920.64 హెక్టార్లలో వరి, మినుము, వేరుశనగ, పత్తి పంటలు దెబ్బతిన్నాయని వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా వేసింది.

నంద్యాల: చేతికొచ్చిన పంటలు నీటమునగడంతో నంద్యాలలో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. కళ్లాలో ఆరబెట్టిన మొక్కజొన్న మొలకలెత్తడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. చేతికొచ్చిన వరి పంట వర్షపు నీరు ముంచెత్తడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. 2,792 మంది రైతులకు చెందిన 1,960 హెక్టార్లలో వరి, కంది, మినుము, మొక్కజొన్న, పొగాకు పంటలకు నష్టం వాటిల్లింది.

పల్నాడు: 55,935 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు తేల్చారు.

నెల్లూరు జిల్లా: కోత దశలో ఉన్న వరి పంట దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మొత్తం 1320.73 హెక్టార్లలో వివిధ పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. అందులో 1282.63 హెక్టార్లలో వరి పంట దెబ్బతినగా, 21.7 హెక్టార్లలో మొక్కజొన్న, 11.4 హెక్టార్లలో వేరుశనగ పంట దెబ్బతింది.

శ్రీకాకుళం: 4,801 రైతులకు చెందిన 2,230.29 హెక్టార్లలో పంట నష్టం సంభవించింది.

పార్వతీపురం మన్యం జిల్లా: 904 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. 50 ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు అంచనా వేశారు.

అనకాపల్లి జిల్లా: 1,277 హెక్టార్లలో వరి పైరు నీట మునిగింది.

భయపెడుతున్న వరద ఉధృతి

బాపట్ల జిల్లా : పర్చూరు నియోజకవర్గం మొత్తం దాదాపుగా జలదిగ్బంధంలో చిక్కుకుపోయింది. పర్చూరు వాగు, ఉప్పుటూరు వాగు, ఇంకొల్లు పరిధిలోని కప్పలవాగు పొంగడంతో 35 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. పర్చూరు వాగు ఉధృతికి చీరాల--చిలకలూరిపేట జాతీయ రహదారిపై వరదనీరు పోటెత్తడం, ప్రవాహ దారి లేకపోవడంతో ఆ నీరంతా పొలాలను కబళించింది.

విజయనగరం జిల్లా: వరుస వర్షాలతో చంపావతి నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. జిల్లాలోని అంధ్ర, తాటిపూడి, మడ్డువలస ప్రాజెక్టుల్లోకి వరద నీరు అధికంగా రావడంతో ఇరిగేషన్ అధికారులు గేట్లు ఎత్తి దిగువకు నీరు విడిచి పెడుతున్నారు.

ఏలూరు జిల్లా: పెద ఎడ్లగాడి వద్ద కొల్లేరు వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో కైకలూరు మండలం గోకర్ణపురం నుంచి పైడిచింతపాడు వెళ్లే రహదారి మునిగిపోయింది. కొయ్యలగూడెం మండలం రాంజీపురంలో తాటాకుఇల్లు కూలింది. అలుగులగూడెం- దెందులూరు- సత్యనారాయణపురం గ్రామాల మధ్యలో గుండేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.

నంద్యాల: నల్లమలలో కురిసిన భారీ వర్షంతో పాలేరు పొంగి ప్రవహించడంతో నంద్యాల జిల్లాలో మహానంది మండలం, నంద్యాల పట్టణాన్ని వరద ముంచెత్తింది. పాలేరు వాగు నంద్యాల పట్టణంలోని చామకాల్వలో కలిసి కుందూనదిలో కలుస్తుంది. భారీ వర్షాలకు చామకాల్వ పొంగి, ఇరువైపులా ఉన్న లోతట్టు కాలనీలన్నీ జలమయమయ్యాయి. రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. నంద్యాల మండలంలో 19 గ్రామాల్లో వరద ప్రవహించింది.

అల్లూరి సీతారామరాజు జిల్లా: మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం వరకూ ఈదురుగాలులతో కుండపోతగా వర్షం కురిసింది. దీంతో గెడ్డలు,వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో పంటపొలాలు చెరువులను తలపిస్తున్నాయి. అరకులోయ, పాడేరు ఘాట్ మార్గాల్లో మట్టి పెళ్లలు విరిగిపడ్డాయి.

అనకాపల్లి: మూడురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో శారదా నది ఉధృతంగా ప్రవహిస్తోంది.

1.23లక్షల హెక్టార్లలో పంట నష్టం

నేటి నుంచి ఎన్యూమరేషన్

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 1.23 లక్షల హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు ఆయా శాఖలు ప్రాథమికంగా అంచనా వేశాయి. వివిధ రకాల వ్యవసాయ పంటలు లక్షా13వేల హెక్టార్లలో దెబ్బతిన్నాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. అత్యధికంగా కోనసీమ జిల్లాల్లో 24,782 హెక్టార్లు, ఎన్టీఆర్ జిల్లాలో 13,479 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. రాష్ట్రవ్యాప్తంగా 1,38లక్షల మంది రైతులకు నష్టం జరగ్గా, కోనసీమ జిల్లాలో దాదాపు 39వేల మంది నష్టపోయారు. రాష్ట్రవ్యాప్తంగా వరి 71,750, పత్తి 30,133, మినుము 6,073 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు అంచనా వేశారు. పల్నా డులో అత్యధికంగా 9,500 హెక్టార్లు, ఎన్టీఆర్ జిల్లా లో 8,500హెక్టార్లలో పత్తి పంట దెబ్బతిన్నట్లు గుర్తించారు. పొలాల్లో వర్షపు నీరు 4 రోజుల్లో తగ్గుతుందని, నీరు పోయాక పంట నష్టం పూర్తి స్థాయిలో తెలుస్తుందని అధికారులు తెలిపారు. తుఫాన్ నేపథ్యంలో పంట నష్టంపై గురువారం నుంచి క్షేత్రస్థాయిలో ఎన్యూమరేషన్ నిర్వహిస్తామని వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ బుధవారం రాత్రి తెలిపారు.

బీభత్సం..

తుఫాన్ తీరం దాటేవేళ విరుచుకుపడిన భారీ వర్షాలు, పెను గాలులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాయి.

విశాఖ: వరుస వర్షాలతో 22 ఇళ్లు దెబ్బతినగా, 157 ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. తుఫాన్ ప్రభావానికి తీవ్రంగా గురైన ఏలూరు జల్లాలో విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో చాలా ప్రాంతాల్లో కొన్ని గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

గుంటూరు జిల్లా: 50 కిలోమీటర్ల రోడ్లు తిన్నాయి.

శ్రీకాకుళం జిల్లా: విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు పలుచోట్ల భారీగా నేలకూలాయి. రూ. 11.73 లక్షలు ఆస్తినష్టం సంభవించింది. ఆర్‌అండ్‌బీకి చెందిన 16.38 కిలోమీటర్లు రోడ్లు దెబ్బతిన్నాయి. పలుచోట్ల 44 ఇళ్లు కూలిపోయాయి.

పశ్చిమ గోదావరి: తుఫాను గాలులకు 175 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. 662 చెట్లు కూకటి వేళ్లతో నేల మట్టం అయ్యాయి.

అనకాపల్లి జిల్లా: 84 పాఠశాల భవనాలు దెబ్బతిన్నాయి. 83 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. 31 ట్రాన్స్‌పార్మర్లు దెబ్బతిన్నాయి. చెట్ల కొమ్మలు పడడంతో 3 కిలోమీటర్ల మేర విద్యుత్ తీగలు తెగాయి.

తిరుమల ఘాట్‌లో కూలిన భారీ వృక్షం

తిరుమల నుంచి తిరుపతికి చేరుకునే మొదటి ఘాట్‌రోడ్డులో మంగళవారం అర్ధరాత్రి రెండు భారీ వృక్షాలు కూలాయి. ఏనుగుల ఆర్చ్, 14వ మలుపు రోడ్డుకు అడ్డుగా విరిగి పడ్డాయి. విజిలెన్స్, ఫారెస్ట్ సిబ్బంది సకాలంలో స్పందించి వృక్షాలను తొలగించి ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు.

'తూర్పు'న కకావికలం

భారీ వర్షాలు, ఈదురుగాలులతో ఉమ్మడి జిల్లాలో భారీ నష్టం

అమలాపురం/కాకినాడ/రాజమహేంద్రవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను కకావికలం చేసింది. అనుకున్నంత తీవ్రత లేనప్పటికీ ఈదురుగాలులు, భారీ వర్షాలకు లక్ష ఎకరాలకు పైగా పంటలకు తీవ్రం నష్టం వాటిల్లింది. వేలాది ఎకరాల్లో వరిచేలు నీటమునిగాయి. చెట్లు, వృక్షాలు విరిగిపోయాయి. వందలాది విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కోనసీమ జిల్లాలో 20 వేల ఎకరాల వరకు వరిపంటకు, 1590 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం జరిగింది. 300కు పైగా విద్యుత్ స్తంభాలు నేలరాలాయి. వాటిని పునరుద్ధరించే పనిలో సిబ్బంది ఉన్నారు. సఖినేటిపల్లి, మలికిపురం మండలాల పరిధిలో తీవ్రమైన గాలులకు చెట్లు, వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఎక్కడా ప్రాణాపాయం లేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించారు. తుఫానుతో కాకినాడ జిల్లా కూడా నష్టపోయింది. కాకినాడ వద్ద తీరం దాటుతుందని భావించినా.. కోనసీమవైపు దారి మళ్లడంతో పెనుప్రమాదం తప్పింది. కాకినాడ జిల్లాలో 116 గ్రామాలపై తీవ్ర ప్రభావం చూపింది. ఈదురుగాలులకు 17,172 హెక్టార్లలో వివిధ పంటలకు నష్టం వాటిల్లింది. పిఠాపురం నియోజకవర్గంలో 400 ఎకరాల్లో అరటి, 190 ఎకరాల్లో మొక్కజొన్న, 1500 ఎకరాల్లో పత్తి, 5 వేల ఎకరాల్లో వరి పంటలకు నష్టం వాటిల్లింది. జగ్గంపేటలో మొక్కజొన్న, కూరగాయలు, మినుము పంటలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఏలేరు, సుద్ధగడ్డకు భారీగా వరదనీరు చేరింది. 4,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఉప్పాడ బీచ్‌రోడ్డులో కొత్తపట్నం, సుబ్బంపేట వద్ద పడిన గండ్లను బండరాళ్లతో అధికారులు పూడ్చివేయించారు. తుఫాను తీరాన్ని తాకే సమయంలో వీచిన గాలులకు చెట్లు నేలకొరిగాయి. వాటి కొమ్మలు విద్యుత్ తీగలపై పడడంతో తెగిపోయాయి. కొన్నిచోట్ల స్తంభాలు విరిగిపోయాయి. కాకినాడ జిల్లాలో 181 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. 33 కేవీ ఫీడర్లు 52, 11 కేవీ ఫీడర్లు 214 వరకు పాక్షికంగా దెబ్బతిన్నాయి. చాలా వరకు మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. రూ.కోటి 12లక్షల మేర నష్టం వాటిల్లింది. కాకినాడ జిల్లా వ్యాప్తంగా 53 గృహాలు, 8 రహదారులు దెబ్బతిన్నాయి. 49 చెట్లు కూలిపోయాయి. తుఫాను ప్రభావం వల్ల విభజిత తూర్పుగోదావరి జిల్లాకు భారీనష్టం జరిగింది. అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండడంతో ప్రాణనష్టం జరగలేదు. మంత్రి కందుల దుర్గేశ్, కలెక్టర్ కీర్తి చేకూరి, ప్రత్యేకాధికారి కన్నబాబు, ఎమ్మెల్యేలు, అధికారులు తుఫాను తదుపరి పునరుద్ధరణ పనులు పూర్తిచేయించడంలో అహర్నిశలు పనిచేశారు. జిల్లాలో 244 విద్యుత్ స్తంభాలు నేలకూలగా, 26 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి.

'కృష్ణా'లో 50 వేల హెక్టార్ల పంట మునక

(విజయవాడ/మచిలీపట్నం-ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ ప్రభావంతో కృష్ణా జిల్లాలో వరి, ఉద్యాన పంటలకు తీరని నష్టం వాటిల్లింది. కృష్ణా జిల్లాలో 1.56 లక్షల హెక్టార్లలో వరి సాగు చేయగా.. 1.20 లక్షల హెక్టార్లలో పంట చేలల్లోనే వాలిపోయింది. ప్రాథమిక అంచనా మేరకు దాదాపు 50 వేల హెక్టార్లలో పంటనష్టం జరిగినట్టు తెలుస్తోంది. బంటుమిల్లి, బాపులపాడు, గన్నవరం, ఘంటసాల, ఉయ్యూరు, కంకిపాడు, కోడూరు, మచిలీపట్నం మండలాల పరిధిలో ఒక్కో మండలంలో 5 వేల నుంచి 7 వేల హెక్టార్ల చొప్పున పంట నష్టం జరిగింది. అలాగే 226.50 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. వీటిలో ఒక్క అరటి పంటే 200 హెక్టార్ల వరకూ ఉంది. భారీ గాలులతో బాపులపాడు మండలంలో 15 హెక్టార్లలో కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి. కాగా, ఎన్టీఆర్ జిల్లాలోని 20 మండలాల పరిధిలో డ్రోన్ బృందాలు, వ్యవసాయ అధికారుల బృందాలు పంట నష్టాన్ని అంచనా వేశాయి. ప్రాథమిక అంచనాల మేరకు 14,055 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. అయితే రైతులు చెబుతున్న దాని ప్రకారం 80వేల ఎకరాలకు పైగా వరి పంట దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో 26వేల ఎకరాల్లో పత్తి పంటకు నష్టం జరిగిందని అంచనా వేస్తున్నారు. మొంథా తుపానుకు ముందే కురిసిన వర్షాలతో పత్తి పంట దెబ్బతింది. పత్తికాయలు విచ్చుకోగా అందులోని విత్తనాల నుంచి మొలకలు వచ్చాయి. ఇక మొక్కజొన్న 1,800 ఎకరాల్లోనూ, కంది, పెసలు, మినుములు, వేరుశెనగ, చెరకు పంటలకు సంబంధించి 1,520 ఎకరాల్లోనూ పంట నష్టం జరిగిందని అంచనా.





గుండ్లకమ్మ గేట్లన్నీ ఎత్తేయడంతో ఉధృతంగా కిందకు వెళుతున్న వరద, వెల్లంపల్లి గ్రామంలోకి వరద చేరుతుండటంతో సురక్షిత ప్రాంతాలకు వెళుతున్న గ్రామస్థులు

ప్రకాశంపై మొంథా పంజా

- **లక్ష ఎకరాల్లో పంట నష్టం**
- **గుండ్లకమ్మ ప్రాజెక్టుకు 70 వేల క్యూసెక్కుల వరద**
- **ఒంగోలు నగరంలో నీట మునిగిన 20 కాలనీలు**

ఒంగోలు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాపై 'మొంథా' పంజా విసిరింది. తుఫాను ధాటికి కురిసిన కుండపోత వానతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లగా రవాణా వ్యవస్థ అస్తవ్యస్తమైంది. జిల్లాలో గత 24 గంటల వ్యవధిలో 16.33 సెం.మీ. సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఒంగోలులో 25.72 సెం.మీ. వాన కురిసింది. కొండపి, చీమకుర్తి, కొత్తపట్నం, ఎన్‌జీపాడు, కురిచేడు, సింగరాయకొండ, మద్దిపాడు మండలాల్లో 20 సెం.మీ. పైగా వర్షపా తం నమోదైంది. జిల్లాలోని 39 మండలాల్లో ఒక్క దోర్నాల మినహా మిగిలిన అన్నింటిలోనూ 10 సెం.మీ.పైగా వర్షం కురిసింది. యేరులు, వాగులు, వంకలు పొంగి ప్రవహించా యి. గుండ్లకమ్మ ప్రాజెక్టుకు గతంలో ఎన్నడూ లేనంతగా 70వేల క్యూసెక్కుల వరద రాగా అన్ని గేట్లు ఎత్తి మొత్తం నీటిని దిగువకు వదులుతున్నారు. చారిత్రక కంభం చెరువు ఐదేళ్ల తర్వాత పూర్తిగా నిండింది. పలు ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. స్తంభాలు విరిగిపడ్డాయి. వైర్లు తెగిపోయి గత రాత్రి నుంచి విద్యుత్ సరఫరా నిలిచి అంధకారం నెలకొంది. వందలాది గ్రామాల్లో పంటలు నీటిపాలయ్యాయి. దాదాపు లక్ష ఎకరాల్లో పత్తి, పొగాకు, కంది, సజ్జ, వరి, మొక్కజొన్న వంటి పంటలు నీటిలో ఉన్నాయి. రూ.250 కోట్ల మేర రైతులు నష్టపోయే పరిస్థితి కనిపిస్తోంది. ఒంగో లు నగరంలోనే దాదాపు 20 కాలనీలు మునిగిపోగా, జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వందకుపైగా కాలనీలు జలమయమయ్యాయి. జలమయమైన ప్రాంతాల్లో 101 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి 4,791 మందిని తరలించారు.

గుండ్లకమ్మ గేట్లు ఎత్తడంతో ఆందోళన

గుండ్లకమ్మకు 70వేల క్యూసెక్కుల వరద రావడంతో ప్రాజెక్టు గేట్లన్నీ ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతో దిగువన ఉన్న దాదాపు 25 గ్రామాల్లోకి వరద నీరు చేరుతోంది. 15 గ్రామాల్లో బుధవారం రాత్రి 10:30 గంటలకే వరద నీరు చేరడంతో గ్రామస్థుల్లో భయాందోళన మొదలైంది. మద్దిపాడు మండలంలోని దొడ్డవరం, మల్లవరం, వెలంపల్లి, నందిపాడు, కీర్తిపాడు, రాచవారిపాలెం తదితర గ్రామాలతోపాటు నాగులుప్పలపాడు మండలంలోని ఇనమనమెళ్లూరు, మద్దిరాలపాడు, చీర్వానుప్పలపాడు తదితర గ్రామాలకు వరద నీరు చేరింది.

ముందస్తు చర్యలతో తగ్గిన నష్టాలు

» హెచ్చరికలు, సూచనలకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్‌)

మొంథా తుఫాన్‌ వల్ల రాష్ట్రంలో నష్టాన్ని తగ్గించడంలో ప్రభుత్వ ముందస్తు చర్యలు దోహదపడ్డాయన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. భారత వాతావరణ శాఖ (ఐఎండీ), రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు, సూచనలకు అనుగుణంగా చర్యలు చేపట్టడంతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించగలిగారు. సీఎం చంద్రబాబు మంగళవారమంతా ఆర్టీజీఎస్‌లో ఉండి.. ఉపముఖ్యమంత్రి పవన్‌ కల్యాణ్‌, మంత్రులు, అధికార యంత్రాంగంతో ఎప్పటికప్పుడు సమీక్షలు జరుపుతూ వచ్చారు. అవసరమైన సాయానికి ప్రధాని మోదీ భరోసా ఇవ్వడంతో ప్రధానమంత్రి కార్యాలయంతో సమన్వయం చేసుకునే బాధ్యతను మంత్రి లోకేశ్‌కు అప్పగించారు.

అధికార గణం క్షేత్ర స్థాయిలో క్రియాశీలంగా వ్యవహరించింది. తుఫాన్‌ ప్రభావిత ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల నుంచి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి, బాధితులకు అల్పాహారం, భోజనం, పిల్లలకు పాలు, ఇతర వసతి సౌకర్యాలను కల్పించింది.

తుఫాన్‌ నష్టం.. సహాయ చర్యలివీ..

తుఫాన్‌ ప్రభావిత మండలాలు	249
గ్రామాలు	1,434
మున్సిపాలిటీలు	48
ప్రభావితులు	18 లక్షల మంది
పునరావాస కేంద్రాలు	1,209
ఆశ్రయం పొందిన వారు	1.16 లక్షల మంది
సురక్షిత ప్రాంతాలకు తరలిన గర్భిణులు	3,175 మంది
వైద్య శిబిరాలు	2,130
పంటనష్టం	304 మండలాల్లోని 87 వేల హెక్టార్లు
నష్టపోయిన రైతులు	78,796 మంది
చనిపోయిన పశువులు	42
దెబ్బతిన్న పంచాయతీరాజ్‌ రోడ్లు	380 కిలోమీటర్లు
దెబ్బతిన్న బ్రిడ్జిలు, కాల్వలు	14
దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రోడ్లు	2,294 కిలోమీటర్లు
రహదార్ల నష్టం	రూ.1,424 కోట్లు
గ్రామీణ నీటి సరఫరా విభాగానికి నష్టం	రూ.36 కోట్లు

బలహీనపడిన 'మొంథా'

» తెలంగాణ మీదుగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో ప్రవేశం

విశాఖపట్నం/అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కోస్తాంధ్రను వణికించిన మొంథా తీవ్ర తుఫాన్‌ మంగళవారం రాత్రి తీరం దాటిన తరువాత ఉత్తర వాయవ్యంగా పయనించింది. గంటకు 15 కి.మీ. వేగంతో ప్రయాణిస్తూ బుధవారం తెల్లవారుజామున తుఫాన్‌గా, ఉదయానికి తీవ్ర వాయుగుండంగా బలహీనపడి తెలంగాణ మీదుగా దక్షిణ ఒడిశా, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లోకి ప్రవేశించింది. అయితే, తుఫాన్‌ బలహీనపడి పొరుగు రాష్ట్రాల వైపు పయనించినా బంగాళాఖాతం నుంచి తేమగాలులు కోస్తాంధ్ర వైపుగా వస్తున్నాయి. దీంతో బుధవారం తెల్లవారుజాము నుంచి అనేకచోట్ల ముసురు వాతావరణం నెలకొంది. గురువారం దక్షిణ కోస్తాలో అనేకచోట్ల, ఉత్తర కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు, ఉత్తర కోస్తాలో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఇదిలా ఉండగా, తుఫాను ప్రభావంతో గురువారం తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలుకురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

నర్సాపురం పేరుపాలెంలో అలల ఉధృతి



తుఫాను గాయం.. సర్కారు సాయం

ముందస్తు చర్యలతో తగ్గిన ప్రాణనష్టం

» రాష్ట్ర వ్యాప్తంగా ఏడుగురు మృతి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్‌)

మొంథా తుఫాన్‌ నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంతోపాటు ప్రజలను అప్రమత్తం చేయడంతో చాలా వరకూ ప్రాణనష్టాన్ని నివారించగలిగారు. అయితే, కొన్ని చోట్ల అకస్మాత్తుగా జరిగిన ఘటనలతో రాష్ట్రవ్యాప్తంగా ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. ఒకరు గల్లంతయ్యారు. కాకినాడ, శ్రీకాకుళం, కోనసీమ, కృష్ణా, నెల్లూరు, పల్నాడు, గుంటూరు జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మరణించగా, కాకినాడ, నంద్యాల జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున గల్లంతయ్యారు. కాకినాడ జిల్లా రూరల్‌ మండలానికి చెందిన పొలవరపు సాయి(12) యేలేరు కాలవలో పడి మరణించారు. కోనసీమ జిల్లాలో ముమ్మిడివరం మండలానికి చెందిన జి.వీరవేణి ఇంటి ముందు తాటిచెట్టు పడి మరణించారు. కృష్ణా జిల్లాలో కృత్తివేన్ను మండలానికి చెందిన కోయ సుబ్బారావు(60) కొబ్బరి చెట్టు పడి మరణించారు. నెల్లూరు జిల్లాలో మనుబోలు మండలానికి చెందిన కృష్ణమనేని జయమ్మ(60) పశువులు మేపి ఇంటికి తిరిగి వస్తూ పొట్టేలు వాగులో కొట్టుకుపోయి మరణించారు. శ్రీకాకుళం జిల్లా పలాస మండలానికి చెందిన ఎస్‌.లావణ్య వలహగడ్డ వాగులో పడి మరణించారు. పల్నాడు జిల్లా వినుకొండ పట్టణానికి చెందిన మర్రెడ్డి రాములమ్మ(90) బుధవారం ఉదయం ఇంట్లో పాత మిద్దె కూలి మరణించారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన కొండ్రగుంట సీతమ్మ(49) మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో నిద్రించారు. ఉదయానికి సీతమ్మ మరణించారు. విద్యుదాఘాతంతో మరణించినట్లు కుటుంబ సభ్యులు చెబుతుండగా, అధికారులు మాత్రం గుండెపోటుతో మరణించి ఉంటుందని సందేహం వ్యక్తం చేశారు. నంద్యాల జిల్లా పాములపాడు మండలం భవనాశి వాగులో ఓ వ్యక్తి గల్లంతయ్యారు. కాకినాడలోని కుంభాభిషేకం రేవు వద్ద జి.శ్రీరామ్‌(23) బీచ్‌లో లంగర్‌ వేసే ప్రయత్నంలో గల్లంతయ్యారు. ఆపదలో చిక్కుకున్న 38 మందిని పోలీసులు, ఎన్డీఆర్‌ఎఫ్‌ సిబ్బంది సురక్షితంగా కాపాడారు. బాపట్ల జిల్లా పర్చూరు వాగులో కొట్టుకుపోతున్న షేక్‌ మున్నాని డ్రోన్‌ సహాయంతో గుర్తించి రక్షించారు.

కూలిన చెట్లు తక్షణమే తొలగింపు



అంబేడ్కర్‌ కోనసీమ జిల్లా కుందాలపల్లిలో విద్యుత్‌ పునరుద్ధరణ పనుల్లో ఎలక్ట్రికల్‌ సిబ్బంది

» 24 గంటల్లోనే విద్యుత్‌ సరఫరా పునరుద్ధరణ

(ఆంధ్రజ్యోతి న్యూస్‌ నెట్‌వర్క్‌)

మొంథా తుఫాన్‌ తీవ్ర నష్టం కలుగజేసినా.. దానివల్ల ప్రజలకు పెద్దగా అసౌకర్యం కలుగకుండా.. విధ్వంసం మరీ పెరగకుండా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టింది. ప్రధానంగా రోడ్లపై చెట్లు ఎక్కడ కూలినా.. అధికారులు తక్షణమే వాటిని తొలగిస్తూ వచ్చారు. విరిగిపడిన 380 చెట్లను తొలగించారు. అలాగే పెనుగాలులు, భారీవర్షాలకు విద్యుత్‌ సరఫరా నిలిచిపోవడంతో.. బుధవారం రాత్రిలోపే అన్ని చోట్లా సరఫరాను పునరుద్ధరించాలని సీఎం గట్టిగా ఆదేశాలివ్వడంతో దాదాపుగా ఆ ప్రక్రియను పూర్తిచేశారు. డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ జిల్లాలో 950 కొబ్బరిచెట్లు, వందల సంఖ్యలో ఇతర చెట్లు విరిగిపడగా.. 200 ట్రాన్స్‌ఫార్మర్లు, 600 విద్యుత్‌ స్తంభాలు దెబ్బతిన్నాయి. కాకినాడ జిల్లాలో 181 విద్యుత్‌ స్తంభాలు దెబ్బతిన్నాయి.. 49 చెట్లు కూలిపోయాయి. తూర్పుగోదావరి జిల్లాలో 244 విద్యుత్‌ స్తంభాలు, 26 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినగా 96 చెట్లు నేలకూలాయి. ఇతర జిల్లాల నుంచి రప్పించిన సిబ్బంది, క్రేన్ల సాయంతో చెట్ల తొలగింపు, విద్యుత్‌ పునరుద్ధరణ పనులు దిగ్విజయంగా పూర్తిచేశారు. పశ్చిమ గోదావరిలో విద్యుత్‌ సరఫరా పునరుద్ధరణకు 64 బృందాలను ఏర్పాటు చేశారు. 591 మంది సిబ్బంది సాయంతో 55 ఫీడర్స్‌(33/11 కేవీ)ను పునరుద్ధరించారు. విశాఖ జిల్లాలో రెండు గ్రామాలకు కరెంటు నిలిచిపోగా వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. ఈదురు గాలులకు అనకాపల్లి జిల్లాలో చెట్లు కూలడం, కొమ్మలు విరిగిపడడంతో 83 విద్యుత్‌ స్తంభాలు నేలకొరిగాయి. 31 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. అధికారులు, సిబ్బంది వెంటనే వెళ్లి చెట్లను తొలగించి.. స్తంభాలను సరిచేసి, సరఫరాను పునరుద్ధరించారు. తుఫాన్‌ ప్రభావిత ప్రాంతాల్లో పోల్‌ టు పోల్‌ సర్వే చేస్తూ.. తక్షణం విద్యుత్‌ పునరుద్ధరించాలని విద్యుత్‌ శాఖ అధికారులను మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ ఆదేశించారు. మంత్రి లోకేశ్‌ ఆయనకు ఫోన్‌ చేసి విద్యుత్‌ సరఫరా పునరుద్ధరణపై ఆరా తీశారు.



అంతర్వేది వెళ్లే రోడ్డుపై పడిపోయిన విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌, కొబ్బరిచెట్టు

విద్యుత్తుశాఖకు 18 కోట్ల నష్టం

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను కారణంగా విద్యుత్తు శాఖకు ప్రాథమిక అంచనా మేరకు రూ.18 కోట్ల మేర నష్టం వాటిల్లింది. సబ్‌స్టేషన్లు, ఫీడర్లు దెబ్బతినడం, గాలులకు విద్యుత్తు స్తంభాలు నేలకొరగడం, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం వల్ల ఈ నష్టం వాటిల్లింది. ఈపీడీసీఎల్‌ పరిధిలో అత్యధికంగా రూ.10.47 కోట్ల నష్టం వాటిల్లగా, సీపీడీసీఎల్‌ పరిధిలో రూ.65.19 లక్షలు, ఎస్పీడీసీఎల్‌ పరిధిలో రూ.85.25 లక్షల నష్టం వాటిల్లింది. గురువారం నాటికి తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో నూరు శాతం విద్యుత్తు సరఫరా పునరుద్ధరణ జరుగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ స్పష్టం చేశారు. 11 వేల మంది సిబ్బంది తుఫాను అనంతర పరిస్థితులను చక్కదిద్దే పనుల్లో నిమగ్నమయ్యారని తెలిపారు. విద్యుత్తుసరఫరా పునరుద్ధరణ పనులను పర్యవేక్షించిన డిస్కంల సీఎండీలను అభినందించారు.



మచిలీపట్నంలో మంగినపూడిరోడ్డులో చెట్టును తొలగిస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్‌ సిబ్బంది

వరదలో చిక్కి విలవిల

'ముసి'లో చిక్కుకున్న 121 మంది కూలీలు



ప్రకాశం జిల్లా కొండపి మండలంలో పొంగిన నల్లవాగు

కొండపి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా కొండపి మండలం చోడవరం సమీపంలో ముసి వాగు పరీవాహక ప్రాంతంలో 121 మంది కూలీలు వరద నీటిలో చిక్కుకున్నారు. వారిని కాపాడేందుకు ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న సహా రెవెన్యూ, పోలీసు అధికారులు బుధవారం ఉదయం నుంచీ తీవ్ర ప్రయత్నాలు చేసి.. రాత్రి 10 గంటల సమయానికి సురక్షితంగా తీసుకొచ్చారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన 121 మంది కూలీలు పొగాకు నారుమడుల్లో పనులకు వచ్చారు. వారంతా మునికి సమీపంలో తాత్కాలిక గుడిసెలు వేసుకొని ఉంటున్నారు. మంగళవారం అధికారులు వారి వద్దకు వెళ్లి చోడవరం జడ్పీ స్కూల్‌లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి రావాలని కోరారు. అయితే, తమకు ఎలాంటి ఇబ్బందీ లేదని చెప్పి అందరూ అక్కడే ఉండిపోయారు. మధ్యాహ్నానికి మునిలో నీటి ఉధృతి పెరిగి.. చోడవరం వద్ద నల్లవాగు కూడా పొంగింది. దీంతో కూలీలు తాము ఆపదలో ఉన్నామని, రక్షించాలని సమాచారం ఇచ్చారు. దీంతో సింగాయకొండ నుంచి బోట్లు రప్పించి వారిని సురక్షితంగా తీసుకొచ్చారు.

గుండ్లకమ్మలో చిక్కుకున్న మున్సిపల్‌ సిబ్బంది



బాపట్ల జిల్లా గుండ్లకమ్మ నది మధ్యలో బోటు తిరగబడటంతో చెట్టును పట్టుకుని ఉన్న మున్సిపల్‌ సిబ్బంది, మత్స్యకారులు

అద్దంకి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా అద్దంకి పట్టణానికి మంచినీటి సరఫరా చేసే ఊటబావుల పంపింగ్‌ స్కీమ్‌ వద్ద విధులు నిర్వహించే ముగ్గురు సిబ్బంది బుధవారం గుండ్లకమ్మ వరదలో చిక్కుకుపోయారు. వారిని కాపాడేందుకు వెళ్లిన ముగ్గురు జాలర్లు మున్సిపల్‌ సిబ్బందిని పడవ మీద ఎక్కించుకొని వస్తుండగా బోల్తాపడింది. దీంతో ఆరుగురు వరదలో చిక్కుకుపోయారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ విషయాన్ని కలెక్టర్‌ వినోద్‌కుమార్‌ దృష్టికి తీసుకెళ్లారు. సాయంత్రం 5 గంటల సమయానికి మరో మత్స్యకారుడు కుమార్‌ ధైర్యం చేసి పడవలో వారున్న చోటుకు వెళ్లాడు. ఆరుసార్లు వెళ్లి ఆరుగురినీ క్షేమంగా తీసుకొచ్చాడు. కుమార్‌ ధైర్యానికి కలెక్టర్‌ మెచ్చి రివార్డు ప్రకటించారు. మరోవైపు అద్దంకి ఎన్టీఆర్‌ నగర్‌కు చెందిన వనపర్తి హనుమంతరావు(80), రేక్‌నార్‌ లక్ష్మి(55) తుఫాన్‌ చలిగాలులకు తట్టుకోలేక మంగళవారం రాత్రి మృతిచెందారు.

వాగులో చిక్కుకున్న ట్రావెల్‌ బస్సు



వెంగాయపాలెం వాగులో చిక్కుకున్న ప్రైవేటు ట్రావెల్స్‌ బస్సు

కురిచేడు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ట్రావెల్స్‌ బస్సు వాగులో చిక్కుకోవడంతో నిద్రమత్తులో ఉన్న ప్రయాణికులు వణికిపోయారు. భయంతో కేకలు, హాహాకారాలు చేశారు. ఈ ఘటన ప్రకాశం జిల్లా కురిచేడు సమీపంలో వెంగాయపాలెంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. సకాలంలో పోలీసులు స్పందించి వారిని రక్షించడంతో కథ సుఖాంతమైంది. వివరాలివీ.. మొంథా తుఫాన్‌ ప్రభావంతో మంగళవారం రాత్రి భారీవర్షం కురిసి.. వెంగాయపాలెం సమీపంలో ఉన్న వాగు పొంగింది. హైదరాబాద్‌ నుంచి పామూరుకు 30మంది ప్రయాణికులతో వెళుతున్న ఓ ప్రైవేటు ట్రావెల్‌ బస్సు వాగులో మధ్యలోకి వచ్చేసరికి అధిక నీటి ప్రవాహానికి ముందుకు వెళ్లలేక ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు బెంబేలెత్తారు. వాగులో నీటి ప్రవాహం అంతకంతకూ పెరుగుతుండటంతో మరింత ఆందోళన చెందారు. వారి కేకలు విని స్థానికులు కురిచేడు ఎస్‌ఐ శివకు సమాచారం ఇచ్చారు. ఆయన వెంటనే సిబ్బందితో ఘటనా స్థలికి వచ్చారు. స్థానికులనూ అప్రమత్తం చేశారు. నడుములోతు నీటిలో దిగి బస్సు వద్దకు వెళ్లి ప్రయాణికులకు ధైర్యం చెప్పారు. ట్రాక్టర్‌ను పిలిపించి తాళ్లు కట్టి బస్సును బయటకు తీయించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ట్రాక్టర్‌పై.. రెండు వాగులు దాటి..



ట్రాక్టర్‌లో నక్కలవాగును దాటుతున్న గుంటూరు కలెక్టర్‌ అన్సారియా

గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్‌తో ఇబ్బందులు పడుతున్న ప్రజలను కలిసి సహాయం అందజేసేందుకు గుంటూరు కలెక్టర్‌ తమీమ్‌ అన్సారియా ట్రాక్టర్‌లో ప్రయాణించారు. తీవ్రత తగ్గాక బుధవారం ఉదయం ఆమె పెదనందిపాడు, కాకుమాను మండలాల్లో పర్యటించారు. ఆ సమయంలో వరగాని వద్ద నక్కలవాగు, మేకలవాగును దాటి అవతలికి ఆమె కారు వెళ్లలేని పరిస్థితి. అయినా ఆమె ట్రాక్టర్‌పై కూర్చుని ఆ రెండు వాగులను దాటి అవతలికి వెళ్లి నీట మునిగిన పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి బాధలను అడిగి తెలుసుకున్నారు. పత్తి పంట పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందని రైతులు నివేదించారు. యూరియా లభ్యత తక్కువగా ఉందన్నారు. కలెక్టర్‌ స్పందించి పంటలను రక్షించి రైతులకు అండగా ఉండాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రానికి వెళ్లి ప్రజలకు ధైర్యం చెప్పి తనే స్వయంగా భోజనం వడ్డించారు.


11 గంటలు చెట్టుపైనే!



డ్రోన్‌తో తాడుకట్టి కోటయ్యను లాగుతున్న పోలీసులు

పొన్నలూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం పచ్చవ గ్రామానికి చెందిన నూతలపాటి కోటయ్య మంగళవారం నెల్లూరు జిల్లా కందుకూరుకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయల్దేరాడు. రాత్రి 8 గంటల సమయంలో పొన్నలూరు-ఉప్పలదిన్నె వెళ్లే రోడ్డులో గొరిసెలేరు వాగు దాటేందుకు ప్రయత్నించి అందులో పడిపోయాడు. కొద్దిదూరం కొట్టుకుపోయాక వేపచెట్టును పట్టుకున్నాడు. దానిపైకి ఎక్కి రాత్రంతా బిక్కుబిక్కుమంటూ గడిపాడు. బుధవారం ఉదయం అటుగా వెళ్తున్నవారిని చూసి పెద్దగా కేకలు వేశాడు. వారిచ్చిన సమాచారంతో పోలీసులు వచ్చి.. డ్రోన్‌తో రోప్‌వేను కోటయ్యకు అందించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.

వెలిగొండ సొరంగాల్లోకి వరద



కార్మికులను బోటులో శ్రీశైలానికి తరలిస్తున్న అధికారులు

పెద్ద దోర్నాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి వరద నీరు ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండలంలోని వెలిగొండ ప్రాజెక్ట్‌ ఫీడర్‌ కెనాల్‌ ద్వారా సొరంగాలను ముంచెత్తింది. దీంతో లోపల పనిచేస్తున్న కార్మికులు భయాందోళనలకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న అధికారులు అప్రమత్తమై వెంటనే వారిని కొల్లంవాగు వైపు తీసుకెళ్లి బోటు ద్వారా 200 మందిని శ్రీశైలానికి తరలించారు. మరో 150మంది కార్మికులు అక్కడి శిబిరాలలోనే ఉన్నారు.

ఎక్స్‌కవేటర్‌పై గర్భిణి



బొల్లాపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్‌ ప్రభావంతో పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలంలో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ క్రమంలో బుధవారం ఉదయం పేరూరుపాడుకు చెందిన చిలకాబత్తిని జ్యోతికి పురిటి నొప్పులు వచ్చాయి. ఆమెను ఆస్పత్రికి తరలించేందుకు గ్రామస్థులు 108కు సమాచారం ఇచ్చారు. అయితే వాగు ఉధృతికి వాహనం వచ్చే పరిస్థితి లేదు. అధికారులు వెంటనే స్పందించి ఎక్స్‌కవేటర్‌ను రప్పించి, ఆమెను వాగు దాటించారు. 108లో వినుకొండ ఆస్పత్రికి తరలించారు.

మొంథా 'రూటే' సెపరేటు

» అన్ని అంచనాలను కాదని నరసాపురం వద్ద తీరం దాటిన తుఫాను

(విశాఖపట్నం- ఆంధ్రజ్యోతి)

మొంథా భిన్నమైన తుఫాను అని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు. తుఫాన్‌ తీరం దాటిన ప్రాంతం విషయంలో భారత వాతావరణ శాఖ అధికారులు చాలాసేపు తర్జనభర్జన పడ్డారు. కాకినాడకు దక్షిణంగా తీరం దాటుతుందని వాతావరణ శాఖ మూడు రోజుల క్రితం నుంచి చెబుతూ వచ్చింది. హంసలదీవి, అంతర్వేదిపాలెం వద్ద తీరాన్ని తాకినట్లు బుధవారం అంచనాలు వెలువడ్డాయి. చివరకు నరసాపురంలోని వాతావరణ శాఖ అబ్జర్వేటరీ కేంద్రంలో నమోదైన గాలులు, పీడనం వివరాలను పరిగణనలోకి తీసుకుని అక్కడకు సమీపంలో తీరం దాటిందని ప్రకటించింది. తుఫాన్‌ పడమర భాగం మంగళవారం ఉదయం తొలుత నెల్లూరును తాకడంతో అక్కడ భారీవర్షాలు కురిశాయి. ఆ తరువాత ప్రకాశం, గుంటూరు జిల్లాలను తాకడంతో ఎక్కువ వర్షాలు కురిశాయి. కాగా తుఫాన్‌కు ఉత్తరాన ఉండే మేఘాల ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి ఉత్తరాంధ్రలో వర్షాలు, అక్కడక్కడా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయని వాతావరణ అధికారి జగన్నాథకుమార్‌ తెలిపారు. తీరం దాటే సమయంలో మాత్రం అటు తక్కువగా కురిశాయన్నారు. వాతావరణంలో మార్పుల మేరకు ఇలా జరిగిందని కచ్చితంగా చెప్పలేమన్నారు. తుఫాన్‌కు తూర్పుభాగం విచ్ఛిన్నం కావడం, పడమర భాగంలో నీటి మేఘాలు ఎక్కువగా ఉండడంతో నరసాపురం సమీపాన తుఫాన్‌ తీరాన్ని దాటిందని, తూర్పుభాగంలో విండ్‌ షీర్‌ ఎక్కువ లేకపోతే కాకినాడ వైపు వచ్చి ఉండేదని అభిప్రాయపడ్డారు.

వ్యక్తికి వెయ్యి.. కుటుంబానికి 3 వేలు

» సహాయ, పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందినవారికి ప్రత్యేక సాయం

» ఉచితంగా నిత్యావసరాల సరుకులూ పంపిణీ

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌ కారణంగా సహాయ శిబిరాల్లో ఆశ్రయం పొందిన ప్రతి కుటుంబానికీ రూ.3 వేలు చొప్పున ప్రత్యేక సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సహాయ, పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన ప్రతి వ్యక్తికీ రూ.1,000, ప్రతి కుటుంబానికీ గరిష్ఠంగా రూ.3,000 అందించాలని సీఎం ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక సహాయ నిధులను డ్రా చేయడానికి కలెక్టర్లకు అనుమతి ఇస్తూ విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక సీఎస్‌ సాయిప్రసాద్‌ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే తుఫాన్‌ ప్రభావిత ప్రాంతాల్లో బాధిత కుటుంబాలకు ఉచితంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎం ఆదేశాలతో ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం (చేనేత, మత్స్యకార కుటుంబాలకు 50 కిలోలు), కిలో కందిపప్పు, చక్కెర, లీటర్‌ వంట నూనె (పామాయిల్‌), కిలో చొప్పున ఉల్లిపాయలు, బంగాళాదుంపలు పంపిణీ చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. తుఫాన్‌ ప్రభావం ఉన్న 19 జిల్లాల్లో ముందస్తుగా ఏర్పాటు చేసిన సహాయ శిబిరాల్లో ఆశ్రయం పొందిన బాధిత కుటుంబాలకు, తుఫాన్‌ వల్ల జీవనోపాధి దెబ్బతిన్న మత్స్యకార కుటుంబాలకు ఉచితంగా నిత్యావసర సరుకుల పంపిణీకి కలెక్టర్లకు అనుమతిచ్చింది.

నరసాపురంలో నల్లిక్రిక్‌ కాజ్‌వేకు గండి

» ఆక్వా చెరువులను ముంచెత్తిన సముద్రపు నీరు



నల్లిక్రిక్‌ కాజ్‌వే వంతెనకు పడిన గండిని పరిశీలిస్తున్న కలెక్టర్‌ నాగరాణి

నరసాపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్‌ బీభత్సానికి పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మండలం చినలంకకు వెళ్లే నల్లీక్రిక్‌ కాజ్‌వే వంతెనకు గండిపడింది. సముద్రకెరటాలు ఎగసి.. కాజ్‌వేను ముంచెత్తడంతో గండిపడి రోడ్డు రెండు ముక్కలైంది. దీంతో దానికి ఆనుకుని ఉన్న వందల ఎకరాల్లోని ఆక్వా చెరువులు నీట మునిగాయి. మత్స్యకారులు చేపల వేటకు దీని గుండానే వెళతారు. దీని పునర్నిర్మాణానికి ప్రభుత్వం ఇటీవల నిధులు మంజూరు చేసింది. త్వరలో పనులు చేపట్టాల్సి ఉంది.



కూలిన బ్రహ్మంగారి ఇంటిని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కూలిన కాలజ్ఞాని బ్రహ్మంగారి ఇల్లు

- తుఫాను ధాటికి పాక్షికంగా నేలమట్టం
- పునర్నిర్మించాలని కలెక్టర్‌ను కోరిన మంత్రి లోకేశ్

బ్రహ్మంగారిమఠం/కడప, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా బ్రహ్మంగారి మఠం మండలం కందిమల్లయ్యపల్లె గ్రామంలో కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నివాసం ఉన్న ఇల్లు పాక్షికంగా నేలమట్టమైంది. తుఫాను ప్రభావంతో మంగళవారం కురిసిన వర్షాలకు ఇంట్లోని స్తంభం కుంగిపోయింది. దీంతో ఇంటి గోడతో పాటు శ్లాబు కుప్పకూలింది. కాగా, వీరబ్రహ్మేంద్రస్వామి ఇంటిని పునరుద్ధరించడానికి, మన సాంస్కృతిక వారసత్వంలోని ఈ విలువైన భాగాన్ని కాపాడటానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను మంత్రి లోకేశ్ 'ఎక్స్'లో కోరారు. బుధవారం రాత్రి బ్రహ్మంగారి గృహాన్ని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కూలిన ఇంటిని భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా అదే మెటీరియల్‌తో ప్రత్యేక ఆర్కిటెక్చర్, ధార్మిక పరిషత్ సలహాలు, సూచనలతో పునర్నిర్మిస్తామని తెలిపారు.

'శ్రీశైలం' రహదారిపై విరిగిపడిన కొండచరియలు



శ్రీశైలం డ్యాంసైట్ వద్ద రోడ్డుపై విరిగిపడిన కొండచరియలు తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

శ్రీశైలం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీవర్షాల కారణంగా శ్రీశైలం నుంచి హైదరాబాద్ వెళ్లే రహదారిపై లింగాలగట్టు వద్ద బుధవారం తెల్లవారుజామున కొండచరియలు విరిగి పడ్డాయి. దీంతో తెలంగాణ వైపునకు బయల్దేరిన వాహనాలన్నీ శ్రీశైలంలో చిక్కుకుపోయాయి. పోలీసులు కొండచరియలను ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మరోవైపు భారీవర్షాల కారణంగా రోడ్ క్లియరెన్స్ లేకపోవడంతో ఫారెస్ట్ అధికారులు శ్రీశైలం నుంచి వాహనాల రాకపోకలు నిలిపివేశారు. దీంతో యాత్రికుల వాహనాలు టోల్‌గేట్ వద్ద బారులుదీరాయి. బస్సులు కదలకపోవడంతో వందలాది మంది యాత్రికులు అవస్థలు పడ్డారు. దేవస్థానం ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల్లో అల్పాహారం, మంచినీరు, పాలు, బిస్కెట్లను బస్టాండ్, ఔటర్ రింగ్‌రోడ్డు, శిఖరం ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్దకు తరలించి యాత్రికులకు అందించారు. సాయంకాలానికి దోర్నాలవైపు నుంచి కర్నూలు, విజయవాడ వెళ్లే వాహనాలను అధికారులు అనుమతించారు.

స్వల్పంగా పెరిగిన గోదావరి నీటిమట్టం

పోలవరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి నీటిమట్టం బుధవారం సాయంత్రానికి స్వల్పంగా పెరిగింది. పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 1,30,228 క్యూసెక్కుల జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 27.400 మీటర్లు, దిగువన 17.630 మీటర్లు నమోదైనట్టు ప్రాజెక్టు డీఈఈ అనిల్ కుమార్ తెలిపారు.

నేటి నుంచి యథావిధిగా బడులు

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాను తీరం దాటి వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో గురువారం నుంచి అన్ని పాఠశాలలు యథావిధిగా తెరుచుకునేలా కలెక్టర్లు ఆదేశాలు జారీచేశారు. పాఠశాల ప్రాంగణాల్లో చెట్లు పడిపోయినా, ఇతరత్రా అవాంతరాలుంటే వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జూనియర్ కాలేజీలు, ఉన్నత విద్యా సంస్థలు కూడా నేటి నుంచి పనిచేయనున్నాయి.

అప్రమత్తంగా ఉండండి: మంత్రి నిమ్మల

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాను తీరం దాటినా రాబోయే రెండు, మూడు రోజులు భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో ఇరిగేషన్ అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. బుధవారం తుఫాను తదనంతర పరిస్థితులపై మంత్రి జలవనరుల శాఖ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'ఆత్మకూరు, దోర్నాల ప్రాంతంలో భారీ వర్షాలతో వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్‌కు గండిపడింది. వెలిగొండ 2 టన్నెల్స్‌లోకి 9 కిలోమీటర్ల మేర లోనికి నీరు ప్రవేశించింది. టన్నెల్‌లో పనిచేస్తున్న 250మంది కార్మికులను సురక్షిత ప్రాంతానికి తరలించాం. టన్నెల్‌లో డీవాటరింగ్ పనులు వెంటనే చేపట్టాలని ఆదేశించాం. గుండ్లకమ్మ నుంచి 70వేల క్యూసెక్కులకు విడుదల చేస్తున్నాం' అని తెలిపారు.

రైతులెవ్వరూ అధైర్యపడవద్దు: మంత్రి నాదెండ్ల

ఏలూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి రికార్డు స్థాయిలో 51 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తాం. తుఫాను పరిస్థితులపై రైతులెవ్వరూ అధైర్యపడొద్దు' అని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఏలూరు జిల్లాలో వరద పరిస్థితుల సమీక్షలో భాగంగా ఆయన విలేకరులతో బుధవారం మాట్లాడారు. 'తుఫాను వలన తడిసిన ధాన్యం కొనుగోలు జరిపేందుకు రైస్ మిల్లర్లతో చర్చించాం. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోగా రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తాం. రైతు సేవా కేంద్రాల్లో టార్పాలిన్లు సిద్ధం చేశాం' అని మంత్రి నాదెండ్ల వివరించారు.

రాష్ట్రాన్ని కాపాడిన సీఎం: మంత్రి సత్యకుమార్

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధంగా ముందస్తు చర్యలు తీసుకుని మొంథా విపత్తు నుంచి రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు కాపాడారని మంత్రి సత్యకుమార్ తెలిపారు. సుదీర్ఘ పరిపాలనా దక్షత కలిగిన చంద్రబాబు కుటుంబ పెద్దగా తీసుకున్న చర్యల కారణంగానే ప్రాణ, ఆస్తినష్టం జరగలేదన్నారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్‌లోనే ఉంటూ రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ సచివాలయాల వరకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం ఇచ్చిన సూచనలు, ఆదేశాలు సత్ఫలితాలిచ్చాయన్నారు. వైద్యులు, సిబ్బంది 99.1శాతం మంది విధుల్లో ఉన్నారని తెలిపారు. ప్రధాని మోదీతో సీఎం మాట్లాడారని, తెలిపారు. కేంద్ర మంత్రి నడ్డా కూడా తనతో మాట్లాడారని, రాష్ట్రానికి అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారని మంత్రి తెలిపారు.

సత్వరమే పరిహారం!

87 వేల హెక్టార్లలో పంటనష్టం

ప్రాథమిక అంచనా ప్రకారం.. 304 మండలాల్లోని 1,825 గ్రామాల్లో 87వేల హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని, 78,796 మంది రైతులు నష్టపోయారని అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో పంట నష్టం ఇంకా పెరగవచ్చని చెప్పారు. ఈ సమీక్షలో మంత్రులు లోకేశ్, అనిత, సత్యప్రసాద్, సీఎస్ విజయానంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వీలైనంత త్వరగా పంట నష్టం అంచనా: చంద్రబాబు



ఓడలరేవులోని పునరావాస శిబిరంలో తుఫాను బాధితులకు నిత్యావసరాలు, ఆర్థిక సాయం అందజేస్తున్న సీఎం చంద్రబాబు

అమరావతి/అమలాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): 'మొంథా తుఫాన్ రాష్ట్రానికి తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని సీఎం చంద్రబాబు అన్నారు. అధికార యంత్రాంగం సత్వరమే స్పందించి చాలావరకు నష్టాన్ని నియంత్రించగలిగిందని చెప్పారు. వీలైనంత త్వరగా నష్టాన్ని అంచనా వేసి.. సత్వరం పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కౌలు రైతులకు అన్యాయం జరగకుండా చూస్తామన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో నష్టాన్ని పరిశీలించేందుకు బుధవారం ఆయన హెలికాప్టర్లో ఏరియల్ సర్వే చేశారు. ఉండవల్లి నుంచి బయల్దేరి.. బాపట్ల జిల్లా చీరాల, పర్చూరు, బాపట్ల ప్రాంతాలు, పల్నాడు, కృష్ణా, కోనసీమ, ఏలూరు జిల్లాల్లో సంభవించిన నష్టాన్ని పరిశీలిస్తూ.. తుఫాన్‌కు తీవ్రంగా దెబ్బతిన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం చేరుకున్నారు. ఓడలరేవు తీర ప్రాంతంలో ఉన్న ఓఎన్జీసీ టెర్మినల్‌లో ఉన్న హెలిప్యాడ్‌లో దిగారు. జిల్లాకు చెందిన కూటమి నేతలు ఆయనకు నష్టం వివరాలు తెలియజేశారు. అనంతరం సీఎం ఓడలరేవులోని పునరావాస కేంద్రానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. బెండమూర్లంకలో భారీవర్షాలకు దెబ్బతిన్న పంటచేలను పరిశీలించారు. వరి కంకులను పట్టుకుని.. రైతులతో మాట్లాడి పంట నష్టంపై ఆరాతీశారు. అరట్ల పాలెంలో బాధితులతో మాట్లాడారు. అంతకుముందు పునరావాస కేంద్రం వద్ద మీడియాతో మాట్లాడుతూ.. 'తుఫాన్ ప్రభావంవల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. చాలావరకు ఆస్తినష్టాన్ని నివారించగలిగాం. ఆస్తినష్టంపై నివేదిక వచ్చినతర్వాత చర్యలు తీసుకుంటాం. 2,200 పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసి 1.80 లక్షల మంది బాధితులకు పునరావాసం కల్పించి.. అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. మంగళవారం అర్ధరాత్రి ఒంటిగంట వరకు స్వయంగా తుఫాన్ ప్రభావాన్ని, సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించాను. ఇవాళ వాతావరణ పరిస్థితులు అనుకూలించనప్పటికీ స్వయంగా పర్యటనకు వచ్చాను. మంత్రులు, కలెక్టర్లు, అధికార యంత్రాంగమంతా సమష్టిగా కృషి చేయడం వల్లే నష్టాలు లేకుండా నివారించగలిగాం' అని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ముగ్గురు మృతిచెందారని, మరెక్కడా ప్రాణనష్టం లేదని తెలిపారు. డ్రైనేజీ, గుర్రపు డెక్క, ఆక్రమణల కారణంగా ముంపు సమస్య ఎదుర్కొంటున్నామని, దానిని పరిష్కరించాలని రైతులు కోరగా.. తక్షణం సమస్య పరిష్కారంపై దృష్టిసారించాలని అధికారులను సీఎం ఆదేశించారు. శిబిరాల్లో ఉన్నవారికి రూ.3 వేలు, 25 కిలోల బియ్యం ఇస్తున్నామని.. మత్స్యకారులకు, చేనేతలకు అదనంగా 50 కేజీలు ఇస్తున్నామని చెప్పారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ శరవేగంగా జరుగుతోందని.. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ వీలైనంత త్వరగా ఇబ్బందులను సరిదిద్దుతామని అన్నారు. తుఫాన్ పరిస్థితిని ప్రధాని మోదీ ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వచ్చారని తెలిపారు.

భద్రతను.. ప్రొటోకాల్‌ను పక్కన పెట్టి..

జడ్ ప్లస్ భద్రతలో ఉన్న చంద్రబాబు.. అల్లవరం పర్యటనలో ప్రొటోకాల్‌ను.. రక్షణను పక్కనపెట్టేశారు. సెక్యూరిటీ నిబంధనల ప్రకారం సీఎం కాన్వాయ్‌లో బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో ప్రయాణించాల్సి ఉన్నా.. ఇన్నోవా కారులోనే బాధితుల వద్దకు వెళ్లారు.

24 గంటల్లో రేషన్ పంపిణీ

- 5 రోజుల్లో పంట నష్టంపై నివేదిక
- నేటికల్లా రోడ్లపై గుంతలు పూడ్చాలి
- అలసత్వం వహిస్తే.. చర్యలు తప్పవు
- మృతుల కుటుంబాలకు 5 లక్షలు: సీఎం

అమరావతి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పునరావాస కేంద్రాల్లోని కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాల పంపిణీ గురువారంకల్లా జరగాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. మొంథా తుఫాన్‌తో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ఐదు రోజుల్లోగా పంట నష్టానికి సంబంధించిన పూర్తి నివేదిక ఇవ్వాలని వ్యవసాయ అధికారులకు స్పష్టంచేశారు. పంట నష్టం వివరాలు త్వరగా సేకరించేలా చూడాలన్నారు. దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పరిశీలించి.. వాటిని కాపాడేందుకు రైతులకు తగిన సూచనలు ఇవ్వాలని నిర్దేశించారు. బుధవారం ఉదయం తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే, అల్లవరం పర్యటన అనంతరం ఆయన సాయంత్రం రాష్ట్ర సచివాలయానికి చేరుకున్నారు. ఆర్టీజీఎస్ సెంటర్ నుంచి అధికారులతో సమీక్షించారు. సహాయ చర్యలు ఏ విధంగా కొనసాగుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరా, రహదారుల పునరుద్ధరణపై ఆరా తీశారు. బుధవారం రాత్రికే కరెంటు సరఫరా జరగాలని, గురువారం నాటికి రహదారులపై గుంతల మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్టీసీ బస్సు సర్వీసులను యథావిధిగా కొనసాగించాలని సూచించారు. ఈ విషయాల్లో అధికారులు అలసత్వం వహిస్తే.. చర్యలు తీసుకోవలసి వస్తుందని హెచ్చరించారు. పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని సూచించారు. తుఫాన్ కారణంగా ఇప్పటి వరకు ముగ్గురు మరణించారని అధికారులు సీఎం దృష్టికి తీసుకురాగా.. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున పరిహారం అందించాలని సీఎం ఆదేశించారు. ఎక్కడా తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, డయేరియా కేసులు నమోదైతే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.

ప్రకాశం కలెక్టర్‌పై అసహనం

ఒంగోలులో పలు కాలనీలు నీట మునగడంతో.. ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజబాబుపై సీఎం అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ ఇలాంటి పరిస్థితి తలెత్తలేదని, భవిష్యత్‌లో పాలనా వైఫల్యం కనిపించకూడదని స్పష్టం చేశారు.

ఇంకో రెండ్రోజులు కష్టపడితే మరింత ఊరట

గత నాలుగైదు రోజుల నుంచి మొంథా తుఫాన్ విషయంలో సమర్థంగా వ్యవహరించి, నష్ట నివారణ చర్యలు చేపట్టామని సీఎం అన్నారు. మరో రెండ్రోజులు ఇదే విధంగా పని చేస్తే.. బాధితులకు మరింత ఊరట కలుగుతుందన్నారు. బుధవారం ఉదయం జిల్లాల కలెక్టర్లు, అధికారులు, మంత్రులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 'రాష్ట్ర, జిల్లా యంత్రాంగాల నుంచి సచివాలయ సిబ్బంది, నేను... జట్టుగా పని చేశాం. కష్టకాలంలో బాధితుల కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు. వీలైనంత త్వరగా సాధారణ పరిస్థితి పునరుద్ధరించాలి. మంత్రులు, అధికారులు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలి. ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలి. సమస్యలు అడిగి తెలుసుకోవాలి. నష్టం అంచనాలను త్వరితగతిన సిద్ధం చేసి కేంద్రానికి నివేదిక అందివ్వాలి' అని సూచించారు. 'సచివాలయాలపై మైక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి.. కింది స్థాయి వరకూ ప్రభుత్వం ఇచ్చే సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాం. ఇదో నూతన విధానం. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు అందుబాటులో ఉంటే ప్రభుత్వంపై నమ్మకం కలుగుతుంది. మన చర్యలతో ప్రభుత్వంపై భరోసా పెరిగింది. తుఫాన్ కారణంగా ఇద్దరు చనిపోవడం బాధాకరం' అని సీఎం చెప్పారు.

కుళ్లు... మూసుకున్న కళ్లు!

మొంథాపైనా వైసీపీ బురద పంథా

- బాబు, పవన్ ఏసీ గదులకు పరిమితమయ్యారట
- జనం కష్టాలు పట్టించుకోనే లేదంటూ పోస్టు
- జగన్ పార్టీకి ప్రభుత్వ చర్యలు కనిపించ లేదా!?

(అమరావతి- ఆంధ్రజ్యోతి)

"రాష్ట్రం మొంథా తుఫానుతో విలవిల్లాడుతుంటే.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఏసీ గదులకు పరిమితమయ్యారు. ప్రజల ఇబ్బందులు వాళ్లకు పట్టలేదు!"

ఇది.. వైఎస్ జగన్ పార్టీ వైసీపీ తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో పెట్టిన పోస్టు! తుఫాను గురించి చంద్రబాబు పట్టించుకోనే లేదట! జనం ఇబ్బందులు వారికి పట్టలేదట! వైసీపీ బురద రాజకీయాలకు ఇదో ప్రత్యక్ష సాక్ష్యం! జనం కళ్లకు గంతలు కట్టడమే ఆ పార్టీ లక్ష్యం! ఎవరో కొందరైనా నమ్మకపోతారా అనే పిచ్చి నమ్మకం! అందులో భాగమే ఈ తప్పుడు విమర్శలు! 'మొంథా' అతితీవ్ర తుఫానుగా మారి ఏపీ తీరాన్ని తాకుతుందన్న అంచనాలు వెలువడిన క్షణం నుంచే ప్రభుత్వం అప్రమత్తమైంది. 'ఆస్తి నష్టం, ప్రాణనష్టం జరగకూడదు' అని చంద్రబాబు నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీనికి అనుగుణంగానే సచివాలయం నుంచి క్షేత్రస్థాయి వరకు యంత్రాంగం మెరుపువేగంతో కదిలింది. 19 జిల్లాలకు సీనియర్ ఐఏఎస్‌లను ఈనెల 25నే ఇన్‌చార్జిలుగా నియమించారు. ట్రెజరీ నిబంధనలను మినహాయించి అత్యవసర పనులకు ఎంతైనా ఖర్చు చేసే అధికారాన్ని కలెక్టర్లకు ఇచ్చారు. ముందస్తు చర్యల కోసం 25వ తేదీనే రూ.14 కోట్లు విడుదల చేశారు. తీవ్రత దృష్ట్యా మరో రూ.19 కోట్లు నిధులు ఇచ్చారు. పడిపోయిన చెట్లను పక్కకు తప్పించేందుకు క్రేన్లు, కట్టర్లు సిద్ధం చేశారు. తూర్పుగోదావరి జిల్లాకు వేల సంఖ్యలో విద్యుత్ స్తంభాలను తరలించారు. హెలికాప్టర్లు, డోర్నియర్ విమానాలు సిద్ధంగా ఉంచారు. చంద్రబాబు సోమవారం, మంగళవారం పూర్తిస్థాయిలో ఆర్టీజీఎస్‌లోనే ఉండి పరిస్థితిని సమీక్షించారు. మంగళవారం అర్ధరాత్రి దాకా అక్కడే ఉన్నారు. లోకేశ్, హోంమంత్రి అనిత ఆర్టీజీఎస్‌లో ఉండి సమన్వయం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ సోమవారం తమ పార్టీ కార్యాలయం నుంచి, మంగళవారం ఆర్టీజీఎస్‌లో సీఎంతో కలిసి సమీక్షించారు. ఇంతచేసినా... 'ఏసీ గదులకే పరిమితమైన చంద్రబాబు, పవన్, లోకేశ్' అని వైసీపీ కుళ్లు ప్రదర్శించింది. ఆర్టీజీఎస్‌లో ఏసీలు ఆఫ్ చేసుకుని, సమీక్షలు నిర్వహించాలన్నది జగన్ పార్టీ ఉద్దేశమేమో!

ఇవేవీ కనిపించలేదా...

తుఫాను వల్ల ఒక్కరి ప్రాణాలూ పోకూడదనే లక్ష్యంతో ప్రభుత్వ యంత్రాంగం తీవ్ర కసరత్తు చేసింది. మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న గర్భిణులను ముందుగానే ఆసుపత్రుల్లో చేర్చారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రతి ఇంటినీ జల్లెడ పట్టి... వృద్ధులు, ఒంటరి మహిళలను సహాయ శిబిరాలకు ఆటోల్లో తరలించారు. సెల్‌ఫోన్లలో అలర్ట్ మెసేజ్‌లు, దండోరాలతో ఊరూరా అప్రమత్తం చేశారు. మంగళవారం కాకినాడలో కొద్దిసేపు సూర్యుడు కనిపించడంతో తుఫాను ప్రభావం అంతంతేనని వైసీపీ సోషల్ మీడియా ప్రచారం చేసింది. ప్రజలు సహాయ శిబిరాల్లోకి వెళ్లకుండా నిరోధించే కుట్రకు తెరలేపింది. అయితే.. ప్రభుత్వ యంత్రాంగం 'ఈ ఒక్కరోజు రాత్రికి శిబిరాలకు రండి' అని బుజ్జగించి తీసుకెళ్లారు. లేనిపక్షంలో తీవ్ర ప్రాణనష్టం సంభవించేదని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

ఇదేమి 'స్టంట్'...

తుఫాను తీరం దాటిన కొన్ని గంటల్లోనే బుధవారం చంద్రబాబు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లారు. దీనిపైనా వైసీపీ బురదజల్లుడే! 'చంద్రబాబుకు సాయం చేసే ఉద్దేశం లేదు. అనుభవం లేదు, అట్ల కాడా లేదు... అంతా పబ్లిసిటీ స్టంటు' అంటూ మరో కుళ్లుబోతు పోస్టు! ఇదే జగన్ సీఎంగా ఉన్నప్పుడు... "సీఎం హోదాలో తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తే అధికారుల దృష్టంతా.. సీఎం పర్యటన వైపే ఉంటుంది. సహాయ చర్యలపై ఉండదు" అంటూ సూక్తిముక్తావళి వినిపించారు. ఇప్పుడు మాత్రం 'పబ్లిసిటీ స్టంటు' అంటూ రెండో నాలుకను బయటపెట్టారు. ఇక... జగన్ సీఎం హోదాలో చేసిన 'స్టంట్లు' అన్నీ ఇన్నీ కావు. పొలాల్లోనే రెడ్ కార్పెట్ పరిచి... వేదికలాంటి సెట్టింగ్ ఏర్పాటు చేసి దానిపైన తుఫాను బాధితులను 'పరామర్శించారు'. బాధిత రైతులు కుళ్లిపోయిన వరి కంకులను చేతికి అందించే ప్రయత్నం చేయగా... వాటిని జగన్ ముట్టుకోనూ లేదు. కాగా, తుఫాను సమయంలో ఎప్పట్లాగానే వీకెండ్ టూర్ కోసం బెంగళూరు ప్యాలెస్‌కు వెళ్లారు. తుఫాను సమయంలో అక్కడే ఉన్నారు. బుధవారం తిరిగి తాడేపల్లికి వచ్చారు.

గ్రామాల్లో సూపర్ శానిటేషన్

- రహదారులను పునరుద్ధరించాలి
- నీటి సరఫరా ఇబ్బందులు తొలగించాలి
- ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలు



అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫానును సమర్థంగా ఎదుర్కొన్నామని, ఇప్పుడు తుఫాను అనంతర చర్యలు అత్యంత కీలకమైనవని.. పక్కా ప్రణాళికలతో గ్రామాల్లో ఉపశమన చర్యలు చేపట్టాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్య, తాగునీటి సమస్యలు ఎదురుకాకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. "తీవ్రంగా దెబ్బతిన్న గ్రామాల్లో సూపర్ క్లోరినేషన్, సూపర్ శానిటేషన్ చేపట్టాలి. దెబ్బతిన్న రహదారులను ప్రాధాన్య ప్రకారం పునరుద్ధరించాలి. నీటి సరఫరాకు ఏవైనా ఇబ్బందులు ఉంటే ప్రత్యామ్నాయం చూడాలి. గ్రామాల్లో మొబైల్ శానిటేషన్ బృందాలను సిద్ధం చేయండి. 21,055 మంది పారిశుధ్య సిబ్బందిని బృందాలుగా ఏర్పాటు చేసి రంగంలోకి దింపండి. నీరు కలుషితంకాకుండా, వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మళ్లీ సాధారణ పరిస్థితి వచ్చేవరకు గ్రామాల్లో నిరంతరం పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకోవాలి. జిల్లా పరిషత్ సీఈవోలు, జిల్లా పరిషత్ చైర్మన్లు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు అందుబాటులో ఉండి పరిస్థితిని చక్కదిద్దాలి. అధికారులు ప్రతి జిల్లాలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసుకుని పనులను సమన్వయం చేసుకోవాలి." అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

గ్రామీణంలో భారీ నష్టం

తుఫాను ప్రభావంతో గ్రామీణ ప్రాంతాల్లో భారీగా నష్టం వాటిల్లిందని పవన్ తెలిపారు. గ్రామీణ నీటి సరఫరా విభాగానికి చెందిన వివిధ తాగునీటి పథకాలకు రూ.కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 779 రోడ్లు, 89 వంతెనలు, 473 కల్వర్టులు దెబ్బతిన్నాయని, వాటికి మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. పాక్షికంగా ధ్వంసమైన రోడ్లు, వంతెనలను జిల్లాస్థాయి నిధులతో బాగు చేసేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఎస్‌డీఆర్ఎఫ్ నిధులతో మిగిలిన వాటిని పునర్నిర్మించే ప్రక్రియ చేపట్టాలన్నారు. కాగా, భారీవర్షాలతో 1,583 గ్రామాలు తీవ్రంగా ప్రభావితమైనట్లు అధికారులు వివరించారు. 38 చోట్ల రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని, మరో 125 చోట్ల గుంతలు ఏర్పడ్డాయన్నారు. రక్షిత తాగునీటి పథకాల ట్యాంకుల దగ్గర క్లోరినేషన్ ప్రక్రియ చేస్తున్నామని వివరించారు.

సహాయ చర్యలు వేగవంతం చేయండి

- మరో 2 రోజులు అప్రమత్తం: లోకేశ్
- రోడ్లపై పేరుకున్న మట్టి, బురదను తొలగించాలి
- ఇళ్లకు పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా
- దెబ్బతిన్న చెరువులు, కాల్వగట్ల పటిష్టానికి చర్యలు
- తుఫాన్ జిల్లాల కలెక్టర్లకు మంత్రి ఆదేశం



ఆర్టీజీఎస్‌లో అధికారులతో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

అమరావతి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావిత జిల్లాల అధికారులు మరో రెండ్రోజులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. సహాయ చర్యలను వేగవంతం చేయాలన్నారు. బుధవారం సచివాలయం నుంచి ఆయా జిల్లాల కలెక్టర్లతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలతో రహదారులపై పేరుకుపోయిన మట్టి, బురదను తొలగించేందుకు అగ్నిమాపక శాఖ సహకారంతో తగిన చర్యలు చేపట్టాలని, తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో గృహాలు, వాణిజ్య సముదాయాలకు పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని సూచించారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలను కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవడంతోపాటు పంట నష్టంపై ప్రాథమిక అంచనాలను వీలైనంత త్వరగా అంచనాలు రూపొందించాలని, దెబ్బతిన్న నిర్మాణాల వివరాలను నివేదించాలని కోరారు. వంతెనలు, కల్వర్టులను పర్యవేక్షించడంతోపాటు వర్షాల ధాటికి దెబ్బతిన్న చెరువులు, కుంటలు, కాల్వ గట్లను పటిష్టపరిచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని.. పాము కాటుకు ఉపయోగించే యాంటీ వీనం ఔషధాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పారిశుధ్య నిర్వహణతోపాటు సురక్షితమైన తాగునీరు అందించాలని.. బాధితులకు అవసరమైన నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్‌లో హోం మంత్రి అనిత, సీఎస్ విజయానంద్, ఆర్టీజీఎస్ కార్యదర్శి కాటంనేని భాస్కర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

వరుసగా మూడో రోజూ ఆర్టీజీఎస్‌లోనే..

మొంథా తుఫాన్‌పై వరుసగా మూడో రోజు కూడా ఆర్టీజీఎస్ కేంద్రంలోనే ఉండి లోకేశ్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు. వివిధ జిల్లాల్లో తుఫాను అనంతర నష్టంపై ఉన్నతాధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రధానంగా కోనసీమ, కృష్ణా, బాపట్ల, ఎన్టీఆర్, ప్రకాశం జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర ఆటంకం కలిగిందని అధికారులు తెలిపారు. సరఫరా పునరుద్ధరణకు సత్వర చర్యలు తీసుకోవాలని లోకేశ్ ఆదేశించారు. మరోవైపు.. టీడీపీ శ్రేణులతోనూ ఆయన మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి బాధితులకు అవసరమైన సహాయం అందించాలని ఆదేశించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.